

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పే...



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

20-7-2026 సోమవారం సంపుటి: 32
సంచిక: 170 పేజీలు: 8+16 వెల: 6.50

ఖమ్మం

: fb.com/vaartha Digital

epaper.vaartha.com WWW.VAARTHA.COM

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


జమ్మూ-కాశ్మీర్‌లో వరద విలయం

పార్లమెంటు ర్యాలీని సక్సెస్ చేయండి: వాంగ్‌చుక్

5

చెస్ ఛాంపియన్‌షిప్‌లో.. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రిత్విక్‌కు రజతం 2

నేటి నుంచి పార్లమెంటు



ఆగస్టు 13 దాకా వర్షాకాల సమావేశాలు

కీలక బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం 2



ఆటలో

## పివి సింధు సరికొత్త చరిత్ర

జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో విజయం

ఫైనల్లో యమగుచిని ఓడించి టైటిల్ కైవసం

సింధు.. జపాన్‌లో చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్ తుదిపోరులోనూ అటాకింగ్ గేమ్‌తో విరుచుకుపడింది. ప్రపంచ నెంబర్3 ర్యాంకర్‌ను వరుస గేమ్‌ల్లో 21-17, 21-17తో చిత్తు చేస్తూ టైటిల్ ఎగరేసుకు పోయింది.

# అఖిలపక్షం రసాభాస

టిఎంసి రెబల్ ఎంపీలకు ఆహ్వానంపై ప్రతిపక్షాలు మండిపాటు... వాకౌట్

అనంతరం సమావేశానికి హాజరైన విపక్షాలు

చర్చకు అవకాశమివ్వాలని వినతి

పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరిగేలా అన్ని పార్టీలు సహకరించాలి: కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, నడ్డా, కిరణ్ రిజిజు



అఖిలపక్ష భేటీకి వెళ్తున్న కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, నడ్డా, కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ, జులై 19:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ఆదివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం రసాభాసగా సాగింది. అఖిలపక్ష భేటికి టిఎంసి రెబల్ ఎంపిలను ఆహ్వానించడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, సమావేశం నుంచి వాకౌట్ చేశాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా ఈ చర్య చేపట్టినట్లు ప్రతిపక్ష నేతలు తెలిపారు. కొద్దిసేపు అనంతరం ప్రతిపక్ష పార్టీల నేతలు >>2

## 'సర్'పై ఇన్‌చార్జి మంత్రులు

# పర్యవేక్షించాల్సిందే

వచ్చే 3వ తేదీ తర్వాతే గాంధీభవన్‌కు రండి

ఓటర్ల జాబితాల సవరణపై అలక్ష్యం వద్దు..

**ఉత్తమ 100 బిఎల్‌ఎలకు రాహుల్ గాంధీతో పరిచయం చేయిస్తా..**

'సర్'పై డి.సిఎం భట్టి, మహేష్, మీనాక్షితో జూమ్ సమావేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై19:** ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి పార్టీ నాయకత్వాన్ని అప్రమత్తం చేశారు. ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆదివారం నిర్వహించిన వర్చువల్ సమీక్ష (జూమ్ సమావేశం)లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎస్ఐఆర్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియ బాధ్యతలు అప్పగించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీఇన్‌ఛార్జిలంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా మంత్రులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, చివరి బాధ్యత వారిపైనే ఉంటుందని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమన్వయ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడాన్ని అవకాశంగా మలుచుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు.సోమవారం నుంచి 10 మంది ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటూనే ఎంపీలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో సమీక్షలు కొనసాగించాలని ఆదేశించారు.బాధ్యతలు నిర్వర్తించని ఎంపీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 489 ఎస్ఐఆర్ సమావేశాలు నిర్వహించినట్లు సీఎం తెలిపారు. బాగా వెనుకబడిన నియోజకవర్గాలలో ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది నాయకులు హైదరాబాద్‌కే పరిమితమై పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు ఎవరూ రావొద్దని సీఎం స్పష్టం చేశారు. చైర్మన్ పదవులు, పార్టీ పోస్టుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగేవారికి నియామకాలు ఉండవని తేల్చిచెప్పారు. జులై 30న మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని వెల్లడించారు.బూత్ లెవల్‌అధికారుల (బీఎల్ఓ)నివేదికలపై మాత్రమే ఆధారపడొద్దని సీఎం సూచించారు. పార్టీ తరఫున పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) నివేదికలను కూడా >>2



ఎల్‌నినో ఎఫెక్ట్:

## 10 ఉమ్మడి జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్లు

వర్షపాతం, పంటల పరిస్థితిపై నిరంతర సమీక్ష

నేటి నుంచే జిల్లాల్లో పర్యటనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై19:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఉమ్మడి జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన వర్షా భావ పరిస్థితులతోపాటు సీజనల్ పరిస్థితుల పర్యవేక్షణకు 10 ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా వర్షపాతం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వ్యవసాయ పంటల పరిస్థితి, విద్యుత్ సరఫరాపై ఈ అధికారులు నిరంతరం పర్యవేక్షించనున్నారు. సోమవారం వీరంతా >>2

# ఆరుతడి పంటలే మేలు

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మిషన్ మోడ్‌లో సూపర్ ఎల్‌నినోను ఎదుర్కొందాం: మంత్రి తుమ్మల

**వాననీటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి**

ముందస్తు ప్రణాళికతో సమగ్ర కార్యాచరణ: మంత్రి శ్రీధర్‌బాబు



కరీంనగర్‌లో ఆదివారం ఎల్‌నినోపై నిర్వహించిన సమావేశంలో మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, లక్ష్మణ్

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపనున్న సూపర్ ఎల్‌నినో పరిస్థితులను సమిష్టిగా ఎదుర్కొని రైతులు, ప్రజలను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తం మిషన్ మోడ్‌లో పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. వార్డు సభ్యుడి నుంచి ఎంపీ వరకు, పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని సమన్వయంతో పనిచేస్తేనే ఈ ప్రకృతి సవాలును సమర్థవంతంగా ఎదుర్కోగలమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, ప్రజలు అందరూ ఒక్కటై పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం సూపర్ ఎల్‌నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై.. నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్‌లు ..ఆది శ్రీనివాస్, చింతకుంట విజయ రమణారావు స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేష్ దత్ ఎక్కా, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో కలిసి పాల్గొన్నారు. సమావేశంలో సూపర్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రాజెక్టుల నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆరుతడి పంటల ప్రోత్సాహం, విద్యుత్ సరఫరా, రైతులకు అవగాహన కార్యక్రమాలు, జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు, భవిష్యత్ వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాల్లో చేపడుతున్న చర్యలను సమావేశంలో వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇరిగేషన్, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖల అధికారులకు మంత్రులు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ,.. ప్రస్తుత సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరించిన నేపథ్యంలో, >>2

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ 6

**మంత్రి సీతక్క ఆదేశాలతో ఉపాధి కల్పన, జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం**

**నేడు అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు**



ఉదయ్ కృష్ణారెడ్డి (ఫైల్)

జాతీయ పోలీసు అకాడెమీలో ఘోరం!

## ట్రైనీ ఐపిఎస్‌పై లైంగిక వేధింపులు

**శిక్షణలో ఉన్న మహిళా అధికారిపట్ల అసభ్య ప్రవర్తన, చంపుతామని బెదరించిన మరో ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి**

నిందితునిపై అత్తాపూర్‌లో కేసు నమోదు

**బర్తరఫ్ చేసే అవకాశం.. అరెస్టుకు రంగం సిద్ధం!**

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** నగర శివార్లలోని శివరాంపల్లిలో గల సర్దార్ వల్లభభాయి జాతీయ పోలీసు అకాడమి (ఎన్‌పిఎ)లో లైంగిక వేధింపులు కలకలం రేపాయి. ఐపిఎస్ అధికారుల శిక్షణ కేంద్రంగా పేరొందిన ఎన్‌పిఎలో శిక్షణలో వున్న మహిళా ఐపిఎస్ అధికారిపై శిక్షణలోనే వున్న ఉదయ్ కృష్ణారెడ్డి అనే మరో ట్రైనీ అధికారి ఈ వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు పోలీసు శాఖలో సంచలనం రేపింది. ఈ ఘటనకు బాధ్యుడుగా వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు ఇతన్ని అకాడమి నుంచి భర్తరఫ్ చేయనున్నట్లు సమాచారం. లైంగిక వేధింపుల కేసులో నిందితుడుగా వున్న ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఎపిలోని ప్రకాశం జిల్లా సింగరాయకొండ వాసి. ఇతను మొదట్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 2024లో ఐపిఎస్ సాధించడం గమనార్హం.

జాతీయ పోలీసు అకాడమిలో ఐపిఎస్ శిక్షణలో వున్న మహిళా అధికారిపై ఉదయ్ కృష్ణారెడ్డి అనే మరో ట్రైనీ అధికారి లైంగిక వేధింపులకు పాల్పడిన ఉదంతంపై అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఉదయ్ కృష్ణారెడ్డి కొంతకాలంగా ట్రైనీ ఐపిఎస్ అధికారిణిని లైంగికంగా వేధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ప్రైవేటు వీడియోలు ఆమెకు తెలియకుండా తీసి, వాటిని ఆమె భర్తకు పంపి బ్లాక్ మెయిల్‌కు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో పాటు బాధితురాలికి అసభ్యకరంగా వాట్సాప్ మెసేజ్‌లు పంపాడని, ఆమె పట్ల అకాడమిలో చెడుగా ప్రచారం చేసినట్లు ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల తొమ్మిదవ >>2

# 2.96 లక్షల సీట్లు ఖాళీ!

ఇప్పటి దాకా డిగ్రీలో 1,41,143 మంది చేరిక

గ్రామీణ ప్రాంతాల్లో మరీ తక్కువగా డిగ్రీ అడ్మిషన్లు

ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 25 శాతం దాటని ప్రవేశాలు

మూడు విడతల్లో ముగిసిన దోస్త్ అడ్మిషన్లు

నేటి నుంచి స్పెషల్ ఫేజ్ అడ్మిషన్స్ షెడ్యూల్ ప్రారంభం




**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 19:** తెలంగాణ రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల్లో లక్షలాది సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలిస్తే ఇప్పటి వరకు 1,41,143 మంది డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరారు. ఇంకా రాష్ట్రంలో 2,96,66 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 929 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 4,37,809 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 1.41,143 మంది మాత్రమే చేరారు. తెలంగాణ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్(దోస్త్) పేరుతో డిగ్రీలో అడ్మిషన్లు చేపడుతున్న విషయం తెలిసిందే. దోస్త్ ద్వారా ఇప్పటికే మూడు విడతల్లో సీట్ల కేటాయింపు చేశారు. సీట్ల కేటాయింపులో భాగంగా ఇప్పటి వరకు కాలేజీల్లో 1,41,143 మంది విద్యార్థులు చేరారు. నేటి(సోమవారం) నుంచి స్పెషల్‌ఫేజ్ అడ్మిషన్ షెడ్యూల్‌ను ప్రారంభించనున్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రకటించిన దోస్త్ అడ్మిషన్ల లెక్కల >>2

# క్యూర్ పరిధిలో ఎల్ఐజి ఇళ్లు

అర్హులైన పేదల కోసం భారీగా నిర్మాణం

**కార్యక్రమానికి నేడు శ్రీకారం: మంత్రి పొంగులేటి**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై19:** రాష్ట్రంలో పేదవాడి సొంతింటి కల నెరవేరే వరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుందని,ఇది ఒకసారి చేపట్టి ముగించే కార్యక్రమం కాదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారం శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.రాష్ట్రంలో గూడు లేని ప్రతి అర్హులైన నిరుపేద కుటుంబానికి చివరి లబ్ధిదారుని వరకు గౌరవప్రదమైన సొంతింటిని నిర్మించి అందించే వరకు ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని అన్నారు.

పేదల సొంతింటి కలలను సాకారం చేయడమే సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రాష్ట్రంలో ఇల్లులేని ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన, సౌకర్యవంతమైన సొంత నివాసం కల్పించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తూ పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటికే సుమారు 2 లక్షల ఇళ్లు పూర్తై లక్షలాది కుటుంబాలు గృహప్రవేశాలు >>2



ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మాతా వైష్ణోదేవి యాత్రను ఆదివారం నిలిపివేయడంతో జమ్మూ కాశ్మీర్‌లోని కత్రాలో బంగంగా ప్రవేశ ద్వారం వద్ద వేచి ఉన్న భక్తులు

# ఆరుతడి పంటలే మేలు

>> రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలను ఇప్పటికే ప్రారంభించిందన్నారు. గత ఏప్రిల్ నెల నుంచే రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమాలు, గ్రామసభల ద్వారా రైతులకు సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రకృతి పరిస్థితులను ముందుగానే రైతులకు వివరించి నష్టాలను తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రపంచవ్యాప్తంగా విపత్కర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలపై కూడా సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశముందని చెప్పారు. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదుకాకపోవచ్చని, అందువల్ల ముందస్తు కార్యాచరణతోనే రైతులు, ప్రజలను రక్షించగలమన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగంతో పాటు అన్ని రంగాలపై పడే అవకాశముందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఏ రిజర్వాయర్ నుంచీ సాగునీటిని విడుదల చేసే పరిస్థితి లేదని, రాబోయే రోజుల్లో తాగునీటి సమస్యలు కూడా తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు ఇప్పటికే అనేక ప్రాంతాల్లో 10 మీటర్ల వరకు తగ్గిపోయాయని, రాష్ట్రంలోని జలాశయాల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా రైతాంగాన్ని అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జి మంత్రుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం రాష్ట్రం ముందున్న అతిపెద్ద సవాల్ అని, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేసి రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు, ప్రజలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తొలిసారిగా ముందస్తు ప్రణాళికతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందన్నారు. జిల్లాల కలెక్టర్లు స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌తో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, కరోనా మహమ్మారి సమయంలో అందరూ సమిష్టిగా పనిచేసి సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించినట్లే, ఇప్పుడు సూపర్ ఎల్‌నినో కారణంగా ఏర్పడుతున్న విపత్కర పరిస్థితులను కూడా అదే స్ఫూర్తితో సమన్వయంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

# జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్లు

>> జిల్లాల పర్యటనకు వెళ్లాలని ప్రభుత్వం జారీ చేసిన ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక అధికారులు.. మంత్రులు, కలెక్టర్లతోపాటు జిల్లా స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తారు. ఆయా జిల్లాల్లో ఉన్న వాతావరణ పరిస్థితులపై సమీక్షించాల్సి ఉంటుందని, ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు చేశారు. ఏ సమయంలో ఏ శాఖ అధికారులతో సమీక్షించాలో స్పష్టం చేస్తూ కీలక సూచనలు చేశారు. జిల్లాల్లో వర్షపాతం, ఇప్పటి వరకు పంటల సాగు అయిన వాటి వివరాలు, ఇంకా ఏ రకమైన పంటలు వేయవచ్చు, ప్రత్యామ్నాయ పంటలకు అవకాశాలు, అక్కడి భూములు వేటికి అనువుగా ఉంటాయి తదితర వివరాలపై చర్చించాలని స్పష్టం చేశారు. చెరువులు, డ్యాం, రిజర్వాయర్‌లో ఎంత నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితి, వీబీజీ రామ్‌జీ పనులు ఎలా సాగుతున్నాయి? ఇంకా ఎన్ని పనిదినాలు అవసరం ఉంటాయో తదితర వివరాలను ఇంచార్జ్ మంత్రితో కలిసి సమీక్షించి నివేదిక తయారు చేసి సిఎస్‌కు అందజేయాల్సి ఉంటుంది. పట్టణాల్లో తాగునీటి పరిస్థితి గురించి సమీక్షించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

| జిల్లా | స్పెషల్ ఆఫీసర్ |
|---|---|
| ఆదిలాబాద్ | ఇలంబర్తి కె |
| కరీంనగర్ | బిఎండీ ఎక్కా |
| వరంగల్ | ఎ.శ్రీదేవసేన |
| మెదక్ | ఎ.వాణి ప్రసాద్ |
| నిజామాబాద్ | యోగితా రాణా |
| హైదరాబాద్ | జయేశ్‌రంజన్ |
| రంగారెడ్డి | వికాస్‌రాజ్ |
| నల్లగొండ | హరిచందన దాసరి |
| మహబూబ్‌నగర్ | వి.పి. గౌతమ్ |
| ఖమ్మం | అనుదీప్ దురిశెట్టి |

## చెస్ ఛాంపియన్‌షిప్‌లో.. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రిత్విక్‌కు రజతం

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** ఫ్రాన్స్ మెనూయిర్స్ ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ రజతం సాధించాడు. 7.0/9 పాయింట్లతో ఓటమి లేకుండా రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకున్నాడు. ఉత్కంఠభరితమైన చివరి రౌండ్‌లో టాప్ సీడ్ ఫ్రాన్స్ జీఎం లగార్డే మాక్సిమ్‌పై ఘన విజయం సాధించాడు. టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోకుండా రన్నరప్ ట్రోఫీని (రజత పతకం) కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో 4వ సీడ్‌గా బరిలోకి దిగిన హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ మొత్తం 9 రౌండ్లలో 7.0 పాయింట్లు సాధించాడు. ఫ్రాన్స్, ఇండియా, చైనా, జర్మనీ, పోలాండ్, నెదర్లాండ్స్, ఇటలీ వంటి దేశాల నుండి 86 మంది అత్యుత్తమ ఆటగాళ్లు పాల్గొన్న ఈ పోటీలో, రిత్విక్ అసాధారణమైన వ్యూహాత్మక చతురతను ప్రదర్శించాడు. 5 విజయాలు, 4 డ్రాలతో టోర్నమెంట్ అంతటా అజేయంగా నిలిచాడు. ఈ ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానం కోసం ఇద్దరు భారతీయ క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోరు సాగింది.

గ్రాండ్ మాస్టర్ రోహిత్ కృష్ణ, జీఎం రాజా రిత్విక్ ఇద్దరూ తలా 7.0 పాయింట్లతో సంయుక్తంగా మొదటి స్థానంలో నిలిచారు. అయితే, టై బ్రేక్ లెక్కింపు ఆధారంగా జీఎం రోహిత్ కృష్ణ (టైబ్రేక్ స్కోరు 43) స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, రిత్విక్ (టైబ్రేక్ స్కోరు 41.5) రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఒమెల్జా ఆర్టెమ్ 6.5 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించాడు.

నాటకీయంగా సాగిన చివరి 9వ రౌండ్‌లో రిత్విక్ (రేటింగ్ 2521), తన కంటే ఎంతో ఎక్కువ రేటింగ్ ఉన్న ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ లగార్డే మాక్సిమ్‌ను (రేటింగ్ 2622) ఓడించి సంచలన విజయం నమోదు చేశాడు. ఈ అద్భుత విజయంతో తన పోడియం స్థానాన్ని ఘనంగా ఖరారు చేసుకున్నాడు.

# నేటి నుంచి పార్లమెంటు

## ఆగస్టు 13 దాకా వర్షాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ, జులై 19:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగనున్నాయి. ఈ సమావేశాల్లో కీలక బిల్లులు, ప్రజా ప్రాధాన్య అంశాలపై చర్చలు జరగనున్నాయి. నీట్ యుజి పేపర్ లీక్, అయోధ్య వివాళాల చోరీ తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సిద్ధమైంది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా కిరణ్ రిజిజు ఆధ్వర్యంలో ఆదివారం అఖిల పక్ష సమావేశం వాడివేడిగా సాగింది. ప్రజా సమస్యలపై తొలుత చర్చకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు డిమాండ్‌చేశాయి. అందరూ సహకరిస్తే, ఖచ్చితంగా అన్ని అంశాలపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రులు ప్రతిపక్షాలకు స్పష్టంగా తెలియజేశారు. ఇదిలా ఉండగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా సోమవారం రాజ్యసభలో 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ)బిల్లు, 2026'ను ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం జాతీయ గీతం 'జన గణ మన'కు కల్పిస్తున్న చట్టపరమైన, శాసనపరమైన రక్షణనే జాతీయ గీతం 'వందేమాతరాన్ని'కి కూడా కల్పించాలని ఈ ప్రతిపాదిత చట్టం కోరుతోంది. ఈ బిల్లు చట్టంగా మారితే, 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ చట్టం' సవరించబడుతుంది. దీనిప్రకారం వందేమాతరాన్ని అవమానించడం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతుంది. తద్వారా చట్టపరమైన రక్షణల విషయంలో ఇది జాతీయ గీతంతో సమాన స్థాయికి వస్తుంది. ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం, జాతీయ గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినా లేదా దాని గానానికి ఆటంకం కలిగించినా, ఆ వ్యక్తికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమాలలో 'జన గణ మన'తో పాటు 'వందేమాతర'ాన్ని కూడా ఆలపించేటప్పుడు, ముందుగా 'వందేమాతర'ాన్ని ఆలపించాలన్న ఆదేశాలను కచ్చితంగా పాటించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జులై 9న అన్ని రాష్ట్రాలకు జారీచేసిన ఆదేశాల నేపథ్యంలోనే ఈ శాసనపరమైన చర్య చేపట్టబడింది. ప్రతిపాదిత సవరణను పార్లమెంటు జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లో చర్చకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

## వారం - వర్జ్యం

20-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
సప్తమి తె.4.04, హస్త రా.7.14
వర్జ్యం : రా.3.47 - తె.5.29
దు.ము.12.40-మ.1.32
(2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఆశలు వదులుకున్న కార్యక్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషిచేసి కొంత పురోభివృద్ధి సాధిస్తారు.

**వృషభం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు అధిగమిస్తారు. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వాహనసౌఖ్యం పొందుతారు.

**మిథునం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి.

**కర్కాటకం:** ఏకాగ్రత లోపించడంవల్ల కొన్ని కార్యక్రమాలు వాయిదా వేస్తారు. క్రయ విక్రయాలలో తొందరపాటు వద్దు.

**సింహం:** ఇతరులు ఇచ్చే సలహాలు మీకు ఉపకరించవు. ఆరోగ్య సూత్రాలను పాటించవలసిన కాలం, ఓర్పు మేలు చేస్తుంది.

**కన్య :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో క్రమ విక్రయాలలో అనుకున్నంతగా లాభాలు పొందలేకపోవచ్చు.

**తుల :** కొన్ని వ్యవహారాలలో ఊహించని విజయం సాధిస్తారు. సోదరులతో ఏర్పడిన వివాదాలు తీరుతాయి. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేస్తారు. కాంటాక్టులు లభిస్తాయి.

**ధనుస్సు:** వ్యాపార విస్తరణకు నిపుణులతో చర్చించి కార్యాచరణలో కొంత అభివృద్ధిని సాధిస్తారు. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం:** అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది. సహచర వర్గం కరువవుతారు. నూతనవస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. బాధ్యతలు సమర్థవంతంగా పూర్తి చేస్తారు. పెట్టుబడులకు అనుకూలం.

**మీనం :** మీ మేధస్సు నలుగురిలో ప్రశంసించబడుతుంది. ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పర్యవేక్షించాల్సిందే

>> తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పార్టీ బీఎల్‌ఏలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. రానున్న పది రోజులు నాయకులంతా నియోజకవర్గాల్లోనే పర్యటించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. గాంధీభవన్ బృందం బీఎల్‌ఏ, బీఎల్‌ఓ నివేదికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యుత్తమంగా పనిచేసిన 100 మంది బీఎల్‌ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పించడంతో పాటు ఆయనతో ఫొటో దిగే అవకాశం కూడా ఇస్తామని ప్రకటించారు. చైర్మన్ పదవులు, పార్టీ పోస్టులు కావాలని గాంధీభవన్ చుట్టూ తిరగొద్దు. అలాంటి వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దు అని మరోసారి స్పష్టం చేశారు. ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నా కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలి. ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్న చోట ఎంపీలు పనిచేయకపోతే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పార్టీ పరంగా ఎస్ఐఆర్ ఇన్‌చార్జీలుగా ఉన్న వారు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, చైర్మన్లు బీఎల్‌ఓల రిపోర్టుల కంటే బీఎల్‌ఏల రిపోర్టులను పరిశీలించాలి. బీఎల్‌ఓల రిపోర్టుల మీద మాత్రమే ఆధారపడితే కఠిన చర్యలు ఉంటాయి, పార్టీ పరంగా పనిచేస్తున్న బీఎల్‌ఏలను నాయకులు సమర్థవంతంగా ఉపయోగించాలని చెప్పారు. పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలి. హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదన్నారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో నియోజకవర్గాల్లో పర్యటించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎస్ఐఆర్‌కు నియమించిన పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. బీఎల్‌ఏ, బీఎల్‌ఓ రిపోర్టులను గాంధీభవన్ టీం ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. ఎస్ఐఆర్‌ను ఇన్‌చార్జ్ మంత్రులు పూర్తి పర్యవేక్షణ చేయాల్సిందే. అన్నింటికీ వారిదే బాధ్యత అని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లను సమన్వయం చేయాలని సూచించారు. జూమ్ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ మాట్లాడుతూ సర్ ప్రక్రియ చాలా కీలకమైనది.. ఎవ్వరు కొంచం కూడా నిరక్ష్యంల్ల చేయవద్దు అని సూచించారు. నాయకులు అందరూ వారి నియోజక వర్గాలలో సర్ ప్రక్రియ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నేతలంతా ఆగస్టు 3వ తేదీ వరకు సర్ ప్రక్రియపైనే ఉండాలి. చిన్న నిర్లక్షాన్ని కూడా సహించేది లేదన్నారు. ఎమ్మెల్యేలు, ఇంచార్జ్ లు సర్ పనులను వేగవంతం చేయాలి. బిఎల్‌ఏ లకు సహకారం అందించాలని చెప్పారు..దేశంలో సర్ వల్ల జరిగిన నష్టాలను గుర్తించి ఇక్కడ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎన్నికల ప్రచారంలో మనం ఎంత కష్టపడుతామో అలాగే ఇప్పుడు ఈ పనులను చేయాలి అని పిలుపునిచ్చారు. సర్ పనులు పూర్తయ్యే వరకు నియోజక వర్గాలలో ఉండాలి. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోవొద్దు అని పేర్కొన్నారు.

# క్యూర్ పరిధిలో ఎల్‌ఐజి ఇళ్లు

>> చేశాయని, మిగిలిన ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందన్నారు. గత నెల 2వ తేదీన ఆసిఫాబాద్ జిల్లాలో సిఎం రేవంత్ రెడ్డి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. రెండో విడతలో హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇండ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం, ఇప్పుడు హైదరాబాద్ నగరంతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల సొంతింటి కలను కూడా నిజం చేయబోతోందని మంత్రి పేర్కొన్నారు.

క్యూర్ పరిధిలో లక్ష ఎల్‌ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్ అంతో కలిసి దరఖాస్తు విధానం, అర్హతలు, బ్రోచర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

పేదల ఇళ్ల కోసం నగరంలో కోట్ల రూపాయల విలువైన అత్యంత కీలక ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించిందని, ఆయా ప్రాంతాలలో స్థానిక పరిస్థితులను బట్టి ఒక ఎకరా నుండి ఐదు ఎకరాల వరకు స్థలాలను సేకరించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వాల మాదిరిగా నగరానికి దూరంగా కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు.

కుటుంబాల జీవనోపాధికి, పిల్లల చదువులకు, ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. అధునాతన సౌకర్యాలతో బహుళ అంతస్తుల (పది అంతస్తుల వరకు) భవనాల నిర్మాణం చేపట్టి, ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గాన్ని ప్రత్యేక యూనిట్‌గా తీసుకుని అమలు చేస్తున్న ఈ పథకంలో ఆ నియోజకవర్గ ప్రజలు అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని, గత ఏడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

## పివి సింధుకు అభినందనలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై19:** జపాన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో టైటిల్ విజేతగా నిలిచిన భారత స్టార్ షట్లర్ పివి సింధుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కెరీర్‌లో తొలి సూపర్750 టైటిల్‌ను సాధించడం భారత క్రీడా రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. తన ప్రతిభ, కృషి, పట్టుదలతో దేశ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న సింధు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలో ఆదివారం నిరసన ప్రదర్శన అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న కాక్రోచ్ పార్టీ మద్దతుదారులు

# అఖిలపక్షం రసాభాస

>> అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యారు. తమ వాదనను వినిపించారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, కిరణ్ రిజిజు నేతృత్వంలో ఆదివారం అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాలు సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. పార్లమెంట్ ఎంత బాగా పనిచేస్తే దేశానికి అంత ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఉభయ సభల్లో ప్రతిపక్షాల అభిప్రాయాలను వింటామని రిజిజు స్పష్టం చేశారు. అదే సమయంలో వారు కూడా తమ వైపు వాదనలను వింటారని ఆశిస్తున్నామని కిరణ్ రిజిజు ఆశాభావం వ్యక్తం చేశారు.

ముందుగా ప్రజా సమస్యలపై చర్చకు అవకాశమివ్వాలని ప్రతిపక్ష పార్టీల నేతలు కోరుతూ, కొన్ని సూచనలు, సలహాలు చేశారు. అదే సమయంలో తిరుగుబాటు చేసిన 20 మంది టిఎంసి ఎంపిలకు లోక్ సభలో ప్రత్యేక సీట్లు కేటాయించడం, అలాగే శివసేన (యుబిటి)కు చెందిన ఆరుగురు ఎంపిలను ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో విలీనం చేయడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. అఖిలపక్ష సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడుతూ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 40 మంది ఫ్లోర్ లీడర్లు అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యారని, వర్షాకాల సమావేశాల్లో చర్చించబోయే అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారని వివరించారు.

పశ్చిమాసియాలో నెలకొన్న సంఘర్షణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీలు కలిసి పనిచేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విజ్ఞప్తి చేశారని రిజిజు పేర్కొన్నారు. "అనేక రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశాయి. తాము వాటిని విని నమోదు చేసుకున్నాము. అనేక సూచనలు వచ్చాయి, వాటిని కూడా నమోదు చేసుకున్నాము... ఏదైనా రాజకీయ పార్టీ చర్చలో పాల్గొనకుండా కేవలం నినాదాలకే పరిమితమైతే, దానివల్ల రాజకీయంగా నష్టం వాటిల్లుతుందని మీరు గమనించే ఉంటారు.

ఇది అందరికీ తెలిసిన విషయమే... చర్చకు దూరంగా ఉండి గందరగోళం సృష్టిస్తే ఏ రాజకీయ పార్టీకీ రాజకీయ ప్రయోజనం చేకూరదు. ఇది రుజువైన విషయం. కాబట్టి, అందరూ చర్చలో పాల్గొనాలి. చిన్న పార్టీల సభ్యులు తమకు మాట్లాడేందుకు ఎక్కువ సమయం కేటాయించాలని కోరార్లు అని ఆయన అన్నారు. సమావేశాలు సజావుగా సాగితే అందరూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని, అయితే "గందరగోళం సృష్టిస్తే మాత్రం మాట్లాడే అవకాశం లభించదు" అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి స్పష్టం చేశారు. "తర్వాత, తగినంత చర్చ లేకుండానే బిల్లు ఆమోదించబడిందని లేదా గందరగోళం మధ్య ఆమోదించబడిందని ప్రభుత్వంపై నిందలు వేయకూడదు... పార్లమెంటు పని చేయాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు, పార్లమెంటు పని చేయకపోతే అది ప్రజాస్వామ్యానికి మంచిది కాద్లు అని ఆయన పేర్కొన్నారు.

ఇక అఖిపక్ష సమావేశానికి 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియ్లా (ఎన్‌సిపిఐ) సభ్యులను ఆహ్వానించడాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సమర్థించారు. విపక్షాలకు వాకౌట్ చేసే హక్కు ఉన్నప్పటికీ, ఎన్నికైన 20 మంది ఎంపిలను చర్చల నుంచి మినహాయించడం సముచితం కాదని ఆయన పేర్కొన్నారు. 'ప్రస్తుతం ఈ విషయం స్పీకర్ పరిశీలనలో ఉన్నప్పుడు, వారిని మనం ఎలా పక్కనపెట్టగల్లం అని ప్రశ్నించారు. లోక్‌సభ, రాజ్యసభ సచివాలయాలు జారీ చేసిన అధికారిక బులెటిన్ ద్వారా వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న ఎనిమిది బిల్లుల వివరాలను ప్రభుత్వం ఇప్పటికే పంచుకుందని రిజిజు తెలిపారు.

సమావేశాల సమయంలో ప్రభుత్వం ఏదైనా అదనపు చట్టాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయిస్తే, ఆ విషయంపై ముందుగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి)లో చర్చిస్తామని, ప్రతిపక్ష పార్టీలన్నింటికీ ముందస్తు సమాచారం అందిస్తామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# లైంగిక వేధింపులు

>> తేదీన రాత్రి తొమ్మిది గంటలకు అకాడమిలో బాధితురాలు తన గదికి వెళుతుండగా ఉదయ్ కృష్ణారెడ్డి బలవంతంగా జుట్టు పట్టుకుని, గొంతు నొక్కి అసభ్యకరంగా ప్రవర్తించి, చంపుతానని బెదిరించాడని తమకు ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. గదిలోకి బలవంతంగా లాక్కువెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో వుందని పోలీసులు తెలిపారు. అంతకు ముందు పలుమార్లు సహచర ట్రైనీ ఐపిఎస్‌ల ఎదుట అసభ్యకరంగా అవమానకరంగా మాట్లాడి ఇబ్బంది పెట్టాడని, దీంతో పాటు బ్లాక్ మెయిల్‌కు పాల్పడ్డాడని తమకు ఫిర్యాదు అందిందని అత్తాపూర్ పోలీసులు తెలిపారు. కాగా బాధితురాలు తనను ఉదయ్ కృష్ణారెడ్డి ఎలా వేధించాడనే దానిపై పలు ఆధారాలు, సాక్ష్యాలను పోలీసులకు అందించినట్లు తెలిసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించినందుకు బిఎన్ఎస్ 74,75,77, 315(2) సెక్షన్లతో పాటు ఐటి చట్టంలోని 66 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సోమవారం నాడు దీనిపై ఉన్నతాధికారులు మీడియాకు పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు తెలిసింది. ఈ ఘటన పై బాధితురాలు మొదట అకాడమి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

**కానిస్టేబుల్ నుంచి ఐపిఎస్ సాధించిన ఉదయ్ కృష్ణారెడ్డి**

ఇదిలావుండగా 32 ఏళ్ల ఉదయ్ కృష్ణారెడ్డి 2012లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలుచోట్ల పనిచేశాడు. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి నానమ్మ పెంపకంలో చదువులు పూర్తి చేసిన ఇతను 2024 సివిల్స్‌లో 350 ర్యాంకు సాధించడంతో ఐపిఎస్ అందుకున్నాడు. కానిస్టేబుల్ నుంచి ఐపిఎస్ అందుకున్న ఉదయ్ కృష్ణారెడ్డిని అప్పట్లో ఎపి సిఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. గత ఏడాది అక్టోబర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 2024 బ్యాచ్‌లో ఇతను వున్నాడు. ప్రస్తుతం రెండవ విడత శిక్షణ కోసం అకాడమిలో వున్న ఉదయ్ కృష్ణారెడ్డిపై వచ్చిన లైంగిక వేధింపుల ఫిర్యాదుపై అకాడమి అధికారులు తీవ్రంగా పరిగణించినట్లు తెలిసింది. ఉదయ్ కృష్ణారెడ్డిని శిక్షణ నుంచి భర్తరఫ్ చేసేందుకు నిర్ణయించినట్లు సమాచారం. కాగా ఎన్‌పిఎలో ట్రైనీ మహిళా ఐపిఎస్ అధికారిపై ఇలాంటి దాష్టికం జరగడం ఇదే మొదటిసారి. కాగా 2021లో తమిళనాడులో ఒక యువ మహిళా ఐపిఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో ఆ రాష్ట్ర స్పెషల్ డిజిపిగా వున్న రాజేష్ దాస్ ఉద్యోగం నుంచి భర్తరఫ్ కాగా కోర్టు ఆయనను దోషిగా తేల్చి మూడేళ్ల జైలు శిక్ష విధించడం అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది.

# 2.96 లక్షల సీట్లు ఖాళీ!

>> ప్రకారం రాష్ట్రంలో 780 డిగ్రీ కాలేజీల్లో 3,71,919 సీట్లు ఉండగా వాటిలో 1,19,016 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. వివిధ సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న 79 సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 23,834 సీట్లు అందుబాటులో ఉంటే అందులో 9,271 సీట్లు భర్తీ అయ్యాయి. నాన్ దోస్త్ విధానంలో అడ్మిషన్లు తీసుకుంటున్న 70 కాలేజీల్లో 42,056 సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో 12,856 సీట్లను భర్తీ అయ్యాయి. స్వయంప్రతిపత్తి (అటానమస్) హోదా కలిగిన 36 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 45,120 సీట్లు ఉంటే అందులో 27,434 సీట్లు భర్తీ అయ్యాయి. అటానమస్ కాకుండా ఉన్న 116 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 50,940 సీట్లు అందుబటులో ఉంటే వాటిలో కేవలం 19,389 సీట్లు భర్తీ కాగా ఇంకా 31,551 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఉన్న సీట్లలో కేవలం 43 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల పరిస్థితి ఇంతకంటే దారుణంగా ఉంది. 580 ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో 2,48,330 సీట్లు ఉంటే వాటిలో కేవలం 59,615 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 1,88,715 సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి. ప్రైవేటు కాలేజీల్లో కనీసం 25 శాతం సీట్లు కూడా భర్తీకానీ పరిస్థితి నెలకొంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో డిగ్రీలో చేరిక చాలా తక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మంజూరైన సీట్లలో 15 శాతం కంటే తక్కువగా అడ్మిషన్లు అయినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని 70కిపైగా కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా జరగలేదు. ర్టాష్ట్రంలో డిగ్రీలో చేరే విద్యార్థుల సంఖ్య మరీ తక్కువగా ఉన్న నేపథ్యంలో డిగ్రీ కోర్సుల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి తగ్గుతుందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

**నేటి నుంచి స్పెషల్ ఫేజ్..**

స్పెషల్ ఫేజ్ అడ్మిషన్స్‌లో భాగంగా నేటి(సోమవారం) నుంచి ఈ నెల 26 వరకు రూ. 400తో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. నేటి నుంచి ఈనెల 27 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు.

ఈ నెల 27న స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నెల 30న సీట్ల కేటాయింపు చేస్తారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 30 నుంచి ఆగస్టు 1 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెల్ఫ్ రిపోర్ట్ చేసిన విద్యార్థులు ఈ నెల 31 నుంచి ఆగస్టు 1 వరకు ఆయా కాలేజీల్లో చేరాలి.

# భవిష్యత్తులో భారత్ ఫిఫా వరల్డ్ కప్‌లో ఆడుతుంది

**ఆ జట్టులో తెలంగాణ ఆటగాళ్లు ఉంటారు: సీఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 19:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుపై తనకున్న దార్శనికతను పంచు కున్నారు. భవిష్యత్తులో టీమిండియా ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్స్‌లో ఆడ బోమే కాకుండా, ఆ టోర్నీకి ఆతిథ్యం కూడా ఇస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ మధ్య ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ జరగనున్న నేపథ్యంలో ఆయన సోషల్ మీడియా వేదికగా ఈ వ్యా ఖ్యలు చేశారు. తాను ఫుట్‌బాల్‌ను ఎంతగానో ఇష్టపడతానని పేర్కొన్నా ఆయన, భవిష్యత్తులో వరల్డ్ కప్ ఆడే భారత జట్టులో తెలంగాణ నుంచి పలువురు ప్లేయర్లు ఉంటారని జోస్యం చెప్పారు. 'ఈ మాట గుర్తుపెట్టుకోండి.. భవిష్యత్ సాకర్ స్టార్లు హైదరాబాద్ / తెలంగాణ నుంచే వస్తారు' అని ఆయన అన్నారు. ఫిఫా వరల్డ్ కప్‌కు తన మద్దతు వెనుక లోతైన ఉద్దేశం, దార్శనికత ఉన్నాయని వివరించారు.గతంలో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొచ్చి, తెలంగాణ పిల్లలతో కలిసి మైదానంలో పాలు పంచుకునేలా చేసిన రోజును తాను ఎంతో ఇష్టపడతానని గుర్తు చేసు కున్నారు. చివరగా, ఫుట్‌బాల్ అభిమానులందరూ ఫైనల్ మ్యాచ్‌ను ఆస్వాదించాలని ఆయన ఆకాంక్షి ంచారు.

# లేజర్ లైట్లతో ఎయిర్‌పోర్ట్‌లకు చిక్కులు

**దేశవ్యాప్తంగా 43 ఎయిర్‌పోర్టుల్లో విమానాల రాకపోకలకు ఇబ్బందులు**

**శంషాబాద్‌లో రెండేళ్లలోనే 100కుపైగా 'లేజర్' కేసులు**



**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** భారత్‌లోని 43 జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాలు లేజర్ బీం లైటింగ్ సమస్యతో సతమతమవుతున్నాయి. ఇందులో ప్రపంచంలోని అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన శంషాబాద్ రాజీవ్‌గాంధీ విమానా శ్రయం ఎక్కువగా ఇక్కట్లు పడుతున్నట్లు పౌర విమాన యాన విభాగం పరిశీలనలో తేలింది. నిత్యం వందలాది జాతీయ, అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించే విమానాశ్రయాల్లోని పరిసర ప్రాంతాల్లోని ఫంక్షన్‌హాల్స్, వెడ్డింగ్‌హాల్స్‌లో ఏర్పాటు చేస్తున్న లేజర్ బీంలైటింగ్‌తో విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌కు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని పైలట్ల సంఘం కేంద్రానికి ఫిర్యాదు చేసింది. రెండేళ్ల వ్యవధిలో భారత్‌లో 43 విమానా శ్రయాలలో వెయ్యికిపైగా లేజర్ బీం లైటింగ్ కేసులు నమోదు కాగా ఇందులో శంషాబాద్ విమానాశ్రయంలోనే వందకుపైగా కేసులు వుండడం విశే షం. రెండు వారాల క్రితం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి వచ్చిన లుఫ్తాన్సా అంత ర్జాతీయ విమాన లేజర్ బీం లైటింగ్ కారణంగా ల్యాండిం గ్‌కు ఇబ్బందిపడి అతికష్టంగా దిగడం సంచలనం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినా ఏం చర్యలు తీసుకున్నారో దానిపై గోప్యంగా ఉంచడం గమనార్హం. కాగా విమానాశ్రయాలకు 15 కిలోమీటర్ల దూరం వరకు ఎలాంటి లేజర్‌బీం లైటింగ్‌లను ఎవరూ వినియోగించ రాదని నిషేధం వున్నా వీటిని ఎవరూ ఖాతరు చేయడం లేదు. విమానాశ్ర య పరిసర ప్రాంతాల్లో కొన్ని రకాల ఆంక్షలు అమల్లో వుంటాయి. ముఖ్యంగా భవనాలను పరిమిత ఎత్తులోనే నిర్మించడం, బహుళ అంతస్తుల భవనాలకు కూడా కఠిన నిబంధనలు అమలు చేయడం. వీటన్నింటికన్నా ముఖ్యమైనది లేజర్ బీం లైటింగ్. ఇటీవల కాలంలో అన్నిరకాల ఫంక్షన్ హాళ్లతోపాటు వెడ్డింగ్ హాళ్లలో వినియోగించడం సాధారణంగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌కు విమానాశ్రయాలలోని లైటింగ్‌తోపాటు సిగ్నలింగ్ వ్యవస్థ కీలకంగా వుంటుంది. విమానా శ్రయాలలోని టవర్ల నుంచి వచ్చే లైటింగ్ సిగ్నల్స్ ఆధా రంగా విమానాల ల్యాండింగ్, టేకాఫ్ జరుగుతుంటుంది. ఇదే సమయంలో విమానాశ్రయాలలోని రన్‌వేల చివరి భాగంలోనూ ఇరువైపులా వుండే లైటింగ్ వ్యవస్థ విమానాల ల్యాండింగ్‌కు ఉపయోగ పడుతోంది. భారత్‌లో 43 విమా నాశ్రయాలకు లేజర్‌బీం లైటింగ్‌లతో ముప్పు ఏర్పడుతోందని పైలట్ల సంఘం పౌర విమానాయాన శాఖకు ఫిర్యాదు చేసింది. ఇక శంషాబాద్ విమానాశ్రయం పరిసర ప్రాంతాలలో వందకు పైగా గ్రామాలు వుండగా ఫంక్షన్, వెడ్డింగ్ హాల్స్ ఇక్కడే వున్నాయి. వీటిలో ఎంత లేదన్నా ప్రతీనెల ఐదారు ఫంక్షన్లు జరుగుతుంటాయి. పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లో నెలలో 20కి పైగా ఫంక్షన్లు జరుగుతుం టాయి. అయితే ఈ కార్య క్రమాలన్నీ రాత్రి వేళల్లోనే ఎక్కువగా జరుగుతుండడం, ఇదే సందర్భంగా లేజర్‌బీం లైటింగ్ ఏర్పాట్లు తప్పకుండా వుంటుండడంతో విమానాలకు ఇబ్బందిగా మారాయి. దీనిపై చాలా కాలంగా పైలట్‌ల సంఘం ఫిర్యాదు చేస్తున్నా పోలీసులతో పాటు పౌర విమానాయాన శాఖ కేసుల నమోదు వరకే పరిమితమైందనే విమర్శలు వున్నాయి. లేజర్ లైటింగ్ కారణంగా విమానం పెద్ద ప్రమాదం నుంచి బయటపడిందని, ఏదైనా జరిగివుంటే దానికి ఎవరు బాధ్యులని ఆయన విమానాశ్రయ అధికారులను ప్రశ్నించారు. ఇక రక్షణ శాఖ ఆధీనంలో వున్న బేగం పేట్, దుండిగల్, హకీంపేట్ విమానాశ్రయాలకు కూడా లేజర్ లైటింగ్‌తో ఇబ్బందులు తప్పడం లేదు.

## భారీ వర్షాలకు మురుగునీటి పైప్‌లైన్‌లో చిక్కుకుని చిన్నారి మృతి

**డెహ్రాడూన్, జులై 19:** ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలు మరో విషాదానికి కారణమయ్యాయి. వికాస్‌నగర్‌లో జరిగిన ఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. ఆడుకుంటూ ఉన్న ఆరేళ్ల చిన్నారి క్షణాల్లోనే వరద ప్రవాహంలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోవడం



స్థానికులను తీవ్ర విషాదంలో ముం చెత్తిం ది. ఈ సంఘటన వర్షా కాలంలో మురు గునీటి కాలువలు, డ్రైనేజీ వ్యవస్థల భద్రతపై మరో సారి తీవ్ర ప్రశ్నలను లేవనెత్తుతోంది. వి కాస్ నగర్‌లోని ఖాదర్ నివాస ప్రాంతంలో భారీ వర్షం కురుస్తున్న సమయంలో ఆరేళ్ల అర్మాన్ రోడ్డు పక్కన ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు.

అదే సమయంలో ఒక్క సారిగా ఉధృతంగా ప్రవహించిన వర్షపు నీరు అతడిని సమీపంలోని మురుగు కాలువ వైపు లాక్కెళ్లింది. బలమైన ప్రవాహాన్ని తట్టుకోలేక బాలుడు నేరుగా సుమారు 10 అంగుళాల వెడల్పు ఉన్న డ్రైనేజీ పైపులోకి కొట్టుకుపోయాడు.

క్షణాల్లో జరిగిన ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. బాలుడు పైపులో చిక్కుకున్నాడని గుర్తించిన గ్రామస్తులు వెంటనే జేసీబీ యం త్రాన్ని తీసుకొచ్చి పైపును పగలగొట్టే ప్రయత్నం చేశారు. సమయం గడుస్తున్న కొద్దీ ఆందోళన మరింత పెరిగింది. అందరూ ప్రాణాలతో బయటపడతాడని ఆశించినప్పటికీ, పైపును తొలగించి బాలుడిని బయ టకు తీసే సమయానికి అతడు అప్పటికే స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని సమీప ఉపజిల్లా ఆసుపత్రికి తరలించినా, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మరణించినట్లు ప్రకటించారు. ఈ దృశ్యం అక్కడున్న వారందరినీ కన్నీటిపర్యంతం చేసింది.

## రౌడీషీటర్ దాడిలో ఇంటర్ విద్యార్థి మృతి

**హైదరాబాద్ పాతబస్తీలో దారుణం**

**హైదరాబాద్ (చార్మినార్), జులై 19 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బిర్యానీ షాటేకిరి ప్రాంతంలో ఇంటర్మీడియట్ విద్యార్థి హత్యకు గురైన సంఘటన కాలాఫత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చిన్న విషయానికే ఓ రౌడీషీటర్‌తోపాటు చైన్‌స్నాచర్ కలిసి కత్తితో విద్యార్థిపై దాడి చేయటంతో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. కాలాఫత్తర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఖలీల్‌పాషా కథనం ప్రకారం.. పాతబస్తీ కాలాఫత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిర్యానీ షాటేకిరి ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫయాజ్(17) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఫయాజ్ తండ్రి ఉద్యోగం నిమిత్తం సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. సోమవారం తెల్లవారుజామున మూడున్నర గంటలకు మహ్మద్ ఫయాజ్ బిర్యానీ షాటేకిరిలోని తన ఇంటిముందు కూర్చున్నాడు. అదేసమయంలో బాలాపూర్‌కు చెందిన రౌడీషీటర్ అబ్రార్, పాతబస్తీకి చెందిన చైన్‌స్నాచర్ ఫర్హాన్ ఇద్దరు కలిసి బిర్యానీ షాటేకిరి ప్రాంతానికి వచ్చారు.

బిర్యానీ షాటేకిరి బస్తీ నుంచి బాలాపూర్ వెళ్లిపోయిన రౌడీషీటర్ అబ్రార్‌ను.. మాటిమాటికి ఇక్కడకు ఎందుకు వస్తున్నావని మహ్మద్ ఫయాజ్ నిలదీశాడు. ఈ విషయంలో వారి మధ్య వివాదం చోటుచేసుకుంది. అదే సమయంలో రౌడీషీటర్ అతనివెంట ఉన్న చైన్‌స్నాచర్ ఫర్హాన్ కలిసి కత్తితో మహ్మద్ ఫయాజ్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు పాలైన ఫయాజ్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఫయాజ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. రౌడీషీటర్ అబ్రార్‌పై ఫలక్‌నుమా, కాలాప్తర్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమో దై ఉన్నాయి. ఈ కేసును కాలాఫత్తర్ పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి అందుతున్న నిధులు, వివిధ రంగాల్లో జరుగుతున్న ప్రగతిని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఆదివారం బర్కత్ పుర బీజేపీ నగర కార్యాలయంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పార్టీ అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో తెలంగాణలో రైల్వేలు, జాతీయ రహదారులు, రోడ్ల నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తోంది. వందేభారత్ రైళ్లు, విద్యుత్, మరియు గ్యాస్ రంగాల్లో రాష్ట్రం గణనీయమైన ప్రగతిని సాధిస్తోందని తెలిపారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి వచ్చే లక్షలాది మంది భక్తుల చిరకాల కోరికను కేంద్ర ప్రభుత్వం తీర్చిందని కేంద్ర మంత్రి అన్నారు. నూత నంగా నిర్మించిన కొమురవెల్లి రైల్వే స్టేషన్ వచ్చే ఆదివారం ప్రారంభం కానుందని ఆయన వెల్లడించారు. ఈ చారి త్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమానికి భక్తులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. తెలం గాణ సమాజం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను గమనిస్తోందని, కార్యకర్త లంతా ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి పార్టీ బలోపే తానికి కృషి చేయాలని కిషన్ రెడ్డి గారు దిశానిర్దేశం చేశారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలి. బీజేపీ రాష్ట్రా ధ్యక్షుడు ఎన్. రామ చందర్ రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కార్యకర్తలు క్రియాశీలకంగా పోరాడాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ రాబోయే కార్పొరేటర్ ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకం అని, ఓబీసీ వర్గాలకు బీజేపీ ఇస్తున్న ప్రాధాన్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనిఅన్నారు. ప్రతి డివిజన్‌లో బలమైన అభ్యర్థుల గెలుపునకు వ్యూహాత్మక కార్యాచరణ అవసరం అని, సామాజిక సమీకరణలతో హైదరాబాద్‌లో బీజేపీని అధికారంలోకి తీసుకు రావాలన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, రాష్ట్ర కార్యదర్శి ఓ.శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

## ప్రత్యామ్నాయ సాగుపై వ్యవసాయ శాఖ ప్రచారం

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాల అవకాశాలు బలహీనపడటంతో, మంచి వర్షాలు కురుస్తాయన్న రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. తగినంత వర్షపాతం లేకపోవడం, భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం వంటివి రైతులను మరింత సుస్థిరమైన, లాభదాయకమైన వ్యవసాయ పద్ధతుల వైపు మళ్ళేలా చేస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని, తక్కువ నీరు అవసరమై అధిక దిగుబడినిచ్చే స్వల్పకాలిక పంటలను ఎంచుకునేలా వ్యవసాయ శాఖ రైతంగంలో విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. సాంప్రదాయకంగా అధిక నీటి వినియోగంపై ఆధారపడే వరి రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తగిన ప్రత్యామ్నాయాలకు మారాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను ఇప్పటికే విస్తృతంగా సాగు చేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడు, బోర్‌వెల్స్, చెరువుల కింద వరి పండిస్తున్న రైతులపై దృష్టి సారించి, వారిని మెట్ట పంటల వైపు మళ్లాలని కోరుతున్నారు. నీటి లభ్యత అనుకూలిస్తే, ఈ నెలాఖరులోగా వరికి బదులుగా మొక్కజొన్న సాగు చేపట్టాలని రైతులకు సూచిస్తున్నారు. ఒకవేళ ఆగస్టు నాటికి కూడా వర్షపాతం అంచనాల కంటే తక్కువగా ఉంటే, పెసర, కంది, మినుముల వంటి పప్పుధాన్యాలను పండించాలని వారిలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనువైన పంటల వైవిధ్యీకరణ వ్యూహాలపై అవగాహన కల్పించి, మార్గదర్శనం చేయడానికి వ్యవసాయ అధికారులు నేరుగా రైతులను కలుస్తున్నారు.

# ఒమన్‌లో హైదరాబాద్ మహిళకు నరకం

**ఉద్యోగం కోసం వెళితే జీతం ఇవ్వకుండా చిత్రహింసలకు గురిచేస్తున్న ఏజెంట్లు**

**బాధితురాలిని ఆదుకోవాలని కేంద్రానికి కుటుంబీకుల వేడుకోలు**

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** ఎడారి దేశాలలో ఉద్యోగాల కోసం వెళుతూ ఏజెంట్ల చేతిలో మోసపోతూ చిత్రహింసలకు గురవుతున్న హైదరాబాద్‌కు చెందిన మరో మహిళ ఉదంతం వెలుగు చూసింది. శివార్లలోని పహాడిషరీఫ్‌కు చెందిన షబ్నం బేగం (26) కుటుంబ పరిస్థితుల కారణంగా గత ఏడాది ఆగస్టు నెలలో ఒక ఏజెంట్ ద్వారా ఇంట్లో పనులు చేసేందుకు ఒమన్ దేశానికి వెళ్లింది. ఇందుకోసం ఏజెంట్‌కు బాధితు రాలి కుటుంబం లక్ష రూపాయలు ఇచ్చింది. నెలకు 50 వేల రూపాయల జీతంతో పాటు మరికొంత నగదు ఇచ్చేలా చేస్తానని ఏజెంట్ నమ్మించాడు. ఏజెంట్ మాటలు నమ్మి ఒమన్ దేశంలో వెళ్లిన తరువాత ఏజెంట్ తాలూకు మనిషులు పాస్‌పోర్టు లాక్కుని అనేకచోట్ల పనులు చేయిం చడంతో పాటు సరిగ్గా భోజనం కూడా అందించ లేదని, విశ్రాంతి తీసుకు నేందుకు ఎలాంటి వసతి చూపించలేదని ఆమె ఒక వీడియో పోస్టు చేసింది. రోజుకు ఎనిమిది గంటల పనిమాత్రమే వుంటుందని చెప్పి 12 నుంచి 15 గంటల పాటు పని చేయిస్తున్నట్లు బాధితురాలు హైదరాబాద్ లోని తన కుటుంబీకులకు ఒక వీడియో పంపింది. నాలుగు నెలలుగా జీతం కూడా ఇవ్వడం లేదని, దీనిపై ప్రశ్నిస్తే కొడుతున్నారని ఆమె వాపోయింది. తనను భారత్‌కు పంపాలని బాధితురాలు కోరగా అక్కడి ఏజెంట్లు ఐదు లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని ఆమె తెలిపింది. అక్కడి ఏజెంట్ల నుంచి తాను తప్పించుకుని ఒమన్ రాజధాని మస్కట్‌లో గల భారత రాయబార కార్యాలయంలో తలదాచు కున్నట్లు బాధితు రాలు తెలిపింది.

తనను కాపాడాలని ఆమె కోరింది. దీనిపై బాధితురాలి కుటుంబీకు లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు షబ్నం బేగం ను కాపాడి, భారత్‌కు రప్పించాలని కేంద్రాన్ని కోరారు.

# ఖమ్మం అభివృద్ధికి డబుల్ బూస్ట్

**మధిరకు జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల..**

**ఇల్లందులో రూ.11.80 కోట్ల**

**అభివృద్ధి పనులకు డిప్యూటీ సిఎం భట్టి శ్రీకారం**

**ఖమ్మం, జులై 19, ప్రభాతవార్త ప్రతినిధి:** ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఒకవైపు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మధిర ప్రభుత్వ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఆమోదం తెలపగా, మరోవైపు ఇల్లందు నియోజకవర్గంలో రూ.11.80 కోట్ల అభివృద్ధి పనులకు స్వయంగా శంకుస్థాపనలు చేసి అభివృద్ధికి వేగం పెంచారు. విద్య, మౌలిక సదు పాయాల రంగాల్లో ఒకేరోజు రెండు కీలక నిర్ణయాలు వెలువడటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.మధిర నియోజకవర్గంలో ప్రభుత్వ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు దశాబ్దాల కలగా మిగిలిపోయిన నేపథ్యంలో, భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం విద్యార్థులకు వరంగా మారింది. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులోకి రావడంతో పాటు, మధిర విద్యా రంగంలో ఇది చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది.


తెలంగాణ ప్రభుత్వం
**శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానము, జమలాపురం**
ఎర్రుపాలెం మండలం, ఖమ్మంజిల్లా. ఫోన్: 9491000705

Rc.No.56/2026 టెండరు ప్రకటన తేది. 18.07.2026

తేది. 29-07-2026 రోజున ఉ.10-00 గం. నుండి శ్రీయుత సహాయ కమిషనర్ వారి కార్యాలయము ఖమ్మంలో ఈ క్రింద చూపిన ప్రకారంగా సీల్డు టెండరు-కం-బహిరంగవేలము నిర్వహించబడును.

| క్ర.సం | టెండర్ వివరములు | షాపు నెంబరు | ధరావత్తు రూ. డి.డి | షెడ్యూల్ ధర నగదు రూ|| | కాలపరిమితి | |
|---|---|---|---|---|---|---|
| 1 | 1). కొబ్బరికాయలు, పూజ సామాగ్రి, పూలు, దండలు, పండ్లు అమ్ముకొను హక్కు 2). గాజులు, బొమ్మలు, ఫ్యాన్సీ స్టోర్ 3). కిరాణా & జనరల్ స్టోర్స్ నిర్వహించుకొను హక్కు | శ్రీనివాస కాంప్లెక్స్ 2,3,4,5 శేషసాయి కాంప్లెక్స్‌లో షాపు 1 (5) షాపులు కలిపి | 10,00,000/- | 1000/- | 01.10.2026 To 31.03.2028 | 16 నెలలు |
| 2 | కూల్ డ్రింక్స్ వాటర్, ఐస్ క్రీమ్, జ్యూస్ & పాన్ షాపు నడుపుకొను హక్కు | పద్మావతి కాంప్లెక్స్ 1 | 50,000/- | 500/- | 01.10.2026 To 31.03.2028 | 16 నెలలు |
| 3 | టీ, కాఫీ & భోజనం, అన్నిరకముల టిఫిన్స్ హోటల్ | పద్మావతి కాంప్లెక్స్ 2,3,4 | 50,000/- | 500/- | 01.08.2026 To 31.03.2028 | 18 నెలలు |
| 4 | గాజులు, బొమ్మలు, ఫ్యాన్సీ స్టోర్ | పద్మావతి కాంప్లెక్స్ 5,6 | 50,000/- | 500/- | 01.10.2026 To 31.03.2028 | 16 నెలలు |
| 5 | గాజులు, బొమ్మలు, ఫ్యాన్సీ స్టోర్ | పద్మావతి కాంప్లెక్స్ 7,8 | 50,000/- | 500/- | | 16 నెలలు |
| 6 | కొబ్బరికాయలు, పూజ సామాగ్రి, బొమ్మలు, కూల్ డ్రింక్స్ అమ్ముకొను హక్కు (గుడి వెనుక షాపు) | గుడి వెనుక షాపు | 20,000/- | 500/- | 01.10.2026 To 31.03.2028 | 16 నెలలు |
| 7 | శ్రీ శేషసాయి షాపింగ్ కాంప్లెక్స్ లో | షాపు నెం.2,3, 4,5,7,8,9,10 | 20,000/- | 500/- | 01.08.2026 To 31.03.2028 | 18 నెలలు |
| 8 | రేకుల షెడ్ (టి.టి.డి కళ్యాణ మండపం వెనుక గల | - | 20,000/- | 500/- | 01.08.2026 To 31.03.2028 | 18 నెలలు |


(1) దరఖాస్తు చేసుకొను చివరి తేది. 28-07-2026, సాయంత్రం గం|| 4-00ల వరకు. (2) టెండర్ షెడ్యూల్స్ అమ్ము తేది. 29-07-2026 ఉదయం గం|| 09-00 నుండి 11-00 గం|| వరకు (3) సీల్డు టెండర్లు సమర్పించుట తేది. 29-07-2026 మ.12-00 గం|| వరకు. (4) సీల్డు టెండర్లు విప్పుట తేది. 29.07.2026 మ.01-00 గం|| కు వెంటనే బహిరంగ వేలము పాట (5) ఈ టెండర్లలో హిందువులు మాత్రమే పాల్గొనవలెను. అన్యమతస్థులు పాల్గొనరాదు. (6) దేవస్థానమునకు బకాయి ఉన్నవారు, కోర్టు కేసులు, పోలీస్ కేసులలో ఉన్నవారు మరియు దేవస్థానం సిబ్బంది పాల్గొనుటకు వీలు లేదు. (7) మిగతా షరతులు టెండర్ షెడ్యూల్‌లో పొందుపరచబడును. వివరముల కొరకు సెల్ నెం. 9491000705 లేదా దేవాలయ కార్యాలయము నందు గాని సంప్రదించగలరు.

DIPR.No.6306-PP/CL/Advt/1/2026-27, తేది: 18.07.2026 సం/- కార్యనిర్వహణాధికారి


# ఎనిమిది రాష్ట్రాల్లో కమ్ముకొస్తున్న మేఘాలు

**వాతావరణ శాఖ వెల్లడి**

**న్యూఢిల్లీ, జులై 19:** వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. భారత్‌లో మళ్లీ రుతుపవనాలు చురుకుగా మారుతున్నాయని చెప్పింది. ఆదివారం ఇస్రో ఇన్‌శాట్3డిఆర్ శాటిలైట్ తీసిన చిత్రాల్లో దేశంలో దాదాపు రెండు వంతుల ప్రాంతంలో దట్టమైన మేఘాలు ఉన్నట్లు వెల్లడించింది. దీంతో రాబోయే రోజుల్లో అనేక రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. జమ్మూ కాశ్మీర్ నుంచి గంగా మైదానాలు, బీహార్, పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల వరకు ఆకాశంలో మేఘాలు విస్తరించాయి. పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్, బీహార్, బెంగాల్ ప్రాంతాల్లో మేఘాల సాంద్రత చాలా ఎక్కువగా ఉందని చిత్రాలు వెల్లడించాయి. అరేబియా సముద్రం నుంచి వచ్చే తేమ గాలుల ప్రభావంతో దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో కూడా మేఘాలు ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇస్రో విశ్లేషణ ప్రకారం ప్రస్తుతం దేశంలో సుమారు 60-70 శాతం ప్రాంతాలు మేఘావృతమై ఉంది. అయితే, అన్ని ప్రాంతాల్లో ఒకేస్థాయి వర్షం కురవదని నిపుణులు చెబుతున్నారు. అత్యంత ఎత్తులో ఏర్పడిన చల్లని తుఫాను మేఘాలున్న ప్రాంతాల్లో మాత్రమే భారీ వర్షాలు, ఉరుములు సంభవించే అవకాశం ఉందని చెప్పింది.ఇస్రో ఇన్‌శాట్3డిఆర్ శాటిలైట్ భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులో భూ స్థిర కక్ష్య నుంచి ప్రతీ అరగంటకోసారి చిత్రాలు పంపిస్తుంది. ఈ చిత్రాల ఆధారంగా ఐఎండీ వర్షాలను అంచనా వేస్తుంది. శాటిలైట్ ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్ మేఘాలపై ఉష్ణోగ్రతను కొలుస్తుంది. మేఘాల పైభాగం ఎంత చల్లగా ఉంటే అవి అంత ఎత్తులో, తీవ్రమైన మేఘాలుగా పరిగణిస్తారు. ఆదివారం తీసిన చిత్రాల్లో జమ్మూ కాశ్మీర్ ప్రాంతాల్లో మేఘాల ఉష్ణోగ్రత మైనస్ 80 డిగ్రీల సెల్సియస్ ఉంది. ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, ఈశాన్య రాష్ట్రాలు, దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మైనస్ 50 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు, ఉత్తర భారతదేశంపై రుతుపవన ద్రోణి ఆవరించి ఉండటంతో ఉత్తర భారత రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.




**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)
AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN: L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV (8 (1) నిబంధన చూడండి) స్వాధీనతా ప్రకటన**

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్", "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో ఏప్రిల్ 01, 2024 నుండి విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకందారు "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడిన సెక్షన్ 13 (12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. దిగువ పేర్కొన్న తేదీకి రుణగ్రహీతలు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పిలుపునిచ్చారు:-

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు/రుణ ఖాతా నం. పేరు | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (లోన్ ఎ/సి నెం.), 23660000470683 & 24660000264790, సుధనపు ఉమారాణి (రుణగ్రహీత), సుధనపు రమేష్ (సహ-రుణగ్రహీత) | 03-ఫిబ్రవరి-26 రూ. 7,35,305/-రూ. ఏడు లక్షల ముప్పై ఐదు వేల మూడు వందల ఐదు మాత్రమే మరియు రూ. 2,43,677/- రూ. రెండు లక్షల నలభై మూడు వేల ఆరు వందల డెబ్బై ఏడు మాత్రమే 02-ఫిబ్రవరి-26 నాటికి | 15-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: RCC పైకప్పు గల ఇల్లు నంబర్ 2-54/3A, RCC పైకప్పు విస్తీర్ణం 667.11 చదరపు అడుగులు మరియు AC షీట్ పైకప్పు విస్తీర్ణం 207.00 చదరపు అడుగులు; 353.56 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలం. పెరుమాండ్ల సంకీస గ్రామ పంచాయతీ, డోర్నకల్ మండలం, మహబూబాబాద్ జిల్లా SRO మహబూబాబాద్ పరిధి. సరిహద్దులు: తూర్పున - ఎర్ర సతీష్ భూమి, పడమరన - గ్రామ పంచాయతీ రోడ్డు, ఉత్తరాన - దుష కాశమ్మ భూమి మరియు బెదరబోయిన లచ్చమ్మ ఇల్లు, దక్షిణాన - సుధనపు ఎల్లయ్య ఇల్లు. | | |
| (లోన్ ఎ/సి నెం.), 23660001420062 & 24660002029419, ములకలపల్లి రామయ్య (రుణగ్రహీత), ములకలపల్లి రాధిక (సహ-రుణగ్రహీత) | 11-ఫిబ్రవరి-26 రూ. 7,87,244/- రూ. ఏడు లక్షల ఎనభై ఏడు వేల రెండు వందల నలభై నాలుగు మాత్రమే 10-ఫిబ్రవరి-26 నాటికి | 15-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: RCC పైకప్పు గల ఇల్లు (నంబర్ 11-84/5 (పాత) / 1-1-84/5 (కొత్త); RCC పైకప్పు గల ఇల్లు 331.87 చదరపు అడుగులు, GI షీట్ పైకప్పు గల ఇల్లు 351.12 చదరపు అడుగులు. 164.50 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన స్థలం షెడ్యూల్ ఆస్తి, ఇది వరంగల్ జిల్లా, మహబూబాబాద్ SRO పరిధిలోని డోర్నకల్ మండలం, పెరుమాండ్ల సంకీస గ్రామం మరియు గ్రామ పంచాయతీలో ఉంది. సరిహద్దులు: తూర్పున గ్రామ పంచాయతీ రోడ్డు, పడమరన నీరు రాములు ఇల్లు, ఉత్తరాన నల్ల భిక్షం ప్లాట్, దక్షిణాన ముల్కపల్లి నాగేశ్ ఇల్లు. | | |
| (లోన్ ఎ/సి నెం.), 23660000074859, 23660001972422; షేక్ రహీమా (రుణగ్రహీత), షేక్ జానీ (సహ-రుణగ్రహీత) | 11-ఫిబ్రవరి-26 రూ. 12,82,941/- పన్నెండు లక్షల ఎనభై రెండు వేల తొమ్మిది వందల నలభై ఒక్క రూపాయలు మాత్రమే 10-ఫిబ్రవరి-26 నాటికి | 15-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: RCC పైకప్పు కలిగిన ఇల్లు, ఇంటి నం. 15-3-Te0046, (ఆస్తి అసెస్‌మెంట్ నం. 1106068792). 144.00 చదరపు గజాల స్థలంలో 540 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణం (టాయిలెట్లతో సహా) కలిగిన RCC ఇల్లు; దీనితో పాటు విద్యుత్ ఫిట్టింగ్‌లు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ మరియు శానిటరీ మరియు ఫిక్చర్లు ఉన్నాయి. ఇది ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, ఖానాపురం హవేలీ, తెకులపల్లి, ఖమ్మం వద్ద ఉంది. సరిహద్దులు: తూర్పున హనుమంతు ఇల్లు, పడమరన రోడ్డు, ఉత్తరాన శ్రీను ఇల్లు, దక్షిణాన రవి ఇల్లు. | | |
| (లోన్ ఎ/సి నెం.), 23660000766627; మాలోత్ శ్రీను (రుణగ్రహీత), మాలోతు నాగమణి (సహ-రుణగ్రహీత) | 12-ఫిబ్రవరి-26 రూ. 6,07,568/- ఆరు లక్షల ఏడు వేల ఐదు వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే 11-ఫిబ్రవరి-2026 నాటికి | 16-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ఖమ్మం జిల్లా, కూసుమంచి SRO పరిధిలోని రఘునాథపాలెం మండలం, M. పల్లె, చింతగుర్తి గ్రామ పంచాయతీలో ఉన్న ఆస్తి (షెడ్యూల్ ఆస్తి). దీని విస్తీర్ణం 513.97 చదరపు గజాలు. ఇందులో 294.14 చదరపు అడుగుల విస్తీర్ణంతో RCC పైకప్పు కలిగిన ఇల్లు నంబర్ 1-104/1, (అసెస్‌మెంట్ నం. 104) మరియు మరుగుదొడ్లతో సహా 280.51 చదరపు అడుగుల విస్తీర్ణంలో AC షీట్ పైకప్పు కలిగిన నిర్మాణం ఉన్నాయి. ఈ ఆస్తి సరిహద్దులు: తూర్పున - G.P రోడ్డు; పడమరన - మాలోత్ వెంకన్న మరియు బధావత్ రాము ఇల్లు; ఉత్తరాన - G.P రోడ్డు; దక్షిణాన - G.P రోడ్డు. | | |

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు [చట్టం 2002] సెక్షన్ 13(4) కింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకందారు స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8 (6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది" ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేదీ : 18/07/2026 స్థలం : ఖమ్మం, తెలంగాణ సం/- అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్


సజ్జనుడి జీవితం ఎలా ఉత్తమమవుతుంది అంటే ప్రేమతో, దయాగుణంతో అతను చేసే చిన్న చిన్న పనుల వల్లనే.

- గ్లిబ్బర్

# బ్రెయిన్‌డ్రెయిన్ తప్పదా!

ఎన్నో అంతరిక్ష ప్రయోగాలను ఎంతో అవలీలగా ప్రయోగించి విజయవంతమైన చరిత్ర సృష్టించిన 'ఇస్రో' అంతరిక్షా ప్రయోగ కేంద్రం ఈ మధ్యకాలంలో ఎందుకో చతికిలపడిపోయింది. చేసిన అన్ని ప్రయత్నాలూ ఫలించాలని లేదు. కానీ సమిష్టి కృషిగా శాస్త్రవేత్తలు ప్రయోగాలన్నీ సఫలత చెందితే దేశప్రతిష్ట పెరుగుతంది. కానీ ఇప్పుడు 'ఇస్రో'లో జరుగుతున్న కలవర పాటు సంఘటనలపై ప్రభుత్వాలు సైతం ఆందోళన చెందుతున్నట్లుగానే ఉంది. కానీ 'ఇస్రో' నుంచి శాస్త్రజ్ఞుల వలస గురించి ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ నిజమేనని చెబుతూనే 'చాలా మంది శాస్త్రజ్ఞులు వెళ్తుంటారు, కొత్త వారు వస్తుంటారు' దాని గూర్చి ఎలాంటి ఆందోళన లేదని సమర్థించుకున్నారు. ఇస్రోలో దాదాపు 14,600 మంది ఉద్యోగులుండగా అందులో 100-120 మంది నిష్క్రమించడాన్ని అతి తక్కువే కదా! అని అనుకోలేం. ఇస్రో చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో భాగమైన వారు తాజాగా ఆప్రయోగాల నుంచి తప్పించుకుంటున్నారు. రాజీనామాలు చేసి బయటకు వెళ్లిపోతున్నాడు. మంచి అవకాశం ఎక్కడుంటే అక్కడికి వెళ్లి పోవడాన్ని ఎవరూ కాదనలేరు. కానీ తమ ఉపాధిని పెంచుకునే అవకాశమున్నప్పుడు వాటిని త్రోసిరాజని ఎందుకు వెళ్లిపోతున్నారో తెలుసుకుని వాటికి అడ్డుకట్ట వేయలేకపోతే ఇలాంటి సంస్థల మనుగడకే కష్టం. శాస్త్రజ్ఞుల వరుస రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణలనగానే సంస్థ పట్ల వారిలో ఏదో అసంతృప్తి ఉందనే అనుకోవాలి. మరో ప్రైవేట్ సంస్థల్లో హెచ్చు జీతానికే మంచి హోదాలో వెళ్లడమంటే ఒక విధంగా వారికి మంచిదే కావచ్చు. కానీ అంతర్జాతీయంగా అంతరిక్ష పరిశోధనలకు పేరుగాంచిన 'ఇస్రో' నుంచి 'బ్రెయిన్ డ్రెయిన్' మంచిది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదొక ఆందోళనకర విషయం. గగన్‌యాన్, చంద్రయాన్-4, లాంటి చారిత్రక ప్రాజెక్టులు అత్యున్నత కీలక దశలో ఉండగా నూరు మందికి పైగా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, రాజీనామా చేశారని లేదా స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారన్న వార్తలు రావడంతో కేంద్రం తక్షణ చర్యలు తీసుకొంది. శాస్త్రజ్ఞుల రాజీనామాలను ఆమోదించే ప్రక్రియను కఠినతరం చేసింది. ఈ విషయమై జూలై 14న అంతరిక్ష పరిశోధనా విభాగం రాజీనామాలపై ప్రత్యేక మెమొరాండం జారీ చేసింది. జాతీయ ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో పనిచేసే గ్రూప్ఎ సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బంది రాజీనామా, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను నేరుగా కేంద్రానికి పంపేపద్ధతి ఇకపై నివారించబడినట్లు దాని సారాంశం.ప్రతి దరఖాస్తును నేరుగా అతరిక్ష పరిశోధనా శాఖకే చేరాలి. 'ఇస్రో'కు సంబంధించిన అత్యధిక రాజీనామాలు బెంగళూరులోని యు.ఆర్.ఆరావు శాటిలైట్ కేంద్రం నుంచి 80 మంది తిరువనంతపురం స్పేస్ సెంటర్ నుంచి 20మంది ఉన్నారు. అలా వెళ్లిన వారిలో భారత అంతరిక్ష పరిశోధనల్లో కీలకమైన ఎల్‌విఎం 3 ప్రాజెక్టు డైరెక్టర్, స్పాడెక్స్ ప్రాజెక్టు డైరక్టర్, చంద్రయాన్-3 సిమ్యూలేషన్ మేనేజరు ఒకేసారి రాజీనామా చేసి వెళ్లిపోతే అంతరిక్ష పరిశోధనా సాంకేతిక బదిలీ విషయాలలో 'ఇస్రో' మిషన్ల కొనసాగింపుపై ప్రభావంపడుతుంది. కారణాలు విశ్లేషించుకుంటే ప్రైవేట్ రంగం లో అంతరిక్ష కేంద్రాలకు అనుమతులివ్వడంతో స్కైరూట్ అగ్నికుల్, పిక్సెల్, ధ్రువస్పేస్ లాంటి 400 స్టార్టప్‌లు వచ్చి చేరాయి. అక్కడ ఉద్యోగులకు ఇస్రో శాస్త్రజ్ఞుల కన్నా 2,3 రెట్లు వేతనం లభిస్తుంది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా)లో శాస్త్రవేత్తల సగటు వేతనం 80వేల డాలర్ల నుంచి1.5లక్షల డాలర్ల దాకా ఉంటుంది. అంటే ఇండియన్ కరెన్సీలో రూ.77 లక్షల నుంచి 1.4 కోట్ల దాకా ఉంటుంది. ఇస్రోల సీనియర్ సైంటిస్టుల జీతాలు సైతం సగటు సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినర్ల వేతనాల కన్నా తక్కువే. ఈ కారణం చేతనే ఐఐటియన్లు 'ఇస్రో' లో చేరడానికి ఇష్టపడడం లేదు. 2023లో ఇండియన్ స్పేస్ పాలసీ తెచ్చాక వేతనాల విషయంలో వ్యత్యాసాల వలన శాస్త్రజ్ఞులకు కొత్తఆధారం దొరకడంతో వారు'ఇస్రో'ను వదిలి వెళ్తున్నట్లు భావించవచ్చు. స్టాక్ ఆప్షన్, పెక్సిబిలిటీకి అవకాశం ఉంది. 2025లోనే ప్రైవేట్ స్పేస్ స్టార్టప్‌లలో 15కోట్ల డాలర్ల పెట్టుబడి వచ్చింది. ప్రభుత్వ వ్యవస్థలో ప్రమోషన్లు నెమ్మదిగా వస్తాయి. ప్రైవేట్ వేగంగా నిర్ణయాలే కాకుండా ఆధునిక టెక్నాలజీపై పనిచేసే అవకాశాలుంటాయి. ఇస్రో 'బ్రెయిన్ డ్రెయిన్' ఇవాళ్టిది కాదు.2004-2005లో 392 మంది శాస్త్రవేత్తలు బయటికి వెళ్లిపోయారు. అప్పట్లో ఈ అంశం పరిశీలనలోకి వచ్చినా కేవలం ఐటిరంగం విస్తృతి, ప్రైవేట్ రంగ జీతాలేనని ప్రభుత్వం పార్లమెంటులోనే విశ్లేషించి చెప్పింది. నిజానికి శాస్త్రజ్ఞులు వెళ్లకుండా తాత్కాలికంగా ఆపవచ్చేమో కానీవిజ్ఞాన విస్తృతిని ఆపేపరిస్థితి ఉండదు.అందుచే వారికి మెరుగైన అవకాశాలను కేంద్రప్రభుత్వమే కల్పించాలి. అలాంటప్పు డు మాత్రమే శాస్త్రజ్ఞులు, ఇంజినీర్లు ప్రభుత్వ సంస్థలను వదిలివెళ్లే అవకాశం తక్కువగా ఉంటుంది. భారీ జీతాల మాటెలా ఉన్నా,రిసెర్చ్ గ్రాంట్లు, ఫాస్ట్‌ట్రాక్ ప్రమోషన్లు, ప్రాజెక్టు లీడర్‌షిప్ అవకాశాలు కల్పించడం అవసరం. ఇస్రోలో శిక్షణ పొందిన వారు ప్రయివేట్ రంగానికి వెళ్లడం ద్వారా మొత్తం భారత అంతరిక్ష ఎకో సిస్టమ్ బలపడుతుంది.'ఇస్రో'లో అంతరిక్ష నౌకల ప్రయోగాల అనంతరం ప్రపంచం భారత్‌వైపు చూస్తోంది. ఇలాంటి సమయంలో ప్రతిష్టాత్మక సంస్థల నుంచి బ్రెయిన్ డ్రెయిన్ సమర్థనీయం కాదు.వాళ్లప్రైవేట్ అంతరిక్ష సంస్థలకు వెళ్లిపోకుండా తగు నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంమీద ఉంది. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవించాలి.

మాటకు మాట ప్రతీకారం కాదు, మౌనమే దానికి సమాధానం.




ప్లినీ

జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు. ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.



వివేకానంద

# ప్రజావాక్కు



## దేవుళ్ళకు కూడా జబ్బులు వస్తాయా?

ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయవిజ్ఞానంవికసిస్తుంది.మన దేశంలో మాత్రం ఆవుపేడలో మహిమలు, ఆవు మూత్రంలో రోగ నిరోధకశక్తి ఎంతశాతం ఉందో చూడమని యూనివర్శిటీలకు ప్రభుత్వాలు ఆదేశాలు ఇస్తున్నాయి. పూరి జగన్నాథ స్వామికి ప్రతిసంవత్సరం రథోత్సవం జరుగుతుంది. పదిలక్షల భక్తులువస్తారని ప్రచారం. రథం తాడు పట్టుకొని లాగితే పుణ్యమం అని ఎగబడతారు భక్తులు. తొక్కిసలాటలో ప్రతి సంవత్సరం కొంతమంది చనిపోవటం జరుగుతుంది. నిన్న ఇద్దరు భక్తులు చనిపోయారని అధికారిక వార్త.వాస్తవంగా ఎంత మంది చనిపోయింది తెలియదు. రథోత్సవం సమయంలో డాక్టర్లు పూరిజగన్నాధుని విగ్రహాలకు జ్వరం అన్నట్లుగా, విగ్రహాలకు డాక్టర్లు సెటాస్కోప్ పెట్టి పరీక్షలు జరపడం ప్రపంచంలో ఒక వింతగా చెప్పుకోవచ్చు. దేవుళ్ళకు కూడా మనుషులుగా గుండె కొట్టు కోవటం, నాడీచూడటం ,జరం రావటం దగ్గు జలుబు చేస్తాయా? ఒకవేళ వస్తే మనుషులు తయారు చేసిన మందులు పనిచేస్తాయా?

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## పరుగులు తీస్తున్న ఎఐ

కృత్రిమ మేధస్సువేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో అసలు ప్రశ్నయంత్రాలు మనుషుల్లా ఆలోచించగలవా అనేదికాదు. భూమి, నీరు,పర్యావరణ వ్యవస్థల పరిరక్షణలో మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు అవి ఎంతవరకు తోడ్పడగలవన్నదే ప్రధాన అంశం. సాంకేతికత లక్ష్యం కేవలం పనులను సులభతరం చేయడం మాత్రమే కాకుండా,ప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరచడం, ప్రకృతి సంపదను కాపాడడం కూడా కావాలి. పెరుగుతున్న నగరీకరణ నేపథ్యంలో హైదరాబాద్ వంటి మహానగరాలకు కృత్రిమమేధస్సు ఎంతో ఉపయోగపడుతుంది. ఏఐను నిర్ణయాధికారిగా కాకుండా, మానవ మేధస్సుకు సహాయక సాధనంగా ఉపయోగించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రైళ్ల రంగు మార్చాలి

మనుషులకు హెచ్చరికలు తెలిపే బోర్డులు పెట్టగలం కానీ మరి పశువులకు ఎట్లా తెలిసేది? వందే భారత్ రైళ్ల వెలుపలి భాగాలు ముఖ్యంగా తెలుపు లేతనీలం, తెలుపు కాషాయ రంగుల్లో ఉంటున్నాయి. రైలు దూరం నుంచే ప్రస్ఫుటంగా కనపడేటట్లు ఉండాలి. ఎరుపు, ఆకుపచ్చ, నీలం,గోధుమరంగుఛాయతో,ఎరుపు రంగులు వాడాలి.

- కె. రమణమూర్తి, సికింద్రాబాద్

## మత్స్యకారుల బలవన్మరణాలను నిరోధించాలి

ఈ మధ్య విశాఖ తీరంలో పడవబోల్తాపడి ఏడుగురు మత్స్యకారులు గల్లంతవ్వటం ఎంతో బాధాకరం. నేడు ఎల్‌నినో వంటి కారణాలతో వాతావరణ శాఖ కూడా పసికట్టలేనంతగా పర్యావరణం ఆకస్మిక మార్పులకు లోనవుతుంది. అల్ప పీడనం వల్ల భారీ వర్షాలు అని ప్రకటించిన చోట కూడా కొన్ని సార్లు చిన్నజల్లు పడకపోవటం తెలిసిందే. కనుక నేటి వింత వాతావరణ స్థితిని దృష్టిలో పెట్టుకొని, యుద్ధ క్షేత్రంలో సైనికులు సదా సాయుధులై అనుక్షణం సర్వసన్నద్ధంగా వుంటున్న విధంగా, వేటకి వెళ్ళే ప్రతి మత్స్యకారుడు లైఫ్ జాకెట్ ధరించి జాగరూకులై వుండాలి. ఈ ప్రమాదం నుండి బయటపడినమరోమత్స్యకారుడు,తనకు వేరేనౌకలోని చైనా సిబ్బంది విసిరిన లైఫ్‌జాకెట్ వల్ల ప్రాణాపాయం తప్పిందని చెప్పాడు. కనుక లైఫ్ జాకెట్ వుంటే ఆపదలో, ప్రాణాలు దక్కుతాయి. ఈ లైఫ్ జాకెట్ ధర కేవలం మూడు వేలరూపాయల లోపేనట. ప్రాణం కన్నా విలువైనది ఏమీ లేదు. కేవలం నష్ట పరిహారంతో పోయిన ప్రాణాలు తిరిగిరావు. కనుక చేతులు కాలాక ఆకులు పట్టుకునే కంటే ముందు జాగ్రత్త వుండాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

## చర్యలు చేబట్టాలి

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతుంది. దేశవ్యాప్తంగా ఎక్కువ ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించేందుకే మొగ్గు చూపుతున్నట్లు కేంద్ర విద్యా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లల సంఖ్య తగ్గుతుండటంపై కారణాలను లోతుగా విశ్లేషించి, అధికారులు తగిన చర్యలు చేబట్టాలి.

- మా. శ్రీ. రాజు, పాల్వంచ

## మంచి నిర్ణయమే..

తమిళనాడు ప్రభుత్వం ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యందుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు,ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచివిలువలను ప్రోత్సహించేంచాలి.

-ఎన్. కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# రైల్వేలో తెలుగు రాష్ట్రాలకు అన్యాయమే!

**ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా ఎట్టకేలకు విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వేజోన్ పేరు కొత్త రైల్వేజోనల్ కార్యాలయం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆంధ్రరాష్ట్రానికి చెందిన అనేక రైల్వే స్టేషన్లు, అనేక రైలు మార్గాలు ఇతర రైల్వే జోన్లలో కలపడం వల్ల తీవ్ర అన్యాయం జరిగింది. కొత్తగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయం సంగతి ఎలావున్నప్పటికీ తెలుగురాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైలు మార్గాల నిర్మాణం దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ పూర్తి కావడం లేదు. ఇదే సమయంలో నిన్నటి వరకు రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి సికింద్రాబాద్ కేంద్ర స్థానంగా వున్న సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఆదాయంలో దేశం మొత్తంగా మూడవ స్థానంలో, దక్షిణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో వుంది. అయినా నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. తెలుగు రాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైల్వేలైన్లు నిర్మాణ పనులు వేగం గమనిస్తే నత్తలు నయమనిస్తున్నాయి.**



అన్నవరపు బ్రహ్మయ్య

రైల్వేశాఖలో తెలుగురాష్ట్రాలకు అడుగడుగునా అన్యాయమే జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా ఎట్టకేలకు విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పేరు కొత్త రైల్వే జోనల్ కార్యాలయం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆంధ్రరాష్ట్రానికి చెందిన అనేక రైల్వే స్టేషన్లు, అనేక రైలు మార్గాలు ఇతర రైల్వే జోన్లలో కలపడం వల్ల తీవ్ర అన్యాయం జరిగింది. కొత్తగా ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయం సంగతి ఎలావున్నప్పటికీ తెలుగురాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైలు మార్గాల నిర్మాణం దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ పూర్తి కావడం లేదు. ఇదే సమయంలో నిన్నటి వరకు రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి సికింద్రాబాద్ కేంద్ర స్థానంగా వున్న సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఆదాయంలో దేశం మొత్తంగా మూడవ స్థానంలో, దక్షిణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో వుంది. అయినా నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. తెలుగు రాష్ట్రాలలో చేపట్టిన కొత్త రైల్వేలైన్లు నిర్మాణ పనులు వేగం గమనిస్తే నత్తలు నయమనిస్తున్నాయి. మాచర్ల నల్లగొండల మధ్య 92 కి.మీ.రైల్వే లైను నిర్మాణ పనులు 1997-98వ సంవత్సరంలో ప్రారంభం కాగా, కోటిపల్లినర్సాపూర్ మధ్య 57 కి.మీ.పిఠాపురం కాకినాడ మధ్య 22 కి.మీ. నూతన రైల్వే లైన్ నిర్మాణ పనులు 2001-02లో, కడప బెంగుళూరు మధ్య 255 కి.మీ. పనులు 2008-09 సంవత్సరంలో, నడికుడి శ్రీకాళహస్తి మధ్య 308 కి.మీ., గూడురుదుర్గరాజపట్నం మధ్య 46 కి.మీ.ల పనులు 2011-12లో ప్రారంభమయ్యాయి. ఇక 2012-13లో భద్రాచలం రోడ్ కొవ్వూరు మధ్య 152 కి.మీ., కంభం ప్రొద్దుటూరు మధ్య 110 కి.మీ., కొండపల్లి కొత్తగూడెం మధ్య 120 కి.మీ. మేరకు కొత్త లైన్లు పనులు ప్రారంభించారు. అంటే ఈ పనులు చేపట్టి ఇప్పటికి 15 నుంచి 26 సంవత్సరాలు దాటుతున్నా నేటికి పూర్తి కాలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వున్న సుందర ప్రాంతాలలో ఒకటైన కొనసీమ ప్రాంత ప్రజలకు ఎటువంటి రైలు ప్రయాణ సదుపాయం లేదు. కోటిపల్లి, నర్సాపూర్ల మధ్య 57కి.మీ. రైలు మార్గం నిర్మాణం పూర్తయితే కోనసీమ ప్రాంత ప్రజలకు రైలు ప్రయాణ సదుపాయం ఏర్పడుతుంది. నిర్మాణానికి సర్వేపూర్తి చేసిన సమయానికి అంటే 498కోట్ల రూపాయల ఖర్చు అవుతుందని అంచనావేశారు. నేడు అదే మార్గం నిర్మాణానికి కనీసం 1200 కోట్ల రూపాయలు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు 7 నూతన రైలు మార్గాలు పూర్తవుతాయా? లేదా అనే అనుమానం కలుగుతుంది. రైల్వేబోర్డు నిబంధనల ప్రకారం ప్రతిపాదిత కొత్తరైల్వే మార్గాల ఏర్పాటుకు అయ్యే వ్యయంలో కనీసం ఆరు శాతం ఆదాయం వచ్చే అవకాశం వుంటే చాలు, కానీ తెలుగురాష్ట్రాలలో ప్రతిపాదించిన ప్రతి కొత్త రైల్వే మార్గంలో 6 నుంచి 10శాతం ఆదాయం వస్తుందని అంచనా వేశారు. అయినప్పటికీ నిర్మాణ పనులకు అవసరమైన నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం ఎందుకువహిస్తున్నారో అర్థంకావడం లేదు. ఆంధ్రప్రదేశ్ పైన తెలిపిన నిర్మాణ పనులు కాకుండా కొత్తగా మరో 22మార్గాలలో నూతన రైల్వేలైన్ల ఏర్పాటుకు సంబంధించి రెండు దశాబ్దాల కిందటే సర్వేలు పూర్తయ్యాయి. ఇక మార్కాపురం, శ్రీశైలం




హైదరాబాద్‌ల మధ్య 290కి.మీ., మాచర్ల,గద్వాల్ మధ్య 184 కి.మీ. నెల్లూరు, రాజంపేట మధ్య 120కి. మీ., సామర్లకోట చింతూరుల మధ్య 150 కి.మీ., కళ్యాణదుర్గం అనంతపూర్ల మధ్య 58కి.మీ., భద్రాచలం,సత్తుపల్లి మధ్య 54.1 కి.మీ. మేరకు నూతనంగా రైల్వే లైన్లు వేయాలనే ప్రతిపాదనలు వచ్చాయి. కొత్త రైల్వేలైన్ల సర్వేలు, ప్రతిపాదనలు సిద్ధం చేసి పుష్కరకాలం దాటిపోయింది. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చుతాయో లేదో ఎవరూచెప్పలేని స్థితి. కానీ కేవలం ఆరేళ్ల క్రితం తమిళనాడు రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన 14 రైల్వే లైన్ల పనులు, కర్ణాటక రాష్ట్రంలో ప్రారంభించిన 18 పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. మనకు స్వాతంత్ర్యం లభించిన 75 ఏళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా నంద్యాల ఎర్రగుంట మధ్య 126 కి.మీ., కాకినాడ కోటిపల్లి మధ్య 45 కి.మీ., కృష్ణపట్నం ఓబులవారిపల్లి మధ్య 113 కి.మీ. మేరకు మాత్రమే వేశారు. (నిజానికి కాకినాడ కోటిపల్లి మధ్య వేసినది కొత్తలైను కాదు, రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో దెబ్బతిన్న ఈ మార్గాన్ని పునరుద్ధరించారు.) కానీ ఇదే సమయంలో తమిళనాడులో కొత్తగా ఏడు లైన్లు, కర్ణాటకలో ఏడు లైన్లు పూర్తయ్యాయి. దీనిని బట్టి తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్లమెంటు సభ్యుల పనితీరు ఏపాటిదో అర్థం అవుతోంది. ఇక ఆదాయం విషయానికి వస్తే రైల్వేలో అత్యధిక ఆదాయం సంపాదిస్తున్న రైల్వేజోన్లలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన దక్షిణ మధ్య రైల్వేమూడో స్థానంలో వుంది. దేశవ్యాప్తం వున్న (కొత్తగా ఏర్పడిన విశాఖ రైల్వే జోన్ కాకుండా)17 రైల్వే జోన్ల నుంచి 2024-25వ సంవత్సరంలో 2,65,0024 కోట్ల రూపాయలు ఆదాయం లభించగా ఇందులో 3,93288 కోట్ల రూపాయలఆదాయంతో ప్రయాగ కేంద్రస్థానంగా వున్న నార్త్ సెంట్రల్ రైలేజోన్ మొదటి స్థానంలో, 23,775,70 కోట్ల రూపాయల ఆదాయంతో భువనేశ్వర్లోని ఈస్ట్రెస్ట్ జోన్ రెండో స్థానంలో, 23,344.20 కోట్ల రూపాయల ఆదాయంతో సికింద్రాబాద్ కేంద్రస్థానంగా వున్న సౌత్ సెంట్రల్ రైల్వే మూడో స్థానంలో వుంది. దక్షిణాది రాష్ట్రాలలో అయితే ప్రథమ స్థానంలో వుంది. సౌత్ సెంట్రల్ జోన్ నుంచి ఇంత పెద్దమొత్తంలో ఆదాయం లభిస్తున్నప్పటికీ అభివృద్ధి పరంగా ఈ జోను నామమాత్రంగా కూడా నిధులు కేటాయించడం లేదు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటు సందర్భంగా వివిధ కీలకమైన రైల్వే స్టేషన్లను విశాఖజోన్ పరిధిలోకి రాకుండా చేశారు. కొత్త జోన్ ఏర్పాటుకు ముందు విశాఖపట్నం డివిజన్ పరిధిలో వున్న కొత్తవలస అరకు వరకు వున్న రైలుమార్గం ప్రస్తుతం విశాఖ డివిజన్ నుంచి తప్పించి రాయఘడ్ డివిజన్ పరిధిలోకి చేర్చారు. ఈ కారణంగా పర్యటక కేంద్రాలైన అరకు, బొర్ర గుహల ద్వారా లభించే ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. తాజా విశాఖపట్నం జోన్ ఏర్పాటు సందర్భంగా అంధ్రప్రాంతంలో వున్న రాయచూర్ దాడి మధ్యంలో వున్న 108 కి.మీ. రైలు మార్గం, పగిడిపల్లి విష్ణుపురం జాన్పహాడ్ మధ్య వున్న 142 కి.మీ.ల రైల్వేలైనులను గుంటకల్ నుంచి విడదీసి సికింద్రాబాద్ డివిజన్లో కలిపారు. అదేవిధంగా జగ్గయ్యపేట ప్రాంతంలోని సిమెంట్ ఫ్యాక్టరీల ద్వారా అధిక ఆదాయం లభించే మోటమర్రి జగ్గయ్యపేట మార్గాన్ని దగ్గరలో వున్న విజయవాడ డివిజన్కు బదులుగా సికింద్రాబాద్ డివిజన్లో వుంచారు. అంతేకాకుండా మన రాష్ట్ర పరిధిలోని దాదాపు 500 కి.మీ.ల రైల్వే లైన్లు ఇతర రాష్ట్రాలలో రైల్వే జోన్ల పరిధిలో కొనసాగుతున్నాయి. ఉదాహరణకి తడగూడూరు మధ్య వున్న 68 కి.మీ. రైల్వేలైను చెన్నయి కేంద్రంగా వున్న దక్షిణ రైల్వేజోన్లో, ధర్మవరంహింతూపూర్ మధ్యవున్న 107 కి.మీ. రైల్వే లైను సౌత్ వెస్టన్ రైల్వే జోన్లోని బెంగుళూరు డివిజన్లో వున్నాయి. అలాగే ఆంధ్ర ప్రాంతానికి చెందిన సూళ్లూరుపేట, నగరి ప్రాంతాలుసదరన్ రైల్వేలో, హిందూపూర్, పెనుగొండ, పుట్టపర్తి, హిందూపూరు సౌత్ వెస్టన్ రైల్వే జోన్లలో వున్నాయి.తాజా విశాఖపట్నంకు అత్యంత చేరువలో వుండే శృంగవరపుకోట,అరకు అసెంబ్లీ నియోజకవర్గాలు రాయఘడ్ డివిజన్ పరిధిలో వున్నాయి. తెలుగు రాష్ట్రాలలో ప్రతిపాదించిన కొత్త రైలు మార్గాల పరిస్థితి దయనీయంగా వుంది. తెలుగురాష్ట్రాలలో నూతన రైలు మార్గాలు పొందడానికి ఆర్థికంగా, నైసర్గికంగా తెలుగురాష్ట్రాలకు అన్ని రకాలుగా అర్హత వున్నది. అయినా వివక్షత, రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యుల ఉదాశీనత కారణంగా తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఈ అన్యాయాలు జరగడకుండా చూడాల్సిన అవసరం ఉంది. ●

# దేశాభివృద్ధికి యువత నైపుణ్యమే పునాది

బి.మధుపాళి

ప్రపంచంలోని 8.2 బిలియన్ల జనాభాలో 15 నుంచి 24 ఏండ్ల వయస్సు కలిగిన యువత జనాభా1.22 బిలియన్లు (దాదాపు 15.4 శాతం) ఉన్నారు. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా 15 నుంచి 64 ఏండ్ల వయస్సు కలిగిన పని చేసే లేదా వర్కింగ్ క్లాస్ జనాభా 78 శాతం అనగా 6.4 బిలియన్లు ఉన్నారు. నేడు భారత జనాభా 1.46 బిలియన్లు ఉన్నది. ఇందులో 15 నుంచి 29 ఏండ్ల యువత జనాభా 40శాతం వరకు ఉన్నది. మన దేశంలో 15 నుంచి 64 ఏండ్ల వయస్సు కలిగిన పని చేసే లేదా వర్కింగ్ క్లాస్ జనాభా 96.1కోట్లు (లేదా 0.961 బిలియన్లు), అనగా 68 శాతం వరకు ఉన్నది. ఇండియాలో 15 ఏండ్లలోపు జనాభా 24 శాతం, 64 ఏండ్లు దాటిన వారి జనాభా 7శాతం వరకు ఉన్నది. ఇతర దేశాలతో పోల్చితే భారత జనాభా సగటు వయస్సు చాలా తక్కువగా 28.8 ఏండ్లు మాత్రమే ఉన్నది. జపాన్ ప్రజల సగటు వయస్సు 49.9 ఏండ్లు ఉన్నది. అందువల్లనే 'ఇండియాను యువ భారత్' అని, జపాన్‌ను 'ఓల్డ్ జపాన్' అని పిలుస్తున్నాం. యువ జనాభా అధికంగా ఉండడం వల్ల రాబోయే రోజుల్లో విశ్వదేశాల్లో భారత్ ముందుండి తన సత్తాను గట్టిగా చాటుకోనున్నది. యువత అధికంగా ఉండడంతో పాటు ఆ యువత నైపుణ్య విద్యను పొందితే భారత భవిత ఉజ్వలంగా ఉండనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అధిక యువ జనాభా కలిగిన యువ భారతాన్ని పలు సవాళ్లు కూడా వెంటాడుతున్నాయి. నేడు పరిశ్రమ ఆశిస్తున్న నైపుణ్యాలకు, నేటి మన యువత కలిగి ఉన్న నైపుణ్యాలకు మధ్య వ్యత్యాసం లేదా గ్యాప్ అధికంగా ఉండడంతో మన యువశక్తి దేశాభివృద్ధికి అంతగా వినియోగపడడం లేదు. యువతలో అవసర నైపుణ్యాలు కొరవడితే



నిరుద్యోగం పెరగడం, తక్కువస్థాయి ఉద్యోగాలు చేయడం లాంటి ప్రతికూల ఫలితాలు వెక్కిరిస్తున్నాయి. తగిన నైపుణ్యాలు లేని యువతతో నిరుద్యోగసమస్యలు పెరిగి సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి, సమానత్వ భావనలు పలుచబడతాయి. పౌర సమాజ సుస్థిరాభివృద్ధికి, ఆరోగ్యకర సమాజ స్థాపనకు నైపుణ్య యువత మాత్రమే పునాది అవుతారు. బహుళ జాతి కంపెనీలు (ఎంఎన్‌సిలు) లేదా పరిశ్రమలు కోరుతున్న నైపుణ్యాలను నేటి విద్యాలయాలు బోధిస్తూ, తగు శిక్షణలు ఇవ్వాలి. నేడు ప్రపంచం 4వ పారిశ్రామిక విప్లవం సాకారం కావడానికి 'ఏఐ, సాంకేతిక, వృత్తి విద్య శిక్షణ' రంగాలు నడుం బిగిస్తే నేటి యువత రేపటి పరిశ్రమలో పనిచేయడానికి సిద్ధం అవుతారు. నేడు ఏఐరంగం ప్రపంచాన్ని శాసిస్తున్నది. మన జీవితాలు, లెర్నింగ్, చేసే పనులను ఏఐ నిర్ణయించనున్నది. పరిశ్రమ కోరుకున్న నైపుణ్యాల్లోమాత్రమే మన యువతను సదాసిద్ధంచేయాలి. నైపుణ్య యువతతో సమాజ శాంతి,సమ్మిళిత సుస్థిరాభివృద్ధి సుసాధ్యం అవుతాయని నేటి విద్యాలయాలు, ప్రభుత్వాలు, యువత, పౌర సమాజం, పాలసీ తయారు చేసే వారు గట్టిగా నమ్మాల్సిన అగత్యంఏర్పడింది. ఉత్తమవృత్తి శిక్షణ, ఏఐ నైపుణ్యాల్లో వృద్ధి, డిజిటల్ సాధికారత వంటి అంశాల్లో యువత దృష్టి పెట్టాలి. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మన చదువులు కొనసాగాలి. ఉత్తమ శ్రేణి బోధనలు, అవసర మౌలిక వసతులు, నైపుణ్యాల వృద్ధికి తగిన నిధులను వెచ్చించడం, నాణ్యమైన విద్యా బోధనలు నేటి తక్షణ కర్తవ్యం అని మరువరాదు.నేటి యువతనాణ్యమైన నైపుణ్య విద్యను పొందితే మన యువశక్తి దేశానికి వరంగా మారుతుంది. యువతలో నైపుణ్యాలు కొరవడితే యువశక్తి శాపంగా మారి, అశాంతికి ఆజ్యం పోస్తుంది. మన యువతను నైపుణ్య శక్తిగా మార్చుదాం. ●

# వ్యవస్థల తీరుతో కొండలు, గుట్టలు పదిలమేనా?

డాక్టర్ ఎ. భాగ్యరాజ్

అడవులను, కొండను, గుట్టలను సృష్టించడానికి ప్రకృతికి లక్షల సంవత్సరాలు పడుతుంది. దానిని నాశనం చేయడానికి మనిషికి కొన్ని నెలలే చాలు. ఇది కేవలం ఒక భావోద్వేగ వాక్యం కాదు. నేటి భారతదేశంలో అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్న వాస్తవం రూపం. ఒకప్పుడు పచ్చదనంతో, అడవులతో, జీవవైవిధ్యంతో కళకళలాడిన కొండలు నేడు క్వారీలుగా,గ్రావెల్ గుంతలుగా,రాతి గనులుగా మారుతున్నాయి. ఇది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు. ఇది రాజ్యాంగ పరిరక్షణ, చట్టాల అమలు, పరిపాలనా పారదర్శకత, అవినీతి నియంత్రణ, ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి సంబంధించిన ముఖ్యమైన సమస్య. అసలు ప్రకృతి సంపద ఎవరిది? అని ప్రశ్నించుకుంటే! కొండలు, గుట్టలు, అడవులు, నదులు, చెరువులు ఏ ప్రభుత్వానివి కావు, అవి ప్రజల ఉమ్మడి ఆస్తి. ప్రభుత్వంఏదైనా వాటికి కేవలం సంరక్షలు మాత్రమే. ఈ సూత్రాన్ని భారత న్యాయవ్యవస్థ అనేక సందర్భాల్లో వక్కాణించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 48ఎ ప్రకారం పర్యావరణం, అడవులు, వన్యప్రాణులను రక్షించడం రాష్ట్రాల బాధ్యత.ఆర్టికల్ 51ఎ (జి) ప్రకారం ప్రతి పౌరుడు ప్రకృతిని పరిరక్షించడం తన ప్రాథమిక విధిగా భావించాలి. ఆర్టికల్ 21కిందజీవించే హక్కులో పరిశుభ్రమైన పర్యావరణం కూడా భాగమని భారత న్యాయస్థానాలు వివిధ తీర్పులలో వివరణ ఇచ్చాయి. పర్యావరణ రక్షణలో ప్రధానంగా చూస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం1986, అటవీ సంరక్షణ చట్టం,గనులు ఖనిజాల అభివృద్ధి చట్టం, జీవవైవిధ్య చట్టం,నీటి,గాలికాలుష్య నియంత్రణ చట్టాలున్నాయి. ఈ చట్టాలన్నీ అక్రమ తవ్వకాలను నియంత్రించడానికి బలమైన నిబంధనలు కలిగి ఉన్నాయి.అయినా ఎందుకు ఆగడం లేదు?అని ఆలోచిస్తే, లోపం చట్టాలలో కాదు, అమలులో లోపం అని తెలుస్తోంది. దానిలో ప్రధానమైనది ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యం.అక్రమతవ్వకాలు ఒక్కరోజులో జరగవు. భారీ యంత్రాలు, వందలాది లారీలు, పేలుడు పదార్థాలు ఉపయోగిస్తారు. ఇన్ని జరుగుతున్నా సంబంధిత శాఖలకు తెలియకపోవడం నమ్మశక్యంగా లేదు, అదీ కాకుండా ఇప్పుడు ప్రతిగ్రామంలో సచివాలయాలున్నాయి. ఇక అవినీతి అనేది ప్రజల్లో వినిపించే ప్రధాన ఆరోపణ, కొంతమంది అక్రమ వ్యాపారులు,అవినీతిపరులైన అధికారులు కలిసి సహజ వనరులను దోచుకుంటున్నారనేది జగమెరిగిన సత్యం. ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై పారదర్శక విచారణ జరగడం ప్రజావిశ్వాసానికి చాలా అవసరం. అదీ కాకుండా ప్రజలలో అవగాహన లేకపోవడం దౌర్భాగ్యం. తెలియనిది ఏమిటంటే అక్రమ మైనింగ్ కనిపిస్తే ఎక్కడ ఫిర్యాదు చేయాలి?ఏ అనుమతులు తప్పనిసరి? పర్యావరణ అనుమతి అంటే ఏమిటి? గ్రామసభకు ఉన్న అధికారాలు ఏమిటి?ఈ అవగాహన లేకపోవడమే అక్రమార్కులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తుంది. ఉదాహరణకు ఒక గ్రామం పక్కన ఉన్న కొండను గ్రావెల్ కోసం తవ్వడం ప్రారంభించారు, మొదట ప్రజలు



పట్టించుకోలేదు. కొన్ని నెలల తరువాత కొండ సగం కనుమరుగైంది. వర్షాకాలంలోవర్షపు నీరు వేగంగా గ్రామంలోకి వచ్చింది. చెరువు పూడిపోయింది, భూగర్భజలాలుతగ్గాయి, రైతుల బావులు ఎండిపోయాయి. అప్పుడు అందరికీప్రకృతి విలువ తెలిసింది. కొండపోతే ఏమిపోతుంది? అనుకుంటే వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల రీఛార్జ్, జీవ వైవిధ్యం, ఔషధ మొక్కలు, పక్షుల నివాసం,స్థానిక వాతావరణ సమతుల్యత, భవిష్యత్ తరాల హక్కు మొదలైనవి పోతుంది. మరోపక్క ప్రపంచ దేశాలు ఏం చేస్తున్నాయి? అని చుస్తే అభివృద్ధి చెందిన అనేక దేశాలు పెద్దఎత్తున తవ్వకాలపై కఠిన పర్యావరణ పరిశీలనలు,ప్రజాభిప్రాయ సేకరణ, పునరుద్ధరణ బాధ్యతలను అమలు చేస్తున్నాయి. అనుమతుల ఉల్లంఘనపై భారీ జరిమానాలు, లైసెన్స్ రద్దు వంటిచర్యలు తీసుకుంటాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాతీసుకున్న స్పందన కార్యక్రమం ఈ అక్రమ తవ్వకాలు, రవాణా విషయంలో హాస్యాస్పదంగా మారింది. అంటే ప్రభుత్వంలోని పెద్దలు, అధికారుల తీరు ఏవిధంగా ఉందో తెలుస్తోంది. దోపిడీదారులకు సహజవనరులు ఆర్థిక వనరుగా మారిపోయింది. ఇక ప్రజలమైన మనం ఏమి చేయాలి? అని చూస్తే అక్రమ తవ్వకాలను వీడియోలు, ఫోటోలతోసమోదు చేయాలి. రెవెన్యూ, గనుల, అటవీ శాఖలకు ఫిర్యాదు చేయాలి. సమాచార హక్కు చట్టం ద్వారా అనుమతుల వివరాలు కోరాలి. గ్రామసభల్లో ఈ అంశాన్ని చర్చించాలి. అధికారులు చర్యలు తీసుకోకుంటే ప్రజలే నిరసనలు, పోరాటాల ద్వారా నిరసనలు తెలియజేయాలి. ఇక్కడ ప్రముఖంగా అధికారుల మధ్య, విభాగాల మధ్య సమన్వయం లేదు, మాకు సంబంధంలేదు అని వెకిలిగా, బాధ్యతారాహిత్యంగా బదులుంటుంది. దానికి ప్రధాన కారణం అధికారంలో ఉన్న బాధ్యతారాహిత్య రాజకీయ నాయకుల అండదండలు, సహకారం ప్రధానమైనది. ఇక ప్రభుత్వాలు డ్రోన్లతో పర్యవేక్షణ, భౌగోళిక సమాచారవ్యవస్థ మ్యాపింగ్, ఆన్లైన్ మైనింగ్ అనుమతులు, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్తో ఖనిజ రవాణా పర్యవేక్షణ, అక్రమతవ్వకాలపై వేగవంతమైన ప్రత్యేకన్యాయస్థానాలు, అవినీతిపరులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వివిధ విభాగాల్లో ఉన్నప్రభుత్వ అధికారులు సమన్వయంతో, కలసిపనిచేస్తే నిర్ణయాలు త్వరగా తీసుకునే అవకాశముంది. ప్రకృతి నాశనం నెమ్మదిగా జరుగుతుంది, కానీ దాని ప్రభావం కొన్నితరాలపాటు ఉంటుంది.కొండలు కూలిపోతే తిరిగి నిర్మించలేం, అడవులు నరికితే వెంటనే తిరిగి పెంచలేం, భూగర్భజలాలు తగ్గితే ఒకే ఏడాదిలో నింపలేం, ప్రకృతి సంపదను కాపాడటం అంటే దేశ భక్తిని ఆచరణలో చూపించడమే.చట్టాలను అమలుచేయడం ప్రభుత్వబాధ్యత, వాటిని పర్యవేక్షించడం ప్రజల బాధ్యత.ఈ రెండూ కలిసినప్పుడే కొండలు, గుట్టలు, అడవులు భవిష్యత్ తరాలకు పదిలంగా ఉంటాయి, లేదంటే భవిష్యత్తులో మ్యూజియంలలో,ఫోటోలలో చూసుకోవలసిందే. ప్రధానంగాచూస్తే ఇక అవినీతి కుడితినీళ్ల తాగేఅక్రమార్కు లకు, అధికారులకు తెలియనిది ఏమిటంటే భవిష్యత్తులో వారి వారసత్వాలు కూడా ప్రకృతిప్రకోపానికి బాధితులుగా మారుతారని తెలియకపోవడమే వారిఅజ్ఞానానికి నిదర్శనం. ●

# జమ్ము-కాశ్మీర్‌లో వరద విలయం!

**ఎడతెగని వర్షాలతో 17 మంది మృతి, పలువురు గల్లంతు**

**రజౌరి, పూంఛ్ జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రం**

**అమర్‌నాథ్, వైష్ణోదేవి యాత్రకు బ్రేక్**

**ఇళ్లలో పారుతున్న వరదనీరు, కొట్టుకు పోయిన వాహనాలు**







**శ్రీనగర్,జులై 19:** జమ్మూకశ్మీర్ లో భారీ వర్షాలు, వరదలుబీభత్సం సృష్టించాయి. ఎడతెగని వర్షా ల వల్ల రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. రాజౌరీలో నదులు పొంగిపొర్ల డంతో పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. కొత్త బస్టాండ్ పూర్తిగా నీట మునిగింది. ఈ వరదలవల్ల 17 మంది మృతిచెందారు. పలువురు గల్లంతయ్యారు. మరికొందరు తీవ్రంగా గాయ పడ్డారు. శనివారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు ఆదివారం వరదలు పోటెత్తాయి. ఈ ఘటనలో నలుగురు మృతిచెందగా మరో ఐదుగురు గల్లంతయ్యారు. మృతుల్లో భారీ వర్షాల కారణంగా పూంచ్ జిల్లాలో ఇల్లు కూలి ముగ్గురు మరణించగా రాజౌరిలో కొండచరియలు విరిగి పడటం, ఆకస్మిక వరదలు, భారీ వర్షాలతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు గల్లంతైన ఐదుగురి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. వందలాది మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రాజౌరి జిల్లాలోని దర్హాలి, ఖండ్లీ, సుక్తోహ్, జమోలా నదులతో సహా అన్ని ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాటిలో చాలా వరకు ప్రమాదకర స్థాయికి చేరి అనేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా రాజౌరి పట్టణాన్ని వరదనీరు ముం చెత్తింది. దర్హాలి నదికి వరద పోటెత్తగా బేలా కాలనీ సమీపంలోని రక్షణ గోడ కూలిపోయింది. దాంతో కొత్త బస్టాండ్ ఆవరణలోకి వరద నీరు దూసుకొచ్చి డజన్ల కొద్దీ వాహనాలు కొట్టుకుపో యాయి. అబ్దుల్లా వంతెన సమీపంలోని మురికి వాడ కూడా తీవ్రంగా దెబ్బతింది. ఆ ప్రాంతంలోకి వరదనీరు ప్రవేశించడంతో 50 కిపైగా కుటుం బాలను అధికారులు ఖాళీ చేయించారు. తారిఖ్ వంతెన సమీప ప్రాంతాన్నీ వరద నీరు ముం చెత్తింది. దాంతో పోలీసులు, అత్యవసర సిబ్బంది స్థానికులను నదీ తీర ప్రాంతానికి దూరంగా తర లించారు. అలాగే నదీ తీరం, లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే ఇళ్లను ఖాళీ చేయాలని అధి కారులు సూచించారు. జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా జూలై 23 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. గత 24 గంటల్లో రియాసిలో అత్యధికంగా 106 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజౌరిలో 103 మిల్లీమీటర్లు, ఉధంపూర్‌లో 101.6 మిల్లీ మీటర్లు, కత్రాలో 85 మిల్లీమీటర్లు, పూంచ్‌లో 77 మిల్లీమీటర్లు, బటోటేలో 57.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. దీంతో అమర్‌నాథ్ యాత్రకు బ్రేక్ పడింది. ఆదివారం నుంచి అధికారులు ఈ యాత్రను నిలిపివేశారు. బేస్ క్యాంపుల నుంచి భక్తులు ఎవరినీ కూడా యాత్రకు అనుమతి ఇవ్వట్లేదు. బేస్ క్యాంపుల్లో తమకు కేటాయించిన చోటే ఉండిపోవాలంటూ ఆదేశాలు ఇచ్చారు. అమర్‌నాథ్‌తో పాటు ప్రఖ్యాత వైష్ణోదేవి అమ్మవారి యాత్ర కూడా స్తంభించిపోయింది. తదుపరి ఆదేశాలు వెలువడేంత వరకూ ఈ రెండింటినీ పునరుద్ధరించబోమని తెలిపారు. ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో జమ్మూ డివి జనల్ కమిషనర్ రమేష్ కుమార్ మార్గదర్శకాలు విడుదల చేశారు. జమ్మూ నుంచి కాశ్మీర్ వైపునకు యాత్రీకులను రానివ్వట్లేదు. ఇతర ప్రాంతాల వైపు నుంచి వచ్చే భక్తులు ప్రస్తుతానికి జమ్మూ, ఉధం పూర్, రామ్ బన్‌లలో ఏర్పాటు చేసిన వసతి కేంద్రాల వద్దే తలదాచుకోవాలి. తదుపరి ఆదేశాలు వెలువడిన తర్వాతే వైష్ణోదేవి యాత్రకు అనుమతి లభిస్తుందని ఈ మార్గదర్శకాల్లో పొందుపరిచారు. బాల్తల్ బేస్ క్యాంప్‌లోనే అమర్ నాథ్ యాత్రీకు లను నిలిపివేశారు. బంగాళాఖాతం, అరేబియా సముద్రాల నుంచి వస్తున్న తీవ్ర తేమ గాలుల ప్రభావంతో జమ్మూ కాశ్మీర్‌లో నేటి నుంచి 23 వరకు కుండపోత వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రత్యేకించి 21 నుంచి 23 మధ్య కాశ్మీర్‌లో అతి భారీ వర్షాలు పడొచ్చని,20నుంచి 23 మధ్య జమ్మూ రీజియన్ లోని రియాసీ, ఉధంపూర్ జిల్లాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

# సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఇరాన్‌లో లేరు?

**అధికార పోరుతో ఉద్రిక్త పరిస్థితులు**



**దుబాయి,జులై 19:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖామెనీ ప్రస్తుతం ఇరాన్‌లో లేరని సౌదీ అరేబి యాకు చెందిన వార్తా సంస్థ అల్‌హదాత్ ఇజ్రా యెల్ భద్రతా వర్గాల సమాచారంతో సంచలన కథనం ప్రచురించింది. ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ సంయుక్త దాడిలో మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీఖామెనీ మరణించగా, అదే దాడిలో మొజ్తబా ఖామెనీ తీవ్రంగా గాయపడి నట్లు సమాచారం. అనంతరం ఆయన ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటికీ, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ప్రపంచం తో ఆయన రాతపూర్వక ప్రకటనల ద్వారానే సంభాషిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, మొజ్తబా ఖామెనీ గాయాల నుంచి కోలుకుంటున్నారని, అమెరికాతో జరుగుతున్న చర్చలకు కూడా ఆయనే మార్గనిర్దేశం చేస్తున్నారని ఇరాన్ అధికారులు చెబుతున్నారు. కానీ అల్‌హదాత్ కథనం ప్రకా రం, ఖమేనీ పేరుతో వెలువడుతున్న అధికారిక ప్రకటనలను కొత్తగా నియమితులైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ చీఫ్ అహ్మద్ వహీదితో పాటు ఆ సంస్థకు చెందిన ఇతర ఉన్నతాధికారులే రూపొందిస్తున్నారని ఇజ్రాయెల్ భద్రతా వర్గాలు ఆరోపించాయి. ఇజ్రాయెల్ భద్రతా వర్గాల ప్రకా రం, ఇరాన్‌లో అంతర్గత విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయని, అవి ఐఆర్‌జీసీ ఉనికికే ముప్పు గామారుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్‌పై మరోసారి దాడులు జరిగితే అందులో ఇజ్రాయెల్ పాల్గొనాలని అమెరికా కోరుకోవడం లేదని కూడా ఆవర్గాలు తెలిపాయి.

మొజ్తబా ఖామెనీ ప్రజలకు కనిపించకుండా ఉండటంతో ఇరాన్ రాజకీయాల్లో అధికార పోరు ముదురుతున్నట్లు అంతర్జాతీయ మీడియా సంస్థ నివేదించింది.

## ట్రంప్ సంతకానికే విలువలేదు: మొజ్తబా ఖమేనీ

**టెహ్రాన్,జులై 19:** అమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకానికి ఎలాంటి విలువ లేదని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ విమర్శించారు. ఇటీవల ఇరాన్‌అమెరికా మధ్య కుదిరిన శాంతి అవగాహన ఒప్పందం (ఎంఓయూ)ను అమెరికానే ఉల్లంఘించిందని ఆరోపించారు. దీంతో ట్రంప్ సంతకం విలువలేనిదనే విషయం మరోసారి రుజువైందన్నారు. ఇరాన్‌ప్రజలకు విడుదల చేసిన సందేశంలో ఖమేనీ ఈవ్యాఖ్యలు చేశారు. జూన్ 18న ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య కుదిరిన ఎం ఓయూను ఉల్లంఘిస్తోందని విమర్శించారు.

# అమెరికాను కమ్మిన కెనడా కార్చిచ్చు పొగ



**ఆ దేశంపై అదనపు సుంకాలు విధిస్తాం: ట్రంప్**

**న్యూయార్క్, జులై 19:** వాతావరణ మార్పుల వల్ల అమెరికా, కెనడాల్లో కార్చిచ్చులు రేగుతూనే ఉన్నాయి. అదుపులోని అడవి మంటల వల్ల అమెరికాలో మిన్నెసోటా, ఇల్లినోయీ, మిషిగాన్, డెట్రాయిట్‌తోపాటు పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత క్షీణించింది. అమెరికా రాజధాని నగరం వాషింగ్టన్‌ను కూడా దట్టమైన పొగ కమ్మేసింది. ప్రజలు, ముఖ్యంగా గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు, వృద్ధులు, పిల్లలు గాలి నాణ్యత మెరుగుపడే వరకు బయటకు వెళ్లరాదని అధికారులు సూచించారు. చాలా రాష్ట్రాల్లో శని వారం వరకు ప్రమాదకర పరిస్థితులు కొనసాగు తాయన్నారు. కార్చిచ్చుల ద్వారా వ్యాపిస్తున్న పొగ, మంటలకు కెనడా అటవీ నిర్వహణ లోపాలే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. కెనడాపై అదనపు సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలపై కెనడా ప్రభుత్వం మొదట్లో స్పం దించలేదు. గతంలో కార్చిచ్చులను ఎదుర్కో వడంలో అమెరికాకు కెనడా సహాయం చేసిందని అంటారియో రాష్ట్ర నేత డగ్‌ఫోర్డ్ గుర్తు చేశారు. 'రాజకీయ నాయకులు ఫిర్యాదులు చేయడం మాని పొరుగువారికి సహాయం చేయడం మం చిది. మనం మన అమెరికన్ స్నేహితుల కోసం గతంలో కచ్చితంగా అదే పని చేశాం' అని ఫోర్డ్ చెప్పారు. కెనడాలోని ఉత్తర అంటారియోలో సు మారు 190 చోట్ల కార్చిచ్చులు, మంటలు వ్యా పించాయి. మంటలు రేగుతున్న ప్రాంతాల నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. మరికొన్ని ప్రాంతాల వారిని ఖాళీ చేసే అవకాశం ఉంది.

# వర్షాలకోసం గాడిదలకు గులాబ్‌జామూన్

**మధ్యప్రదేశ్‌లో వింత సాంప్రదాయం**



**భోపాల్,జులై 19:** మధ్యప్రదేశ్ రాజధాని భోపా ల్‌లో రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో స్థానికులు వర్షాల కోసం ఒక వింత ఆచారాన్ని ఆశ్రయించారు. నగరంలో తీవ్రమైన ఉక్కపోత, పొడివాతావరణం నెలకొనడంతో వానలు పడా లని కోరుకుంటూ గాడిదలకు గులాబ్ జా మూన్లు తినిపించే వినూత్న కార్యక్రమాన్ని చేప ట్టారు. స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గాడిదలకు ఎంతో ఇష్టంగా ఈ భారతీయ సం ప్రదాయ స్వీటును తినిపించారు. దీనికి సంబం ధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడి యాలో విపరీతంగా వైరల్ కావడంతో దేశవ్యా ప్తంగా నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సమయానికి పడకపోయినా, రుతు పవనాలు బలహీనపడినా ఈ వింత ఆచారాన్ని పాటించడం ఇక్కడ ఎప్పటి నుంచో వస్తున్న ఒక సంప్రదాయం. ఇలా జంతువులకు తియ్య టి పదార్థాలు తినిపించడం వల్ల వాన దేవుడైన ఇంద్రుడు ప్రసన్నమై, సకాలంలో వర్షాలు కురుస్తాయని ప్రజల గట్టి నమ్మకం. వర్షాలు ఆలస్యమైనప్పుడు మా పెద్దలు ఈ సంప్రదాయాన్ని పాటించడం మేము చిన్నప్పటి నుండి చూస్తున్నాం. అందుకే గాడిదలకు స్వీట్లు తినిపించి మంచి వర్షాలు పడాలని ప్రార్థిం చామని ఈ వేడుకలో పాల్గొన్న ఒకరు తెలి పారు. రుతుపవనాల గమనానికి వాతావరణ మార్పులే కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నప్ప టికీ ఇలాంటి సంప్రదాయాలు భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజల జీవన విధానంలో అంతర్భాగంగా మారిపోయాయి. ఈవింత పూజ తో వానదేవుడు కరుణిస్తాడో లేదో చూడాలి కానీ,ప్రస్తుతానికి మాత్రం భోపాల్‌లోని గాడ దలు గులాబ్ జామూన్ల విందును ఆరగిస్తూ హుషారుతో గంతులేస్తున్నాయి.

# రామమందిర విరాళాల చోరీపై సమగ్ర విచారణ జరపాలి

**శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వ్యవహారాలపైనా దర్యాప్తు చేయించాలి**

**ప్రధాని మోడీకి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సంయుక్త లేఖ**



**న్యూఢిల్లీ, జులై 19:** శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ యొక్క 'ఆర్థిక వ్యవహారాలపై స్వతంత్ర, సమగ్ర విచారణ జరపాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి సంయుక్త లేఖ రాశారు. పార్ల మెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావ డానికి ఒక్క రోజు ముందు ఆదివారం ఈ లేఖ విడుదల చేశారు. దీంతో పార్లమెంటులో వాడివేడి చర్చలకు వేదిక కానున్నట్లు కనిపిస్తోంది. 'శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్‌లో వేల కోట్ల రూపా యల చోరీ జరగడం మీకు తెలిసిన విషయమే. తమ కష్టార్జితాన్ని విశ్వాసం, భక్తి, నమ్మకంతో విరాళంగా ఇచ్చిన లక్షలాది మంది భక్తులు ఈ చోరీతో మోసపోయామని భావిస్తున్నార్లు అని ఆ లేఖలో ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రధాన మంత్రి ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, దాని సభ్యులను పూర్తిగా ప్రభుత్వమే ఎంపిక చేసిందని కాంగ్రెస్ నేతలు తెలిపారు. "ట్రస్ట్ సభ్యులు రాష్ట్రీయ స్వ యంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్), విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి), వాటి అనుబంధ సంస్థలతో సంబంధం కలిగి ఉన్నారన్న విషయం బహిరంగ రహస్యం. అప్రతిష్టపాలైన దాని మాజీ ప్రధాన కార్యదర్శి కూడా మీకు సన్నిహితుడే. ఇంతటి నేరం జరిగినప్పుడు మీరు మౌనంగా ఉండటం ఆమోదయోగ్యం కాదు. జవాబుదారీతనాన్ని, నష్టపరిహారాన్ని (లేదా నిధుల పునరుద్ధరణను) నిర్ధారించడం మీ బాధ్యత్త అని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. నగదు, బంగారం, వెండితో సహా అన్ని కానుకల నిర్వహణతో సహా ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై 'స్వతంత్ర, సమగ్ర విచారణకు ఆదేశించాలని' మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రిని కోరారు. 'తమ కానుకలు ఎలా వినియోగించబడ్డాయో ప్రతి భక్తుడికి తెలిసేలా' విచారణ ఫలితాలు, ట్రస్ట్ ఖాతాలను బహిర్గతం చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు.



## నాలుగుదేశాల ఎంబసీల్లో కాన్సులర్ సేవలు నిలిపివేత

**న్యూఢిల్లీ, జులై 19:** అబుదాబి, కువైట్, సింగ పూర్, కాన్‌బెర్రాలోని భారత రాయబార కార్యా లయాల్లో పాస్‌పోర్ట్, వీసా, కాన్సులర్ సేవలు యథావిధిగా కొనసాగాలా లేదా అన్న అంశంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక నిర్ణయం ప్రకటిం చనున్నది. ఈ సేవలు నిర్వహిస్తున్న కాంట్రా క్టును ఢిల్లీ హైకోర్టు రద్దుచేయడంతో ఆయా దేశాల్లో సేవలు దాదాపు స్తంభించిన పరిస్థితి నెలకొన్నట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు కేం ద్రంతరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ తా వాదనలు వినిపించారు. హైకోర్టు తీర్పు కార ణంగా విదేశాల్లోని భారతీయులకు పాస్‌పోర్ట్, వీసా సేవలు అందించడం తీవ్రంగా దెబ్బతిన్న దని, కొత్త సేవల సంస్థను ఒక్కరోజులో నియ మించడం సాధ్యం కాదని కోర్టుకు వివరించారు. ఈ నేపథ్యంలో కేంద్రం దాఖలు చేసిన అప్పీ ల్‌పై విచారణను జులై 20కు సుప్రీంకోర్టు నిర్ణ యించింది. జులై 15న ఢిల్లీ హైకోర్టు కేరళకు చెందిన అల్విండ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ సం స్థకు అప్పగించిన సిపివి సేవల కాంట్రాక్టును రద్దు చేసింది.

# న్యూయార్కు వస్తే నెతన్యాహును అరెస్టుచేస్తాం: మేయర్ మమ్దానీ



**న్యూయార్కు,జులై 19:** ఐక్యరాజ్యసమితి సదస్సు కోసం న్యూయార్క్ రానున్న ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును అరెస్ట్ చేసే అంశంపై న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మామ్దానీ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర దుమారంరేపుతున్నాయి. శనివారం దిన్యూ యార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మేయర్ మాట్లాడుతూ నెత న్యాహును ఒక యుద్ధ నేర స్థుడిగా అభివర్ణించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఆయనపై మోపిన ఆరోపణల నేప థ్యంలో, ఆయన ది హేగ్‌లోని జైలుకు వెళ్లాల్సిన వ్యక్తి అని స్పష్టం చేశారు. అయితే, ఒక విదేశీ దేశాధినేతను అరెస్ట్ చేసే అధికారం నగర మేయ ర్‌కు ఉందా లేదా అనే అంశంపై తాము ప్రస్తుతం నగర న్యాయ సలహాదారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఐరాసలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కౌంటర్ ఇస్తూ ఈ కేసు లో ఎవరినైనా అరెస్ట్ చేయాల్సివస్తే, మొదట మేయర్ జోహ్రాన్ మామ్దానీనే అని మండిపడ్డారు. కాగా,ఒక రేడియో షోలో నెతన్యాహు మాట్లాడు తూ మేయర్ మామ్దానీ హమాస్ ఉగ్రవా దులకు మద్దతుఇస్తున్నారని, ఆయన మనసులో అమెరి కాపై తీవ్ర ద్వేషం దాగి ఉందని ఆరోపించారు.

# 'మేడ్ ఇన్ ఇండియా' సి-295 ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతం



**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

**న్యూఢిల్లీ, జులై 19:** దేశీయ రక్షణ, విమాన తయారీ రంగాల్లో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. తొలి స్వదేశీ ఎయిర్‌బస్ సి-295 వ్యూహాత్మక సైనిక రవాణా విమానాన్ని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పరిచయం చేశారు. గుజరాత్ రాష్ట్రం వడోదరలోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టిఎఎస్‌ఎల్) తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఓ వీడియోను సోషల్ మీడియా 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 'ప్రధాని మోడీ కలలు గన్న 'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాలకు ఈ ప్రాజెక్టు ప్రతీకగా నిలుస్తుంది. దేశంలో విమాన తయారీ సామర్థ్యం వేగంగా పెరుగుతోంది. త్వరలో భారతీ యులు పూర్తిగా స్వదేశీ విమానాల్లోనే ప్రయా ణిస్తారు. ఆరోజు కూడా ఎంతో దూరంలో లేదు' అని అన్నారు. కాగా ఎయిర్‌బస్-టాటా అడ్వా న్స్‌డ్ సిస్టమ్స్ ఉమ్మడి భాగస్వామ్యంతో అమల వుతున్న సి-295 ప్రాజెక్టు కింద తొలిసారిగా ప్రైవేట్ రంగంలో ఓ క్లిష్టమైన సైనిక విమానం భారత్‌తో తయారవుతోంది. దీనికి 2021లో 2.6 బిలియన్ డాలర్లతో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం భారత్‌కు మొత్తం 56 సి-295 విమానాలు అందించాలి. వీటిలో 16 విమానాలు స్పెయిన్‌లో మాన్యుఫాక్చర్ కానుం డగా, మరో 40 విమానాలు వడోదరలో తయారు చేస్తు న్నారు. అందులో భాగంగా తొలి సి-295 విమా నాన్ని జూన్ 10న విజయవంతంగా పరీ క్షిం చారు. ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా ఈ ప్రాజె క్టును గురించి ప్రస్తావించారు. సి-295 తయారీ వల్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్ర మలకు (ఎంఎస్‌ఎంఇలు) కొత్త అవకాశాలు లభిస్తాయని, సాంకేతిక పరిజ్ఞానం బదలీ, నైపుణ్యాభివృద్ధి, దేశీయ ఏరోస్పేస్ పరిశ్రమ విస్తరణకు ఇది కీల కంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# సంక్షిప్త వార్తలు

## హాంగేరీ అధ్యక్షుడి పదవీకాలం ముగింపు



**బుడాపెస్ట్,జులై 19:** హంగేరీ అధ్యక్షుడు టామాస్ సుల్యోక్ తన పదవీకా లాన్ని తక్షణమే ముగించే రాజ్యాంగ సవరణపై సంతకం చేశారు. దీంతో కొత్త ప్రధాని పీటర్ మగ్యార్ ప్రభుత్వం, మాజీ ప్రధాని విక్టర్ ఓర్బాన్ నియమించిన కీలక అధి.కారులను తొలగించే చర్యల్లో మరో కీలక ఘట్టం పూర్తిచేసుకున్నట్లయింది. ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో ఓర్బాన్ ప్రభుత్వాన్ని ఘోరపరాజయం పాలుచేసిన పీటర్ మగ్యార్, అధ్యక్షుడు సుల్యోక్ రాజీనామా చేయాలని పలు మార్లు డిమాండ్ చేశారు. ఓర్బాన్ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యవ్యతిరేక చర్యలను అడ్డుకోవ డంలో అధ్యక్షుడిగా తన రాజ్యాంగ బాధ్యతలను సుల్యోక్ నిర్వర్తించలేదని ఆయన ఆరోపించారు.

## ఇరాన్, అమెరికా దాడులు ఉధృతం



**టెహ్రాన్,జులై 19:** గల్ఫ్‌ప్రాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు జరుపుతున్న వరుసదాడుల్లో ఇప్పటివరకు కనీసం 50మంది మరణిం చగా, 500 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషయాన్ని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి హుస్సేన్ కెర్మాన్‌పూర్ అధికారికంగా వెల్లడిం చారు. గత 24 గంటల్లోనే 12మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, గాయపడిన వారిలో 37 మందిపరిస్థితి ఆందోళ నకరంగా ఉండటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు.

## అమెరికా పౌరులకు అంతర్జాతీయ హెచ్చరికలు జారీ




**వాషింగ్టన్,జులై 19:** అమెరికా-ఇరాన్ మధ్యకొనసాగుతున్న యుద్ధం మరిం త తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా ప్రయాణి స్తున్న లేదావిదేశాల్లో నివసిస్తున్న అమెరికా పౌరులకు అమెరికా విదేశాంగ శాఖ గ్లోబల్ ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. భద్రతా పరిస్థితులు వేగంగా మారుతున్నాయని, ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది.

## మధ్యప్రదేశ్‌లో యూనిఫామ్ సివిల్ కోడ్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం




**భోపాల్,జులై 19:** మధ్యప్రదేశ్‌లో ఉమ్మడిపౌరశిక్షాస్మృతి (యుసిసి) అమలుకు కీలక ముందడుగు పడింది. రాష్ట్ర కేబినెట్ ఆదివారం యూసీసీ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపినట్లు ముఖ్య మంత్రి మోహన్ యాదవ్ వెల్లడించారు. ఈ బిల్లును సోమవారం ప్రారంభమయ్యే ఐదు రోజుల రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించిన అనంతరం యూసీసీ ముసాయిదాను రూపొం దించామని, దీనికి మెజారిటీ ప్రజల మద్దతు లభించిందని ముఖ్యమంత్రి చెప్పారు.

## మేకెధాతుపై పార్లమెంటులో చర్చించాలి: డిఎంకె



**న్యూఢిల్లీ,జులై 19:** కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన మేకెధాతు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ద్రవిడ మున్నేట్ర కజగం తన పోరాటాన్ని తీవ్రతరం చేసింది. ఈ అంశంపై పార్లమెంటులో తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ, రాజ్యసభల్లో వాయిదా తీర్మాన నోటీసులు అందజేసింది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని చర్చకు చేపట్టాలని కోరింది. డీఎంకే పార్లమెంటరీపార్టీ నేత టీ.ఆర్. బాలు లోక్ సభలో, పార్టీ ఫ్లోర్ లీడర్ తిరుచ్చి శివ రాజ్యసభలో ఈ నోటీసులను సమర్పించారు.

## మీరట్‌లో ప్రియుడి ఘాతుకం: సెలైన్‌లో విషం ఎక్కించి నర్సు హత్య



**మీరట్,జులై 19:** ఉత్తర్ ప్రదేశ్ మీరట్‌లోని లోహియా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ప్రైవేట్ ఆస్పత్రి నర్సు అనుమానాస్పదంగా మరణించింది. పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా ఇది హత్య అని తేలింది. ప్రియుడే హత్య చేసినట్లు వెల్లడైంది. తనను పెళ్లి చేసుకోవాలని ప్రియురాలు ఒత్తిడి తెస్తుండటంతో పథకం ప్రకారం ప్రియుడు హత్యకు పాల్పడినట్లు తేలింది. ఆస్పత్రి ఉద్యోగితో కలిసి ఆపరేషన్ థియేటర్‌లో విషాన్ని ఇంజెక్ట్ చేయడం ద్వారా హత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ఒక నకిలీ సూసైడ్ నోట్ రాసి మృ తదేహం వద్ద ఉంచారు. ఈ కేసులో ప్రియుడితో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు.

# పార్లమెంటు ర్యాలీని విజయవంతం చేయండి

**సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పిలుపు**




**న్యూఢిల్లీ, జులై 19:** జంతర్‌మంతర్ నుంచి పార్ల మెంట్ వరకూ రేపు తలపెట్టిన ర్యాలీని విజ యవంతం చేయాలని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఒక సందేశాన్ని విడుదల చేశారు. ఆమరణ దీక్ష చేస్తున్న ఆయనను శనివారం ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆసుపత్రి నుంచి ఆయన తన స్వదస్తూరితో రాసిన చీటీని రిలీజ్ చేశారు. నీట్ పేపర్ లీక్ ఉదంతాలకు వ్యతిరేకంగా వాంగ్‌చుక్ ఉద్యమిస్తున్న విషయం తెలిసిందే. తన నిరసన కార్యక్రమాన్ని ఆయన రెండో స్వాతంత్ర్య పోరాటంగా అభివర్ణించారు. పేపర్ లీక్ వంటి అన్యాయాల నుంచి విముక్తి కావాలని తన సం దేశంలో రాశారు. తన భార్య గీతాంజలి ద్వారా ఈ సందేశాన్ని పంపించినట్లు కూడా ఆయన పేర్కొన్నారు. పేపర్ లీక్ ఉదంతంపై గత నెల 28న క్రాంతి జనతా పార్టీ చేపట్టిన నిరసనలో కూడా వాంగ్‌చుక్ పాల్గొన్నారు. తర్వాత, ఆమరణ దీక్ష ప్రారంభించారు. ఆయన దీక్ష ప్రారంభించి ఇప్పటికే 21 రోజులు పూర్తయింది. ఈ క్రమంలో వాంగ్‌చుక్ ఆరోగ్యం దృష్ట్యా పోలీసులు ఆయనను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే, తన భర్త వాంగ్‌చుక్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ గీతాంజలి తాజాగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిం చారు. తన భర్తకు అందిస్తున్న చికిత్సలో పారద ర్శకత లేదని ఆరోపించారు. తన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**వాంగ్‌చుక్ ఆరోగ్య స్థితిపై హెల్త్ బులెటిన్ విడుదల**

కాగా, పర్యావరణ ఉద్యమకారుడు సోమన్ వాంగ్ చుక్ ఆరోగ్యం నిలకడగా ఉందని న్యూఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్‌ను ఆదివారం వైద్యులు విడుదల చేశారు. గత 20 రోజులుగా ఆయన ఎలాంటి ఆహారం తీసుకోలేదని వారు తెలిపారు.

సుదీర్ఘ ఉపవాసం కారణంగా ఆయన తీవ్ర నీరసంతో ఉన్నారని, ఆసుపత్రిలో చేర్చే సమయంలో ఆయన పూర్తి స్పృహలోనే ఉన్నారని వివరించారు. అలాగే ఆయన శరీరంలోని ఆక్సిజన్ స్థాయిలు బాగానే ఉన్నాయని పేర్కొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్‌కు ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వాల్సి ఉందని వైద్యులు స్పష్టం చేశారు. వాటిని తీసుకునేందుకు ఆయన నిరాకరి స్తున్నారని అన్నారు. కాగా తన భర్తను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో ఢిల్లీ హైకో ర్టులో దాఖలు చేసిన పిటిషన్ సోమవారం విచా రణకు వచ్చే అవకాశం ఉంది.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ

## మంత్రి సీతక్క ఆదేశాలతో ఉపాధి కల్పన, జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం

### నేడు అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 19:** ఎల్‌నినో ప్రభావంతో సంభవించే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ వి.బి.జి. రామ్‌జీ కింద ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, కరువు నివారణ చర్యలను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. మంత్రి సీతక్క ఆదేశాలతో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సోమవారం అన్ని జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. దీనికి సంబంధించి ఆదివారం పంచాయతీ రాజ్ శాఖ స్పెషల్ సిఎస్ దానకిషోర్, శాఖ ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.
పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి మొత్తం 12 కోట్ల పనిదినాలు కల్పించడాన్ని లక్ష్యంగా నిర్ణయించగా, జూలై నుంచి అక్టోబర్ వరకు తొలి దశలో 4.5 కోట్ల పనిదినాలు సృష్టించేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 2.5 లక్షల మంది కూలీలకు ఉపాధి లభిస్తుండగా, మరో 2.5 లక్షల పనిదినాలను అదనంగా కల్పించి రోజుకు 5 లక్షల మందికి ఉపాధి అందించేందుకు జిల్లా యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు వచ్చే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో నీటి సంరక్షణ పనులు చేపట్టనున్నారు. ఇందులో 9.60 లక్షల ఇంకుడు గుంతలు, 25 వేల పంట కుంటలు, 5 వేల ఊట కుంటలు, 5 వేల బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు చేపట్టనున్నారు. అలాగే వనమహోత్సవం, గ్రామ పంచాయతీ భవనాలు, వీఓ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయనున్నారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద ప్రతి గ్రామంలో గృహాల వద్ద సోక్‌పిట్లు, రైతుల కోసం పంట కుంటలు, వర్షపు నీటిని నిల్వ చేసే పర్కొలేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కార్యక్రమం సమర్థవంతమైన అమలుకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ పంచాయతీ స్థాయి వరకు అధికారులకు, సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణలు నిర్వహించారు. అవసరమైతే మరిన్ని శిక్షణలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో పనులు ప్రారంభమయ్యేలా జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి సీతక్క ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కరువు ప్రభావాన్ని తగ్గిస్తూ, ప్రజలకు ఉపాధి భద్రతతో పాటు నీటి భద్రతను కల్పించడమే ఈ ప్రత్యేక కార్యాచరణ ప్రధాన లక్ష్యమని శాఖ వెల్లడించింది.

# రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా బిజెపి సమరశంఖం

## కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ప్రజాద్రోహ పాలనపై పోరాటాలకు సిద్ధం కావాలి

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** రాష్ట్ర కార్యవర్గ సమావేశాల అనంతరం పార్టీ సంస్థాగత బలోపేతానికి, రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి జిల్లా, డివిజన్ స్థాయి కార్యవర్గ సమావేశాలు ఎంతో కీలకమని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పరిధిలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో ఏ రాజకీయ పార్టీ కూడా సంస్థాగతంగా బిజెపి పోటీ పడలేదని రాంచందర్ రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 35,000 పోలింగ్ బూత్‌లలో, దాదాపు 31,000 బూత్‌లలో పూర్తి స్థాయి బూత్ కమిటీలను కలిగి ఉన్నామన్నారు. పార్టీకి 42 లక్షల పైగా సభ్యత్వం ఉందని, 920 మండలాలకు గాను 870 మండలాల్లో బలమైన యూనిట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. గతంలో పార్టీకి కొంత వెనుకబాటు ఉన్న కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం వంటి ప్రాంతాలతో పాటు, పాతబస్తీ (ఓల్డ్ సిటీ) ఏరియాల్లో కూడా మైనారిటీలు పెద్ద సంఖ్యలో బిజెపిలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఈ బలమైన సంస్థాగత స్వరూపాన్ని రాబోయే రోజుల్లో రాజకీయ విజయాలుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలు సమస్యలను పూర్తిగా పక్కనబెట్టాయని విమర్శించారు.

# ముగిసిన ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ వెబ్‌ఆప్షన్లు

## 22న సీట్ల కేటాయింపు

### రెండో విడతలో 31,834 సీట్లు

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2026 ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. రెండో విడత కౌన్సెలింగ్‌కి సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువు ఆదివారంతో ముగిసింది. ఈ నెల 22న రెండో విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. మొదటి విడతలో భాగంగా రాష్ట్రంలో 175 కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 81,620 సీట్లు అందుబాటులో ఉన్నట్టు అధికారులు ప్రకటించారు. అనంతరం శనివారం రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా అదనంగా 4,347 సీట్లకు అనుమతిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. మొదటి విడత సీట్ల కేటాయింపు ఈ నెల 10న చేపట్టగా అందులో 19,325 మంది విద్యార్థులు కాలేజీల్లో రిపోర్ట్ చేయలేదు. దాంతోపాటు మొదటి విడతలో మిగిలిపోయిన 8,162 సీట్లతో కలిపి మొత్తం 27,487 సీట్లు రెండో విడతలో కౌన్సెలింగ్‌కి అందుబాటులో ఉన్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ ఈ నెల 16న ప్రకటించారు. కొత్తగా 17 బ్రాంచ్‌ల్లో అదనంగా 4,347 సీట్లకు అనుమతించగా.. వాటితో కలిపితే దీంతో రెండో విడతలో 31,834 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రెండో విడతలో స్లాట్ బుకింగ్ శుక్రవారం అవకాశమిచ్చారు. శనివారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించగా 2,622 మంది వెరిఫికేషన్‌కు హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఆదివారంతో వెబ్‌ఆప్షన్ల గడువు ముగియగా శనివారం సాయంత్రం వరకు 27,197 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. ఈ నెల 22న రెండో విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు.

# ప్రజల ఆకాంక్షలను విస్మరించిన కాంగ్రెస్, బిఆర్‌ఎస్

## ఒకరికి అధికార దాహం, మరొకరికి అవినీతి మోహం

### బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్టం ఏ నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఆకాంక్షలతో ఏర్పడిందో, వాటిని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ పభుత్వం రెండూ పూర్తిగా విస్మరించాయని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు రాజకీయ 'బిల్లా రంగా' నాటకాలు ఆడు తున్నాయని ఒకరికి అధికార దాహం, మరొకరికి అవినీతి మోహమని విమర్శించారు. వేల కోట్ల కాళేశ్వరం అవినీతిపై అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంటామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం బిఆర్‌ఎస్‌తో కుమ్మక్కైందని ఆరోపించారు. ఒక పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని, మరో పార్టీ అవినీతి సొమ్మును కాపాడుకోవాలని తహతహలాడుతుండగా, రైతులకు మాత్రం సాగునీరు అందకుండా పోతుందన్నారు. లక్షల కోట్ల అప్పుల భారంతో తెలంగాణ ప్రజల జీవితాలను అంధకారం లోకి నెట్టారని ధ్వజమెత్తారు. బిఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంపై రూ.8.2 లక్షల కోట్ల అప్పుల భారం మోపగా, కాంగ్రెస్ సుమారు 30 నెలల్లోనే రూ.4 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. ఇంత అప్పు చేసినా ఉద్యోగులకు పిఆర్‌సి, పిఎఫ్ బకాయిలు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి సింగరేణికి సుమారు రూ.59,000 కోట్ల బకాయిలు పెట్టాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.12,000 కోట్ల బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు, కళాశాలలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. నాడు కాంగ్రెస్ నిర్వహించిన యూత్ డిక్లరేషన్, నేడు బిఆర్‌ఎస్ నిర్వహిస్తున్న యువ సంగ్రామం రెండూ నిరుద్యోగుల ఓట్లకోసం ఆడుతున్న రాజకీయ నాటకాలేనని అన్నారు.
ఎన్నికల సమయంలో సరూర్‌నగర్ ఢిల్లీ నుంచి ప్రియాంకా గాంధీని తీసుకొచ్చి హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్ యువతను మోసం చేసిందని, పదేళ్ల నిరుద్యోగులను మోసం చేసిన బిఆర్‌ఎస్ ఇప్పుడు అదే సరూర్‌నగర్‌లో సభ పెట్టి కాంగ్రెస్‌ను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. నిరుద్యోగుల గురించి మాట్లాడేనైతిక హక్కు బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు లేదన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగాలు భర్తీచేయకుండా, పరీక్షలను సక్రమంగా నిర్వహించకుండా, ఒక్కో పరీక్షను మూడుసార్లు నిర్వహించి అభ్యర్థులను కోర్టుల చుట్టూ తిప్పారని విమర్శించారు. ప్రతిభను కాపాడాల్సిన బిఆర్‌ఎస్ పాలనలో పేపర్ లీకులకు కేరాఫ్ అడస్‌గ్రా మార్చారని మండిపడ్డారు. ఒక పరీక్షకు మూడుసార్లు పరీక్ష నిర్వహించి, నిరుద్యోగుల జీవితాలనే అగ్నిపరీక్షగా మార్చారని ఆరోపించారు. జిఓ 46ను తీసుకొచ్చి ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమైన గ్రామీణ ప్రాంత యువతకు తీవ్రఅన్యాయం చేసిందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్న ఒకే పరీక్ష నిర్వహించి ప్రాంతాల వారీగా వేర్వేరు కటాఫ్‌లు పెట్టి అర్హులైన అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీశారని పేర్కొన్నారు.
తాము తెచ్చిన జిఓ 46పైనే కోర్టుకు వెళ్లిన బిఆర్‌ఎస్ నాయకులు, ఇప్పుడు అదే జిఓపై మాట్లాడటం ఓట్ల రాజకీయమేనని విమర్శించారు.

# దక్షిణాదికి అన్యాయం జరిగేలా డీలిమిటేషన్ ఉండొద్దు

## పార్లమెంట్ సమావేశాల్లో ప్రజాసమస్యలపై సమగ్ర చర్చ జరపాలి: ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై19:** పార్లమెంట్ సమావేశాల్లో దేశానికి, ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై సమగ్ర చర్చ నిర్వహించాలని భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. దక్షిణాదికి అన్యాయం జరిగేలా డీలిమిటేషన్ ఉండొద్దని. డీలిమిటేషన్ బిల్లుపై పార్లమెంట్‌లో విస్తృతంగా చర్చ జరగాలని స్పష్టం చేశారు. ఆదివారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగే విధంగా డీలిమిటేషన్ బిల్లును ముందుకు తీసుకురావద్దని, దీనిపై ముందుగా పార్లమెంట్‌లో విస్తృతంగా చర్చ జరగాలని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.
పార్లమెంట్‌లో పలు అంశాలపై చర్చకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేసిన ఆయన, అయోధ్యలో ప్రజల నుంచి వచ్చిన విరాళాల వినియోగంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని కోరారు. అలాగే లడఖ్‌కు సంబంధించిన డిమాండ్లపై ఉద్యమిస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆస్పత్రికి తరలించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు, 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' ప్రతిపాదన, పెట్రోల్‌లో ఇథనాల్ వినియోగం వంటి అంశాలపై కూడా పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించాలని కోరారు. ఈ అంశాలపై చర్చకు అవకాశం కల్పించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగ విలువలను దెబ్బతీసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించిన ఆయన, విదేశీ పర్యటనల కంటే దేశ ప్రజల సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు.
తెలంగాణకు సంబంధించిన పెండింగ్ హామీలను వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రాంతీయ అవసరాల దృష్ట్యా రీజినల్ రింగ్ రోడ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం ఇవ్వాలని అన్నారు. విభజన హామీలో భాగమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు తక్షణ ఆమోదం ఇవ్వాలని, ఈ విషయంలో కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ కృషి చేయాలని సూచించారు. అలాగే మూసీ నది సుందరీకరణ, అర్బన్ ఛాలెంజ్ ఫండ్, తెలంగాణకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటు వంటి అంశాలు కూడా విభజన హామీల్లో భాగమేనని, వాటిని అమలు చేయాలని కోరారు. తెలంగాణ ప్రజల అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఈ డిమాండ్లు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# ఎన్‌ఎండిసి డైరెక్టర్‌గా వివేక్ నిశాంత్‌నాథ్



**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** భారతదేశపు అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పాదక సంస్థ అయిన ఎన్ఎమ్‌డిసి లిమిటెడ్‌కు వివేక్ నిశాంత్‌నాథ్ డైరెక్టర్ (కమర్షియల్)గా నియమితులయ్యారు. మూడు దశాబ్దాలకుపైగా అనుభవం ఉన్న మైనింగ్, మెటల్స్ రంగ నిపుణుడైన నిశాంత్, సేల్స్, మార్కెటింగ్, అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాలు, ప్రొక్యూర్‌మెంట్, లాజిస్టిక్స్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌లో నైపుణ్యాన్ని కలిగి ఉన్నారు. ఆయన 1992లో ఎన్‌ఎం డిసిలో తన కెరీర్‌ను ప్రారంభించి, దాదాపు 15 సంవత్సరాలపాటు ఆ కంపెనీలో వివిధ వాణిజ్య హోదాలలో పనిచేశారు. ఈ క్రమంలో దేశీయ ఐరన్ ఓర్ అమ్మకాలు, మార్కెటింగ్‌లో విస్తృతమైన అనుభవాన్ని పొందారు. ఆయన తరువాత ఎస్సార్ స్టీల్ లిమిటెడ్, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియాలో కీలక పదవులను నిర్వహించి, 2021లో ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ (ఓఎంసి)లో జనరల్ మేనేజర్ (సేల్స్ మార్కెటింగ్)గా చేరారు.

# ఉపాధ్యాయులకు శాశ్వత బదలీల యాక్ట్ రూపొందించాలి

## ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శాశ్వత బదలీల యాక్ట్ రూపొందించాలని ఎస్‌టియు టియస్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. ఆదివారం కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో నిర్వహించిన 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జి సదానందం గౌడ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరహాలో తెలంగాణలో కూడా ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన బదలీల యాక్ట్ రూపొందించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే కొత్త పీఆర్సీని ప్రకటించి ఆరు నెలలలోపు సిఫారసులను అమలు చేస్తామని ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టో హామీని నిలబెట్టుకోవాలన్నారు. గత ప్రభుత్వం 5 శాతం మధ్యంతర భృతి ఇస్తూ 2023 అక్టోబర్ 2వ తేదీన పీఆర్సీ కమిటీ వేసినట్లు గుర్తు చేశారు. ఉద్యోగులకు నూతన హెల్త్ స్కీమ్ అమలు చేయడంలో ప్రభుత్వం సఫలీకృతమైందని, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని సమావేశంలో తీర్మానించినట్టు తెలిపారు. విద్యాశాఖలో ఇంటర్ లోకల్ డిప్యూటేషన్లకు సంబంధించిన జీవో 190 అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ పరీక్షలను ఆఫ్‌లైన్ మోడ్ లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఏలను, వివిధ రకాల బిల్లులను సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బదలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలన్నారు. సెప్టెంబర్ మాసంలో సంఘం 80 వసంతాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర స్థాయిలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

# అంగన్‌వాడీ హాజరులో ఆదిలాబాద్ టాప్

## 93.47 శాతంతో రాష్ట్రంలో అగ్రస్థానం

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో బాలల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. అయితే కొన్ని జిల్లాల్లో మాత్రం పిల్లల హాజరు సంఖ్య ఒకింత తక్కువగా నమోదవుతోంది. వివిధ జిల్లాల్లో చిన్నారుల హాజరు శాతం గణనీయంగా మారుతోంది. 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లల హాజరు పై తాజా గణాంకాలు చూస్తే కొన్ని జిల్లాలు 90 శాతానికి పైగా హాజరుతో అద్భుత ప్రదర్శన కనబరుస్తుండగా, మరికొన్ని జిల్లాలు కనీసం 65 శాతం మార్కును కూడా దాటలేకపోతున్నాయి. అంగన్వాడీల్లోని బాలల హాజరు చూస్తే రాష్ట్రంలో అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా 93.47 శాతం హాజరుతో మొదటి స్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో మొత్తం 19,360 మంది లబ్ధిదారులైన పిల్లల్లో 18,095 మంది అంగన్వాడీ కేంద్రాలకు హాజరవుతున్నారు. అలాగే 90.14 శాతంతో రెండో స్థానంలో ఆసిఫాబాద్, 84.22 శాతంతో మూడో స్థానంలో ఖమ్మం తదుపరి 82.69 శాతంతో నాల్గో స్థానంలో ములుగు జిల్లాలు ఉన్నాయి. ఇక రాష్ట్రంలోని కరీంనగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలు హాజరు శాతంలో అంతంత మాత్రంగానే ఉంది. రాష్ట్రంలోనే అత్యల్పంగా కరీంనగర్ జిల్లాలో కేవలం 52.69 శాతం హాజరుతో చివరి స్థానంలో ఉంది. ఈ జిల్లాలో 16,971 మంది రిజిస్టర్డ్ పిల్లలు ఉండగా, కేవలం 8,942 మంది మాత్రమే అంగన్వాడీలకు హాజరవుతున్నారు. అలాగే నల్గొండ జిల్లా 56.47 శాతంతో, రంగారెడ్డి జిల్లా 60.97 శాతం మేర 31,773 మంది హాజరుతోను, పెద్దపల్లి, సిద్దిపేట, హనుమకొండ, సూర్యాపేట జిల్లాలు కూడా 65శాతం కంటే తక్కువ హాజరును నమోదు చేశాయి.

# గిరిజన హాస్టల్‌లో కలుషిత ఆహారం

## ప్రిన్సిపాల్, వార్డెన్‌సహా 8 మంది సస్పెన్షన్

### కనీస సౌకర్యాలపై మరో ప్రిన్సిపాల్‌పైనా వేటు

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకులంలో జరిగిన ఫుడ్ పాయిజనింగ్‌కు సంబంధించి ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్‌తో సహా 8 మందిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. గత వారం రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూరులోని ఆదిమ గిరిజన సమూహ నివాస పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజనింగ్ ఘటనను తీవ్రంగా పరిగణించిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అందుకు నిర్లక్ష్యం వహించినారనే ఆరోపణలతో ప్రిన్సిపాల్, వార్డెన్, ఏఎన్ఎం, నర్సుతో పాటు, మరో నలుగురు వంట సిబ్బందిని సస్పెండ్ చేశారు. గురుకులంలో అల్పాహారంగా కిచిడీ తిన్న తర్వాత సుమారు 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో కలుషితమైన తాగునీటిని సరఫరా చేస్తున్నారని కూడా విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వారిని వెంటనే ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. విద్యార్థులందరూ కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని అధికారులు తెలిపారు. అయితే, పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజనింగ్ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు విచారణ చేసిన తదుపరి వారిని విధులనుండి సస్పెండ్ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు కూడా ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. కాగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. మరుగుదొడ్లు, నీటి సమస్య పరిష్కారంలో విఫలం కావడం, విద్యార్థుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణల మేరకు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ గురుకులాల కార్యదర్శి సస్పెండ్ చేశారు.




# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

## 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సిని ప్రకటించాలి

### ఆగస్టు 1న తపస్ ధర్నా, పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు1న మహా ధర్నా నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వొద్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్కా కొమురయ్య ఆదివారం ఆవిష్కరించారు. పెండింగ్ పీఆర్‌సి నివేదికను వెంటనే విడుదల చేసి 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్స్‌తో సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, అందరికీ పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేసి, సుప్రీంకోర్టులో ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్‌పిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో 317 బాధితుల కోసం ఇచ్చిన 190 జీవో ప్రకారం అప్లికేషన్లు అందరికి డిప్యుటేషన్‌లు ఇవ్వాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 వర్తింపు చేస్తూ వారిని విద్యాశాఖలో విలీనం చేయాలని, కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లిస్తూ, ఎంటీఎస్ అమలు చేయాలన్నారు. ఈహెచ్‌ఎస్ పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని అన్ని గుర్తింపు పొందిన సంఘాలకు ట్రస్ట్ బోర్డులో ప్రాతినిధ్యం కల్పించి, పూర్తి మార్గదర్శకాలు విడుదల చేసిన తర్వాతే ఉద్యోగుల వేతనాల నుంచి వాటా కోత విధించాలన్నారు. జి.ఓ.నెం.25ను సవరించి ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల వార్షిక పదోన్నతులు, బదలీల క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు 12 నెలల వేతనం చెల్లించాలని, డీఎస్సీ 2008 ప్రత్యేక ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాన్ని చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

# మొక్కుబడిగా 'బేటీ బచావో-బేటీ పడావో'

## 10 జిల్లాల్లో ఖర్చుకాని నిధులు

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** బాలికలు, చిన్న పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రాష్ట్రంలో మొక్కుబడిగా అమలవుతున్నాయి. మహిళలు, బాలల సంక్షేమం కోసం కేంద్రం కేటాయిస్తున్న నిధులను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పూర్తి పూర్తి స్థాయిలో ఖర్చు చేయడం లేదనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని జిల్లాలు కేటాయించిన నిధులను వందశాతం సద్వినియోగం చేసుకొని ఆదర్శంగా నిలుస్తుంటే, మరికొన్ని జిల్లాలు కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా మురుగిపోవడానికి కారణమవుతున్నాయి. ఇందులో భాగంగా కేంద్రం అమలు చేస్తున్న బేటీ బచావో బేటీ పడావో పథకానికి సంబంధించి రాష్ట్రంలో ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా అమలవుతోంది. ఈ పథకంలో బాలికల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.
అలాగే, ఈ పథకం స్ఫూర్తితోనే భారత ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజనఖే అనే పొదుపు పథకాన్ని కూడా ప్రవేశపెట్టింది. దీని ద్వారా తల్లిదండ్రులు తమ ఆడపిల్లల భవిష్యత్తు మరియు చదువుల కోసం ప్రత్యేకంగా బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఖాతా తెరిచి డబ్బులు డిపాజిట్ చేసుకోవచ్చు. బాలికల రక్షణ, విద్య ధ్యేయంగా ప్రవేశపెట్టిన ఈ పథకం కింద ఎంపిక చేసిన ఒక్కో జిల్లాలకు సమానంగా రూ.4,69,696 చొప్పున నిధులు విడుదలయ్యాయి. నిధులు చేతికి అందినా రాష్ట్రంలోని 10 జిల్లాలు కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేకపోయాయి. ప్రధానంగా రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్, జనగామ, కామారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, వరంగల్, భువనగిరి, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, జగిత్యాల జిల్లాలు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా తీవ్రనిర్లక్ష్యం వహించాయి. అయితే మహబూబ్‌నగర్, గద్వాల్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాలు తమకు కేటాయించిన రూ.4,69,696 నిధులను 100శాతం ఖర్చు చేశాయి.

# నాణ్యమైన బొగ్గు కోసం ప్రత్యేక పర్యవేక్షణ

## సీమ్‌ల వారీగా బొగ్గు తవ్వకాలు

## ఏరియాల వారీగా ప్రత్యేక అధికారులు

### సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్




**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరిపడా, నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించినట్లు సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచడంతో పాటు, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా నాణ్యమైన బొగ్గును నిరంతరాయంగా సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఈ మేరకు నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసే నిమిత్తం ఏరియాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు వివరించారు. రానున్న మూడు నెలలపాటు ఈ ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, గ్రేడ్ పరిరక్షణ, డిస్పాచ్, ఉత్పాదకత, పనితీరు మెరుగుదల, ఏరియాలు- కార్పొరేట్ విభాగాల మధ్య సమర్థవంతమైన సమన్వయంతో పాటు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల అమలును పర్యవేక్షించనున్నారని తెలిపారు. సింగరేణి బొగ్గు నాణ్యతే సంస్థకు గుర్తింపని స్పష్టం చేశారు. దానిపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని తేల్చి చెప్పారు. ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా వినియోగదారులకు బొగ్గు సరఫరా జరిగేలా అన్ని ఏరియాల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొన్ని ఏరియాల్లో అన్‌గ్రేడెడ్ బొగ్గు, షేల్ కలవడం వల్ల నాణ్యత పడిపోతుందని గుర్తించడంతో అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్షిక కోల్ గ్రేడేషన్ ప్రణాళిక ప్రకారం సీమ్‌ల వారీగా బొగ్గు తవ్వకాలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగానే ఉత్పత్తి జరగాలని వెల్లడించారు. ఆఫ్‌లోడింగ్ ప్రాంతాల్లో బ్లాస్టింగ్‌కు ముందు బొగ్గు బెంచీలను పూర్తిగా శుభ్రం చేయాలని, బొగ్గు బెంచీలు, ఓవర్‌బర్డెన్ బెంచీల మధ్య తగినంత దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాయి, షేల్ పొరలను బొగ్గుతో కలపకుండా ప్రత్యేకంగా తవ్వి ఓవర్ బర్డెన్‌లోనే డంప్ చేయాలన్నారు. బొగ్గు గ్యాలరీల శుభ్రత, ఫైరీ కోల్ నిర్వహణకు రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌ను అన్ని ఏరియాల్లో కచ్చితంగా అమలుచేయాలని తెలియచేశారు. అన్ని ఓపెన్‌కాస్ట్ గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లలో తగిన సంఖ్యలో క్రషర్లు ఏర్పాటు చేసి, అవి ఎప్పటికప్పుడు సక్రమంగా పనిచేసేలా నిర్వహించాలని చెప్పారు. ప్రతి కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో రోజువారీ, గ్రేడ్‌వారీ బొగ్గు డిస్పాచ్ ప్రణాళికను ముందుగానే రూపొందించి, దానిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఉత్పత్తి నుంచి డిస్పాచ్ వరకు ప్రతి దశలో నాణ్యత నియంత్రణకు అధికారులు వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సింగరేణి బొగ్గు నాణ్యతపై వినియోగదారులకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం ప్రతి అధికారి బాధ్యత అని, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా నాణ్యమైన బొగ్గు సరఫరా చేయడం ద్వారా సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచాలన్నారు.



## ఐదు నెలలుగా జీతాల్లేవు

### ఆసుపత్రి ప్రాంగణంలో మహిళా హోంగార్డు ఆక్రందన

**జంషెడ్‌పూర్, జులై 19:** జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో 5 నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళా హోంగార్డు ఆసుపత్రి ప్రాంగణంలో కన్నీటి పర్యంతమవుతూ"దయచేసి నా జీతం ఇవ్వండి లేకపోతే నేను చనిపోతా అంటూ వేడుకోవడం అందరినీ కలచివేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జంషెడ్‌పూర్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో భద్రతా విధులు నిర్వహిస్తున్న 135 మంది హోంగార్డులు గత 5 నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, నిత్యావసరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూలై 8న మరో విషాదకర ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న మహిళా హోంగార్డు అలాదిన్ మహాలి క్యాంపస్‌లో ఉన్న ఫినైల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సహచరులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. చికిత్స సమయంలో మాట్లాడిన ఆమె, 5 నెలలుగా జీతం రాకపోవడంతో కుటుంబం ఆకలితో అలమటిస్తోందని తెలిపింది. తన తల్లి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ చికిత్స చేయించేందుకు డబ్బు లేదని, కుమారుడి స్కూల్ ఫీజు కూడా చెల్లించలేక తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ ఘటన మరువకముందే 18వ తేదీ మరో మహిళా హోంగార్డు ఫుల్‌కుమారి హెంబ్రామ్ ఆసుపత్రి ప్రాంగణంలో కన్నీళ్లు పెట్టుకుంది. ఐదు నెలలుగా వేతనం అందలేదు. కుటుంబాన్ని పోషించడం చాలా కష్టంగా మారింది. నాకు కడుపు సంబంధిత తీవ్రమైన ఆరోగ్య సమస్య ఉంది. కానీ డాక్టర్ కు చూపించడానికి, మందులు కొనడానికి కూడా నా వద్ద డబ్బు లేదు. దయచేసి నా జీతం ఇప్పించండి లేదంటే నేను చనిపోతానంటూ ఆవేదన వ్యక్తం చేసింది.

# వర్సిటీలు ఎందుకు పెట్టారు? వాటి లక్ష్యాలేమిటి?

**బోధనా సిబ్బంది విద్యార్హతలు.. ఎంట్రన్స్‌కు ఉన్న నిబంధనలేమిటి?**

**ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రశ్నలు**

**సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో వర్సిటీల్లో తనిఖీలు**

**సుప్రీంకోర్టులో అఫిడవిట్ సమర్పించనున్న రాష్ట్ర ప్రభుత్వం**

**ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై19:**దేశంలో పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న ప్రైవేట్ యూనివర్సిటీల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలు.. వాటిని ఏర్పాటు చేస్తున్న సంస్థలు/ వ్యక్తుల అసలు లక్ష్యాలు ఏమిటి..? ఆ యూనివర్సిటీల్లో బోధిస్తున్న వారికి ఉన్న విద్యార్హతలు ఏమిటి అనే దానిపై సర్వోన్నత న్యాయస్థానం దృష్టి సారించింది. అయేషా జైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణలో తన దృష్టికి వచ్చిన అనేక ఫిర్యాదులను పరిశీలించిన సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ప్రైవేట్ యూనివర్సిటీల్లో తనిఖీలకు ఆదేశించింది. ప్రైవేట్ యూనివర్సిటీలు ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంతో అసలు వాటి ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలు మొదలు వాటిలో అందుతున్న విద్యా ప్రమాణాల స్థాయి వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పూర్తి వివరాలతో అఫిడవిట్లు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీల్లో తనిఖీల కోసం కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీలో కన్వీనర్‌గా తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి, సభ్య కన్వీనర్‌గా జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, సభ్యులుగా పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ విద్యా కమిషనర్ అసిస్టెంట్ డైరెక్టర్ (అకడమిక్‌సి)లను నియమించింది.

అవసరమైతే ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను నియమించుకునే అవకాశం కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ కమిటీ రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ యూనివర్సిటీని సందర్శించి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశించిన 9 అంశాలపై ఈ కమిటీ తనిఖీలు చేపడుతోంది. ప్రైవేట్ యూనివర్సి టీలకు సంబంధించి 9 అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు వివరణ కోరిన అంశాలు:- 1. అసలు యూనివర్సిటీ ఎందుకు ఏర్పాటు చేశారు. దాని ఏర్పాటుకు కారణాలు, ఉద్దేశాలు ఏమిటి? యూనివర్సిటీ ఏర్పాటుకు ముందు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేశారా? స్థాపనకు ముందు ఏమైనా విధానపరమైన పరిశీలన (పాలసీ కన్సిడరేషన్) చేశారా? 2. యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా భూ కేటాయింపు చేసిందా? యూనివర్సిటీకి కల్పించిన ఇతర ప్రయోజనాలు.. అందుకు విధించిన నిబంధనలు, షరతులు ఏమిటి?3. యూనివర్సిటీని వాస్తవంగా నిర్వహిస్తున్న సొసైటీ, సంస్థ, వ్యక్తి ధ్యేయం ఏమిటి?. యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలో ఉన్న సభ్యులు ఎవరు? ఆ సభ్యులను ఎలా ఎంపిక చేశారు. యూనివర్సిటీని వాస్తవంగా నిర్వహిస్తున్న వ్యక్తి, మేనేజ్‌మెంట్ కమిటీలో సభ్యుల సమగ్ర వివరాలు. 4.విద్యార్థులు యూనివర్సిటీలో చేరడానికి ఏ విధానం అవలంభిస్తున్నారు. ఎంట్రన్స్‌కు సంబంధించిన ప్రమాణాలు, నిబంధనలు, ఆ నిబంధనలు చట్టానికి అనుగుణంగా ఉన్నాయా? ఎంట్రన్స్‌కు సంబంధించిన విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించిందా? ధ్రువీకరించిందా? 5. బోధనా సిబ్బందిని అకడమిక్ స్టాఫ్) యూనివర్సిటీ ఎలా నియమించింది. వారి ఎంపికను ఏ కమిటీ చేపట్టింది. సిబ్బంది నియామకం యూజీసీ నిబంధనలకు లోబడే చేపట్టారా? ఆ నియామక ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించిందా?

6. రాష్ట్రంలో ఇతర విద్యా సంస్థలు, యూనివర్సిటీలకు విధించిన నిబంధనలు, షరతులను ఈ యూనివర్సిటీలు కచ్చితంగా పాటిస్తున్నాయని నిర్ధరించడానికి ప్రభుత్వం తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసిందా? చేస్తే ఆ బృందం తనిఖీలు (ఇన్‌స్పెక్షన్లు) నిర్వహిస్తుందా? తరచూ తనిఖీలు చేస్తున్నాందా? నిబంధనల అమలును తనిఖీ బృందం పర్యవేక్షి స్తుందా? ఏవైనా నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారా? నిబంధనలు ఉల్లంఘిస్తే ఏమైనా చర్యలు తీసుకున్నారా? ప్రభుత్వం తరఫు నుంచి ఏవైనా మినహాయింపులు ఇచ్చారా?

7. లాభాపేక్ష లేని, నష్టం లేని (నో ప్రాఫిట్, నో లాస్) ప్రాతిపదికన పని చేస్తున్నామని ప్రకటించుకున్న యూనివర్సిటీలు నిజంగా అలానే పని చేస్తున్నాయా? ప్రభుత్వం దానిని ఏ అధికారంతో అనుమతించింది. యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వారు, ఆయన కుటుంబ సభ్యులకు చెల్లించే వేతనాలు, ఇతర ఖర్చులు, సంపాదించిన ఆస్తులతో సహా ఇతర అంశాలకు యూనివర్సిటీల నిధులు మళ్లించలేదని ఎలా నిర్ధారించారు? ఆయా యూనివర్సిటీల ఖాతాలను ఖాతాలను ఆడిట్ చేశారా? నిధుల మళ్లింపుపై ఏవైనా పరిశీలన చేశారా? యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వ్యక్తి, ఆయన కుటుంబ సభ్యులకు చేసిన చెల్లింపులను నిశితంగా పరిశీలించారా? యూనివర్సిటీ ఏర్పాటు చేసిన వారు, ఆయన కుటుంబ సభ్యులు సంపాదించిన ఆస్తులను పరిశీలించారా? ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారా?గుర్తిస్తే తీసుకున్న చర్యలు ఏమిటి?8.విద్యార్థులతో పాటు బోధనా సిబ్బంది ఫిర్యాదుల పరిష్కారానికి ఏదైనా వ్యవస్థ సదరు యూనివర్సిటీలో ఉందా? ఉంటే అవి పని చేస్తున్నాయా? ఫిర్యాదుల పరిష్కార కమిటీల కూర్పు ఎలా ఉంది. అప్పీలేట్ చేసుకునే అవకాశం ఉందా? ఇప్పటి వకు ఏవైనా ఫిర్యాదులు అందాయా? అందితే వాటిని పరిష్కరించారా.?

9. యూనివర్సిటీలు చట్టప్రకారం నిర్దేశించిన కనీస వేతనాలను అకడమిక్ స్టాఫ్‌కు చెల్లిస్తున్నాయా? యూజీసీ నిబంధనల అమలును ధ్రువీకరించారా? సిబ్బంది వేతనాల రికార్డులను పరిశీలించారా? ఈ క్రమంలో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన గుర్తించారా? అలా గుర్తిస్తే ఏమైనా చర్య తీసుకున్నారా? సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తనిఖీ బృందం రాష్ట్రంలోని ప్రైవేట్ యూనివర్సిటీల్లో ఆయా అంశాలను తనిఖీ చేసి ఆ వివరాలతో సమగ్ర అఫిడవిట్ రూపొందిస్తోంది. ఆ అఫిడవిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించనుంది.

అఫిడవిట్ సమర్పణ అనంతరం సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తదుపరి కార్యాచరణ చేపట్టనుంది. అలాగే తనిఖీ బృందం ఈ 9 అంశాలతో పాటు సంబంధిత ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందించనుంది.

# 15వ ఆర్థిక సంఘం నిధులు మళ్లించిన సర్కారు

**నిర్దేశిత లక్ష్యాలకు భిన్నంగా ఖర్చు : కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం**

**ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపించాలని కేంద్రమంత్రి రాజీవ్‌రంజన్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ**

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల మళ్లింపుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ నిధులను నిర్దేశిత ప్రయోజనాలకు విరుద్ధంగా దారి మళ్లిస్తున్న వ్యవహారంపై తక్షణ విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలకే వినియోగించేలా ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు తాగునీరు, పారిశుద్ధం, ఘనద్రవ వ్యర్థాల నిర్వహణ, గ్రామ మౌలిక సదుపాయాలు, ప్రజా ఆస్తుల నిర్వహణ వంటి నిర్దేశిత పనులకే వినియోగించాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఈ నిధులను నిర్దేశిత లక్ష్యాలకు భిన్నంగా ఖర్చు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాభివృద్ధి పనులకు వినియోగించకుండా సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ బిల్లులు, సాధారణ నిర్వహణ ఖర్చులు, ఇతర పరిపాలనా అవసరాలకు మళ్లిస్తున్నట్లు గ్రామ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో లిఖితపూర్వక ఉత్వర్వులివ్వకుండా మౌఖిక ఆదేశాలతో గ్రామ సర్పంచులపై ఒత్తిడి తెచ్చి ఈ నిధులను ఇతర ఖర్చులకు వినియోగించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల కారణంగా గ్రామాల్లో చేపట్టాల్సిన తాగునీటి పథకాలు, పారిశుద్ధ్య పనులు, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి తీవ్రంగా ప్రభావితమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధుల అసలు ఉద్దేశం దెబ్బతిటుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల (2020-21 2025-26) కింద కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు రూ.3,023.15 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉండగా, గ్రామ పం చాయతీ ఎన్నికల ఆలస్యం వల్ల నిధుల విడుదలలో జాప్యం జరిగిందన్నారు. దురదృష్టవశాత్తు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను గ్రామ పంచాయతీలకు అందించినట్టే అందిస్తూ.. విద్యుత్తు బకాయిలను చెల్లించడానికి, కరెంట్ బిల్లులు, శానిటేషన్ సిబ్బంది జీతాలు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లు బకాయిలు, డీజిల్ బకాయిల్ చెల్లింపులకు, ట్రాక్టర్ కొనుగోలు ఈఎంఐలకు వినియోగిస్తున్నారు. దీనివల్ల ఆర్థిక సంఘం నిధుల ఆశయం పక్కదారి పడుతుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి ఆగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ఆలస్యంగా నిర్వహించడం వల్ల అభివృద్ధి కుంటుపడింది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధి కోసం నిధులను కూడా విడుదల చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కూడా నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయడంవల్ల గ్రామ స్వయంపాలన వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఏర్పడుతుందని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై కేంద్ర స్థాయి ప్రత్యేక విచారణ గానీ ఆడిట్ నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను ఇతర అవసరాలకు మళ్లించిన విషయంపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు, సాధారణ పరిపాలనా వ్యయాలు ఇతర అనుమతించని ఖర్చులకు వినియోగించకుండా రాష్ట్ర ప్రభుత్వానికి తక్షణ ఆదేశాలు జారీ చేయాలి. గ్రామ పంచాయతీలకు విడుదలైన నిధులు పూర్తిగా నిర్దేశిత అభివృద్ధి పనులకే వినియోగించేలా కఠినమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలి. నిధులను దారి మళ్లించిన అధికారులు, సంబంధిత శాఖల బాధ్యులు, అటువంటి ఆదేశాలు జారీ చేసిన అధికారులపై సంబంధిత నిబంధనల ప్రకారం క్రమశిక్షణా మరియు చట్టపరమైన చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలి. సర్పంచులపై ఒత్తిడి తెచ్చి నిధులను ఇతర అవసరాలకు వినియోగించే పరిస్థితిని వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలన్నారు.

## అక్రమ సంబంధం కోసం భర్తను హత్య చేసిన భార్య

### తలను నరికి గుర్తుపట్టకుండా చేసిన ప్రియుడు

**కోల్‌కతా, జులై 17:** పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర బెంగాల్ ప్రాంతం బాగ్‌డోగ్రా సమీపంలోని హాన్స్‌ఖోయా టీ తోటలో తలలేని మృతదేహం లభించిన కేసును పోలీసులు ఛేదించారు. మృతుడి తెగిన తలతోపాటు హత్యకు ఉపయోగించిన పదునైన ఆయుధాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వెనుక ఏడేళ్లుగా కొనసాగుతున్న అక్రమ సంబంధమే కారణమని పోలీసుల దర్యాప్తులో తేలింది.

వివాహమైన పదేళ్ల తర్వాత భార్య తన ప్రియుడితో కలిసి భర్తను పథకం ప్రకారం హత్య చేయించినట్లు వెల్లడైంది. ఈ కేసులో మృతుడి భార్య మొమినా బేగం, ఆమె ప్రియుడు సుదీప్ పాల్‌తో పాటు మరో ముగ్గురిని బాగ్‌డోగ్రా పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను సిలిగురి సబ్‌డివిజనల్ కోర్టులో హాజరుపరచగా, బెయిల్‌ను తిరస్కరించిన న్యాయస్థానం వారికి ఏడు రోజుల పోలీసు కస్టడీ విధించింది. సిలిగురి పోలీస్ కమిషనర్ సయ్యద్ వక్వార్ రజా మాట్లాడుతూ, ఈ హత్య కేసులో ఐదుగురిని అరెస్టు చేశామని, ప్రాథమిక విచారణలో అక్రమ సంబంధం కారణంగానే ఈ హత్య జరిగినట్లు వెల్లడైందని తెలిపారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. సిలిగురి సమీపంలోని హాన్స్‌ఖోయా టీ తోటలో కార్మికులు టీ ఆకులు కోస్తుండగా తలలేని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం నార్త్ బెంగాల్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించారు. మృతుడిని బీహార్ రాష్ట్రంలోని కిషన్‌గంజ్‌కు చెందిన ఇమామ్‌గా గుర్తించారు. అతడు వృత్తిరీత్యా తాంత్రికుడు.

అతని భార్య కుటుంబం సిలిగురిలో నివసిస్తోంది. దర్యాప్తులో భాగంగా పోలీసులు ఇమామ్ భార్య మొమినా బేగంను, ఆమె ప్రియుడు బాగ్‌డోగ్రాకు చెందిన సుదీప్ పాల్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. సుదీప్ మేనల్లుళ్ల నితాయ్ పాల్, బాపి పాల్‌తో పాటు వారి స్నేహితుడు కౌశిక్ నాథ్‌ను కూడా అరెస్టు చేశారు.

**కంటింజెన్సీ ప్లాన్‌లోనూ ఊసే లేని ఫసల్ బీమా**

**వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతాంగం**

### సూపర్ ఎల్‌నినో ముంచుకొస్తున్నా..

# రాష్ట్రంలో పంటల బీమాకు నో

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** ప్రభాతవార్త వర్షాకాలం మొదలై నెలన్నర దాటినా ఆకాశంలో చినుకు జాడ లేదు. ఎల్ నినో భయంకరమైన ప్రభావంతో కరువు ముంచుకొస్తున్న ఈ క్లిష్ట సమయంలో రైతాంగాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన తెలంగాణలో ఇంకా అడుగు ముందుకు వేయకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కరువు పరిస్థితులు కమ్ముకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కంటిజెన్సీ ప్రణాళికను విడుదల చేసినా, అందులో పంటల బీమా పథకం ప్రస్తావనే తీసుకురాకపోవడం విశేషం. ఒక వైపు పంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమాతో ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని ప్రస్తు ప్రభుత్వం గట్టిగా హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకూ దాని ప్రస్తావనే లేకపోవడంతో లక్షలాది మంది అన్నదాతలు తీవ్ర అయోమయంలో పడిపోయారు.

గత 2020లో ఈ పథకం అశాస్త్రీయంగా ఉందంటూ, ఇదొక బోగస్ వ్యవహారమంటూ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం నుండి తప్పుకోవడంతో అప్పటి నుండి పంటలకు అసలు రక్షణే లేకుండా పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతు ప్రయోజనాలే పరమావధిగా దీన్ని తిరిగి అమలు చేస్తామని ప్రకటించినా, ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో ఎలాంటి ముందడుగు పడకుండా కేవలం కాగితాలకే పరిమితమైందన్న విమర్శలు వస్తున్నాయి. దీనికి తగినట్లుగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ఎల్ నినో ప్రభావం తెలంగాణపై తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించినా కూడా పంటల బీమా వైపు మాత్రం అడుగులు పడ లేదు.


ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు పూర్తిగా నష్టపోయినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి బీమా పథకాల ద్వారా రైతులకు భారీ నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన మొదటి టర్ములో మాత్రమే ఈ కేంద్రీయ పథకాన్ని కాస్తో కూస్తో అమలు చేసి, సెకండ్ టర్ములో పూర్తిగా నిలిపివేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కీమ్‌లో మళ్లీ చేరుతున్నట్లు ప్రకటించడమే కాకుండా, రైతులు కట్టాల్సిన ప్రీమియంను తామే భరిస్తామని హామీ ఇచ్చినా తదుపరి దాని గూర్చి పట్టించుకోకపోవడంతో అన్నదాతల్లో ధీమా కరువైంది. తాజాగా ఎల్ నినో సృష్టించిన వాతావరణ మార్పుల వల్ల తగినంత వర్షాలు పడక, నాటిన విత్తనాలు మొలకెత్తక ప్రాథమిక దశలోనే రైతులకు తీరని నష్టం జరిగింది.

దీంతో రాష్ట్ర సాగు రంగానికి తీవ్రమైన దెబ్బ తగిలింది. వరికి ప్రత్యామ్నాయంగా కాస్త లాభదాయకంగా ఉంటుందని భావించి మొక్కజొన్న, పెసర, మినుము, కందులు వంటి ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లినప్పటికీ, నేలలో తగినంత తేమ లేక, సాగునీరు అందక ఆ పంటలపై కూడా నీలి నీడలు కమ్ముకున్నాయి. పెట్టిన పెట్టుబడి మట్టిపాలై, అటు ప్రత్యామ్నాయ పంటలు కూడా చేతికి దక్కే పరిస్థితి లేకపోవడంతో లక్షలాది గ్రామీణ రైతాంగ కుటుంబాలు రేపటి గురించి తీవ్రమైన గందరగోళంలో మునిగిపోయాయి.

ప్రకృతి సృష్టించే ఇలాంటి దారుణ వైపరీత్యాల నుండి ఆర్థికంగా ఆదుకోవడానికి పంటల బీమా ఆచరణలోకి రాకపోవడం రైతాంగానికి పెద్ద మైనస్ పాయింట్‌గా మారిందని వ్యవసాయ శాఖ అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. దాదాపు 55 లక్షల మంది రైతులు, సుమారు కోటి ఇరవై లక్షల ఎకరాల విస్తారమైన సాగు భూమి ఈ ఉచిత బీమా పరిధిలోకి రావాల్సి ఉన్నప్పటికీ, రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల నుండి ఇప్పటికీ ఎలాంటి స్పష్టత రావడం లేదు. దీంతో ఇప్పుడు వర్షాభావం వల్ల జరిగిన భారీ నష్టానికి పరిహారం అందుతుందో లేదో తెలియని గందరగోళ పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్నది.

కేంద్ర వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో బారిన పడే తెలంగాణతో కలిపి 315 జిల్లాలలో దాదాపు 111 జిల్లాల్లో సాధారణం కంటే మూడొంతుల వర్షాలు తగ్గిపోయి కేవలం 25 శాతమే వానలు కురిసే ప్రమాదం ఉంది. అందుకే కేంద్రం వీటిని హై ప్రయారిటీ కేటగిరీలో పెట్టింది. మరో 76 జిల్లాల్లో 50 శాతం వర్షాలు పడే అవకాశం ఉండటంతో మీడియం కేటగిరీగా, మిగిలిన 128 జిల్లాలను సాధారణ స్థాయికి దగ్గరగా వర్గీకరించింది. ఈ భయానక వాతావరణ పరిస్థితులను ముందే ఊహించిన కేంద్ర ఆర్థిక శాఖ రైతులు నష్టపోకుండా ఉండేందుకు వీలుగా ఇన్సూరెన్స్ కంపెనీలు ఫసల్ బీమా యోజన ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను సూపర్ ఫాస్ట్‌గా ముగించాలని ఆదేశించింది. ఇందులో నమోదు కాని రైతులకు పంట నష్టపరిహారం అందే అవకాశం లేనందున అర్హులైన ప్రతి ఒక్కరినీ త్వరగా చేర్చాలని స్పష్టం చేసింది.

సాధారణంగా ఖరీఫ్ సీజన్‌కు 2 శాతం, రబీ సీజన్‌కు 1.5 శాతం చొప్పున రైతుల నుండి ప్రీమియం వసూలు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ఆ భారాన్ని తామే మోస్తామని చెప్పినా ఇప్పటికీ దానిపై తగిన చర్యలు తీసుకోకపోవడంతో రైతాంగంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



జగదాంబ అమ్మవారికి రెండోపూజ

## గోల్కొండ జగదాంబ మహంకాళికి రెండో పూజ

### జనసంద్రంగా మారిన గోల్కొండ కోట

**అమ్మవారికి బోనాల సమర్పణ, ప్రత్యేక పూజలు**

**హైదరాబాద్ (మెహిదీపట్నం), జులై 19, ప్రభాతవార్త :** గోల్కొండ కోట జగదాంబ మహంకాళి ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు రెండో పూజను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ముందకొడిగా కొనసాగినప్పటికిని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వేల సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారి నీ దర్శించుకున్నారు. మహిళలు బోనాలు అమ్మవారికి సమర్పించారు. అంతేకాకుండా వారి వారి మొక్కులను భక్తులు చెల్లించుకున్నా రు. ఈ బోనాల ఉత్సవాల సందర్భంగా గోల్కొండ కోట భక్తులతో కోలాహలంగా మారింది. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు... గోల్కొండ కోట శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కుటుంబ సభ్యులతో వచ్చి అమ్మవారిని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ అద్దంకి దయాకర్ కుటుంబ సభ్యుల్ని సన్మానించారు. కాగా సాయంత్రం గోల్కొండ కోటలో భారీ సంఖ్యలో భక్తులు రావడంతో బోనం ఎత్తుకున్న మహిళలకు పోలీసులు వారిని ప్రత్యేక లైన్ లో పంపించారు. నాలుగు, ఐదో పూజకు ఆలయానికి లక్షల భక్తులు వస్తారని ఎవరికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్ తెలిపారు.

**వాంగ్‌చుక్ భార్య గీతాంజలి వెల్లడి**

**సోనంను ప్రైవేటు ఆసుపత్రికి తరలించడం సాధ్యం కాదన్న ఢిల్లీ హైకోర్టు**

# హామీ ఇస్తే దీక్ష ముగింపు



**న్యూఢిల్లీ, జులై 19:** ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ మూడు వారాలుగా కొనసాగిస్తున్న నిరాహార దీక్షను రెండు కీలక షరతులు నెరవేరితే సోమవారం విరమించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో ఆదివారం వెల్లడించారు. ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు తిరస్కరించిన కొన్ని గంటలకే ఆమె ఈ ప్రకటన చేశారు. ఇటీవల జరిగిన నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఆయన దీక్షను విరమించేందుకు రెండు షరతులు పెట్టారు. రాజకీయ పార్టీల నేతలు ఆసుపత్రికి వచ్చి ఆయనను కలవడంతో పాటు, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం అంశాన్ని సోమవారం ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో లేవనెత్తుతామని హామీ ఇవ్వాలని కోరారు. ఈ హామీ లభిస్తే సోమవారం దీక్షను ముగిస్తారని ఆయన భార్య తెలిపారు. జంతర్ మంతర్ నుంచి బలవంతంగా తరలింపుశనివారం ఉదయం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేస్తున్న సోనం వాంగ్‌చుక్‌ను పోలీసులు అక్కడి నుంచి తొలగించి సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నప్పటికీ ఆసుపత్రిలో చేరేందుకు నిరాకరించడంతో ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. జస్టిస్ మినీ పుష్కర్ణ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆయనను ఆసుపత్రికి తరలించడంలో ప్రభుత్వం తన అధికార పరిధిలోనే వ్యవహరించిందని స్పష్టం చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఆసుపత్రి వైద్యులు ఆయన ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆయన సమ్మతితోనే నోటి ద్వారా మందులు అందిస్తున్నారని, బలవంతపు వైద్యం జరుగుతోందని లేదా ఆయన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిందని చెప్పలేమని కోర్టు పేర్కొంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రాథమికంగా ఏకపక్షమైందని లేదా రాజ్యాంగబద్ధమైన వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘించిందని చెప్పడానికి ఆధారాలు లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రైవేటు ఆసుపత్రికి తరలించాలని భార్య విజ్ఞప్తిసోనం వాంగ్‌చుక్‌ను కుటుంబ సభ్యుల అనుమతి లేకుండానే సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేర్చారని, ఆయనను తన ఇష్టానికి విరుద్ధంగా అక్కడ ఉంచుతున్నారని ఆరోపిస్తూ గురుగ్రామ్‌లోని మెదాంతా ఆసుపత్రికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని గీతాంజలి ఆంగ్మో హైకోర్టును ఆశ్రయించారు. దీర్ఘకాల నిరాహార దీక్ష కారణంగా ఆయన ఆరోగ్యం క్షీణించిందని, శరీరంలోని కీలక ఆరోగ్య సూచీలు పడిపోవడంతో అత్యవసర వైద్య చికిత్స అవసరమైందని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు వివరించింది. జులై 16న ఇచ్చిన డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే తక్షణ చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామని, అదే ఆదేశాల అమలులో భాగంగానే ఆసుపత్రికి తరలించామని ప్రభుత్వం తెలిపింది. ఈ వాదనను హైకోర్టు కూడా సమర్థించింది. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వైద్యుల సమాచారం ప్రకారం సోనం వాంగ్‌చుక్ కీలక జీవిత సూచీలు ప్రస్తుతం స్థిరంగానే ఉన్నాయి. రక్త పరీక్షల ఫలితాల్లో స్వల్ప మెరుగుదల కనిపించినప్పటికీ ఆయన ఆరోగ్యంపై నిరంతర నిఘా అవసరమని వైద్యులు తెలిపారు. దీర్ఘకాల నిరాహార దీక్ష వల్ల శరీరంపై తీవ్రమైన శారీరక ఒత్తిడి, పలు అవయవాలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున వివిధ విభాగాలకు చెందిన నిపుణుల బృందం పర్యవేక్షణలో నిరంతర వైద్య చికిత్స కొనసాగిస్తున్నట్లు ఆసుపత్రి వెల్లడించింది. 24 గంటలపాటు క్లినికల్ మానిటరింగ్ కొనసాగించడం అత్యంత అవసరమని వైద్యులు పేర్కొన్నారు



పీర్జాదిగూడ చెరువులో విగ్రహం కోసం గాలిస్తున్న డిఆర్ఎఫ్ బృందాలు

## మిస్టరీగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి కేసు

**ఉప్పల్, జులై 19 ప్రభాతవార్త:** నగర శివారులో కలకలం రేపిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తేజస్విని మృతి కేసు దర్యాప్తులో అత్యంత విచిత్రమైన, ఊహించని మలుపులు వెలుగులోకి వస్తున్నాయి. చెరువులో దూకి ప్రాణాలు కోల్పోయిన తేజస్విని.. చనిపోయే ముందు ఒక గుడిలోని అమ్మవారి విగ్రహాన్ని తనతో పాటు తీసుకెళ్లినట్లు తేలడంతో పోలీసులు ఇప్పుడు ఆ విగ్రహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం తేజస్విని శుక్రవారం తెల్లవారు జామున తన దుస్తులు విప్పేసి, దిగంబరంగా సమీపంలోని ఒక గుడిలోకి ప్రవేశించింది. అక్కడ ఉన్న అమ్మవారి విగ్రహాన్ని చేతుల్లోకి తీసుకుని నేరుగా సమీపంలోని చెరువు వైపు నడిచి, నీటిలోకి దూకింది. ఆ తర్వాత ఆమె మృతదేహం లభ్యం కాగా, ఆమె తీసుకెళ్లిన విగ్రహం మాత్రం ఇంకా దొరకలేదు. ఈ కేసులో ఆ విగ్రహం కీలక ఆధారంగా మారే అవకాశం ఉండటంతో, డీఆర్ఎఫ్ సిబ్బంది బోట్ల సహాయంతో చెరువులో విగ్రహం కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ దర్యాప్తులో తేజస్విని ఉంటున్న నివాసానికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. ఆమె ఒక అద్దె ఫ్లాట్‌లో ఉంటున్నట్లు, దానికి రోజుకు రూ.3,500 చొప్పున నెలకు దాదాపు రూ.లక్ష వరకు అద్దె చెల్లిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా, ఆమె ఉంటున్న భవనంలోని పై రెండు అంతస్తులను అక్రమంగా ఒక లాడ్జిలా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీనికి తేజస్విని మృతికి ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. పోలీసులు తేజస్విని తల్లి అరుణను ప్రశ్నించడంతో పాటు, ఆమె రాసినట్లుగా భావిస్తున్న డెత్ డిక్లరేషన్, ఇటీవల ఆర్థిక లావాదేవీలు, సీసీటీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. యువతి మానసిక పరిస్థితి బాగాలేదని సిఐ జలంధర్‌రెడ్డి పేర్కొంటున్నారు. మేడిపల్లి పోలీసులు విచారణ చేస్తున్నారు.




ఆదివారం హైదరాబాద్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

## తరలిపోతున్న విజ్ఞానాన్ని కాపాడుకుందాం: పలువురు వక్తలు

**ధర్నాచౌక్, జులై 19, ప్రభాతవార్త:** మనదేశంలో సరియైన అవకాశాలు లేక, విదేశాలకు తరలి పోతున్న మన విజ్ఞానాన్ని కాపాడు కుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో విద్యావ్యవస్థలో పెరిగిపోతున్న అవినీతికి వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఛలో పార్లమెంట్ మార్చ్ పిలుపుకు మద్దతుగా దిశ విద్యార్థి సంఘం ఆద్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం, దిశ విద్యార్థి సంఘం సభ్యులు హారిక, శ్రీజ, తక్కెల్ల పల్లి పవన్, రోహిత్‌తో పాటు వంద లాది మంది విద్యార్థులు పాల్గొని పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా దిశ విద్యార్థి సంఘం నేతలు మాట్లాడుతూ సంవత్సరాలు తరబడి కష్టపడి చదివి, పరీక్ష రాసే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను ఒక సరుకుగా మార్చి, లాభాల కోసం ఎంతకైనా తెగించే ఈ వ్యవస్థ కారణంగా 40 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ ఈ దేశ యువతే నిజమైన దేశ భక్తులని, సంక్షోభంలో ఉన్న మన రాజ్యాంగాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. గాంధేయ మార్గంలో పోరాటం మొదలు పెట్టిన సోనంతో ప్రభుత్వం చర్చలు జరపకుండా బ్రిటీష్ వారికంటే నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దిశ సభ్యురాలు శ్రీజ మాట్లాడుతూ బీజేపీ పాలనలో పేపర్ లీకులు పరిపాటి అయ్యాయని, వీటిని ప్రశ్నిస్తే దేశద్రోహులు అంటున్నారని మండిపడ్డారు.

కోనసీమలో విషాదం..

## కాలువలోకి దూకి తల్లి, కూతురు ఆత్మహత్యాయత్నం

### సముద్రంలో దిగి ముగ్గురు యువకులు గల్లంతు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై 19,ప్రభాతవార్త:** డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆదివారం గంగమ్మ వడిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా ఇరువురు గల్లంతు అయ్యారు. ఆదివారం ఈ విషాదం లో రెండు వేర్వేరు సంఘటన లలో చోటుచేసుకున్నాయి. రావులపాలెం వద్ద పెద్ద కాలువలోకి దూకి తల్లి, కూతురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ప్రకారం ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన వాడపల్లి బూరమ్మ (80), ఆమె కుమార్తె మీసాల సూర్యవతి (60) పంట కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఊబలంక సాయిబాబా ఆలయం సమీపంలోని పంట కాలువలో వీరు దూకినట్లు పోలీసులు తెలిపారు. సూర్యవతి మృతదేహం లభించగా, బూరమ్మ మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కొంతకాలం క్రితం కుమారుడు మృతి చెందడంతో బూరమ్మ కుమార్తె సూర్యవతి వద్ద ఉంటున్నట్లు తెలిసింది. సూర్యవతికి భర్తతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.బూరమ్మ చెవిటి, మూగ కావడంతో పాటు కుమార్తె సూర్యవతి కూడా కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతు న్నట్లు సమాచారం. తమను చూసుకునే వారు లేరనే ఆందోళన, భవిష్యత్తుపై భయంతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న రావులపాలెం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై చంటి తెలిపారు.

**విహారంలో విషాదం:** ఆషాడమాసం విహారయాత్ర ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అంబాజీపేట మండలం మాచవరం,కొర్లపాటివారిపాలెం ల కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన 9 మంది ఆదివారం మధ్యాహ్నం ఓడలరేవు బీచ్ కు వెళ్లారు.సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు యువకుల్లో ముగ్గురు యువకులు మంచాల షణ్ముఖ్ (17), మంచాల సాయి(22), సుధా అరవింద్ వీరవెంకట సాయికుమార్ (28) అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోగా ఇద్దరు యువకులు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. అరవింద్, షణ్ముఖ్ మృతదేహాలులభ్యం కాగా సాయి మృతదేహం కోసం గాలిస్తున్నారు. సాయి, షణ్ముఖ్‌లు అన్నదమ్ముల కుమారులు. కాగా అరవింద్ వరుసకు మేనల్లుడు.

## మహేశ్ కుమార్‌గౌడ్‌కు ఈశ్వరమ్మ యాదవ్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై19:** టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు యాదగిరిగుట్ట బోర్డు మెంబర్ ఈశ్వరమ్మ యాదవ్ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. 24పేజీలతో ఈ లేఖ రాశారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జక్కిడి శివ చరణ్ రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డిలపై చర్యలు తీసుకోకపోవడంతో తనపై బీసీ సంఘాల నుంచి ఒత్తిడి వస్తోందని లేఖలో పేర్కొన్నారు. జక్కిడి శివ చరణ్ రెడ్డిపై చర్యలు తీసుకోకుండా ఆయనకు గన్‌మెన్‌ను కేటాయించారని ఈశ్వరమ్మ యాదవ్ తెలిపారు. బాధితులమైన తమకు రక్షణ కల్పించాల్సింది పోయి అతనికి గన్‌మెన్‌ను కేటాయిస్తారా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై బీసీసంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయని చెప్పుకొచ్చారు. గతంలో క్రమ శిక్షణఉల్లంఘించిన సర్వే సత్యనారాయణ, తీన్మార్ మల్లన్న, భార్గవ్ దేశ్ పాండే, యూత్ కాంగ్రెస్ లీడర్ రాఘవేంద్ర గౌడ్‌లను సస్పెండ్ చేశారని ప్రస్తావించారు. తక్షణమే జక్కిడి శివచరణ్ రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని ఈశ్వరమ్మ యాదవ్ డిమాండ్ చేశారు.

# యూరియాకు ఆంక్షల కష్టాలు




ఎకరానికి 4 కట్టలు అవసరమైనా రెంటికే కటాఫ్

ఐదు ఎకరాలు పైబడితే మూడు విడతల బుకింగ్

విడత విడతకు మధ్య 20 రోజులు పెరిగిన గ్యాప్

పాస్ బుక్ లేకుంటే నో యూరియా

సాంకేతిక సమస్యలతో రైతుల అగచాట్లు

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** తెలంగాణలో యూరియా నిబంధనలు రోజురోజుకు క్లిష్టతరంగా మారుతున్నాయి. యూరియా బుకింగ్ నిబంధనల్లో మార్పులు రైతుల పాలిట శాపంగా పరిణమిస్తోంది. వ్యవసాయానికి అవసరమైన యూరియా సరఫరా, పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తోంది. రైతులు బ్లాక్ మార్కెట్ ఇబ్బందులు పడకుండా, పారదర్శకంగా ఎరువులు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇక యూరియా పంపిణీలో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. తరచూ సర్వర్ డౌన్ కావడం ఒకట్రైతే, ఏజెన్సీ ప్రాంతాల్లో ఫోన్ నెట్‌వర్క్ సమస్య కారణంగా రైతులు సకాలంలో బుకింగ్స్ చేసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగిన నేపథ్యంలో యూరియా వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. తాజాగా డీఏపీ లభ్యత కూడా లేకపోవటంతో రైతులు యూరియాపై ఆధారపడుతున్నారు. ఎకరానికి నాలుగు కట్టల యూరియా అయితే సంపూర్ణంగా సరిపోతుంది. కానీ రెండు కట్టలు మాత్రమే ఇస్తుండటంపై రైతాంగం అసంతృప్తితో ఉంది. రబీలో ఎకరానికి మూడు కట్టల చొప్పున పంపిణీ చేయగా, ప్రస్తుత ఖరీఫ్ నాటికి దానిని రెండింటికి వ్యవసాయ శాఖ అధికారులు కుదించారు. వాస్తవానికి ఎకరానికి నాలుగు కట్టలు అవసరం అవుతుండగా, రెండింటికి తగ్గించడంతో రైతాంగం ఇబ్బంది పడుతోంది. ఇక గతంలో 15 రోజులకు ఓ విడత చొప్పున ఇచ్చిన యూరియా బస్తాలను ఇప్పుడు 20 రోజులకు పెంచడంపై రైతాంగం కష్టాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తప్పడం లేదు. రాష్ట్ర యాప్‌లో యూరియా బుకింగ్‌కు సంబంధించి దశలవారీ అర్హత పరిమితుల్లో మార్పు చేశారు. 2 ఎకరాల వరకూ ఒకేసారి పూర్తి పరిమాణం బుక్ చేసుకోవచ్చు. గతంలో రెండు కట్టలు ఒకసారి, రెండు కట్టలు మరోసారి బుక్ చేసుకోవాల్సి ఉండేది. ఇప్పుడు ఒకే విడతలో నాలుగు కట్టలను బుక్ చేసుకోవచ్చు. 2 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు రెండవ విడతలో బుకింగ్ చేసుకోవాలి. గతంలో విడతకు విడతకు మధ్య 15 రోజుల వ్యవధి ఉండేది. కానీ ఇప్పుడు గడువును 20 రోజులకు పెంచారు. 5 ఎకరాలకు పైబడితే మూడు విడతలలో బుకింగ్ చేసుకోవచ్చు (40:30:30) నిష్పత్తిలో చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో 8 ఎకరాలకు పైబడితే అత్యధికంగా నాలుగు విడతల్లో బుకింగ్ చేసు కోవాల్సి వచ్చేది. ఇప్పుడు మూడు విడతల్లో చేసుకునే వీలు కల్పించింది. మరోపక్క పాస్‌బుక్ ఉంటేనే యూరియా ఇస్తామనే కండిషన్ నేపథ్యంలో పట్టాలు లేని రైతులకు యూరియా కొనుగోలు చేసేందుకు ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత గిరిజనేతర రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. వీరితో పాటు హక్కు పత్రాలు లేని పోడు రైతులు, పాస్ పుస్తకాలు లేని సీలింగ్, మాన్యం, ఇతరత్ర భూములు సాగు చేసే రైతులు యూరియా బస్తాల కోసం అగచాట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది.అందుకే నాన్ డిజిటల్ సిగ్నేచర్ (ఎన్డీఎస్) రైతులను గుర్తించి యూరియా బస్తాలు ఇవ్వాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మాన్యం భూములను సాగు చేసే రైతులను కౌలుదారులుగా గుర్తించి ఇవ్వాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే యూరియా అవసరం లేని సుబాబుల్, జామాయిల్, ఇతర పంటలు సాగుచేసిన రైతులకు మాత్రం పంపిణీ చేస్తున్నట్లువిమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

# తెలంగాణలో పెరిగిన వర్షాభావ పరిస్థితి

30 జిల్లాలకు చేరిన లోటు

భారీ లోటు కేటగిరిలో హానమకొండ, మల్కాజిగిరి

9.46 మీటర్ల మట్టానికి పడిపోయిన జలాలు

**హైదరాబాద్, జులై 19, ప్రభాతవార్త:** జూలై నెల దాదాపు సగం గడిచినా, తెలంగాణ బలహీనమైన నైరుతి రుతుపవనాలతో సతమతమవుతూనే ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 30 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా, మరో రెండు జిల్లాలు భారీ లోటు కేటగిరీలోకి జారిపోయాయి. తాజా వర్షపాత గణాంకాల ప్రకారం, ఈ రుతుపవన కాలంలో రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం వర్షపాతం 35 శాతం తక్కువగా నమోదైంది. గత కొన్ని వారాలుగా మహారాష్ట్ర, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాల్లో పదేపదే భారీ వర్షాలు కురుస్తుండగా, తెలంగాణలో మాత్రం అక్కడక్కడా చెదురుమదురు జల్లులు మినహా మిగతా రాష్ట్రాలన్నీ చాలా వరకు పొడిగానే ఉన్నాయి. అత్యంత తీవ్రంగా ప్రభావితమైన జిల్లాలలో హానుమకొండ, మేడ్చల్‌మల్కాజిగిరి ఉన్నాయి. ఇక్కడ వరుసగా 68, 60 వర్షపాత లోటు నమోదైంది. ఈ కాలంలో సాధారణంగా కురవాల్సిన సుమారు 272 మి.మీ వర్షపాతానికి బదులుగా, ఈ రెండు జిల్లాల్లో కేవలం 86 మి.మీ వర్షపాతం మాత్రమే కురిసింది. భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) ప్రకారం, రాష్ట్రం ప్రస్తుతం వర్షచ్ఛాయ వాతావరణంలోఉంది. ఇక్కడ రుతుపవన గాలులు వీస్తున్నప్పటికీ, విస్తృత వర్షపాతాన్ని ప్రేరేపించడానికి అవసరమైన వాతావరణ వ్యవస్థలు లేవు.నైరుతి రుతుపవనాల రాక వెంటనే వర్షాలు కురవడానికి దారితీయదని ఐఎండి హైదరాబాద్ సీనియర్ వాతావరణ శాస్త్రవేత్త జి.ఎన్. రావు శ్రీనివాస్ వివరించారు.ప్రస్తుత వాతావరణ సరళి కారణంగా తెలంగాణ వర్షచ్ఛాయా ప్రాంతంగా మారిందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాల్లో ఇదే కాలంలో 60 నుంచి 80 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, తెలంగాణలో కేవలం 6 నుంచి 7 సెం.మీ. మాత్రమే నమోదైంది. వర్షాలు లేకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా పగటిఉష్ణోగ్రతలు కూడా పెరిగాయి. మేఘాలు తగ్గడం వల్ల అనేక జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సుమారు 38 డిగ్రీల వరకు పెరిగాయి, ఇది సంవత్సరంలో ఈ సమయానికి సాధారణం కంటే దాదాపు 6 డిగ్రీలు ఎక్కువ. అధిక ఉష్ణోగ్రతలు మరియు వాతావరణంలో పెరిగిన తేమకలయిక వేడి, ఉక్కపోతతో కూడిన పరిస్థితులకు కూడా దారితీసిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరోపక్క తగినంత వర్షపాతం లేకపోవడం, నీటి కొరతతో పాటు, భూగర్భ జలమట్టాలు సాధారణ స్థాయి కంటే దిగువకుపడిపోతున్నాయి. జూన్ 2026 నెలలో రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం భూ ఉపరితలానికి 9.46 మీటర్ల భూమి మట్టానికి దిగువన (ఎమ్ బిజిఎల్) ఉంది. ఇది ఖమ్మంలో 5.46 (ఎమ్‌బిజిఎల్ నుండి మెదక్, వికారాబాద్‌లలో 13.30 ఎమ్ బిజిఎల్ ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాలలో, 20 జిల్లాలలో సగటు భూగర్భ జలమట్టాలు 5 నుండి 10 ఎమ్ బిజిఎల్ మధ్య నమోదు కాగా, మిగిలిన 13 జిల్లాలలో 10 నుండి 15 ఎమ్ బిజిఎల్ మధ్య నమోదయ్యాయి. జూలై 14 వరకు కురిసిన వర్షపాతం ఆధారంగా మొత్తం వర్షపాతం 30 శాతం తక్కువగా ఉంటుందని భావిస్తే, రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం జూలైలో 10.35 మీటర్లకు, ఆగస్టు 2026లో మరింతగా 11.01 మీటర్లకుపడిపోతుందని అంచనా. మే 2026తో పోలిస్తే, జూలైలో సగటు భూగర్భ జలమట్టం 1.09 మీటర్లు, ఆగస్టులో 1.74 మీటర్లు తగ్గుతుందని అంచనా. వర్షపాతం తక్కువగా ఉండటం, భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో, బోర్‌వెల్స్ ద్వారా పంటలు పండించాలని ఆశించే రైతులకు పెద్దగా ఉపశమనం లభించే అవకాశం లేదు.

# భద్రాద్రి అభివృద్ధికి మంత్రి పొంగులేటి డెడ్‌లైన్

పుష్కరాలకు 15 రోజుల ముందే అన్ని పనులు పూర్తి చేయాలి



**భద్రాచలం, ప్రభాతవార్త:** గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార-పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం భద్రాచలం, సారపాకలో నిర్వహించిన వరుస కార్యక్రమాల్లో ఆలయ పునరుద్ధరణ, పుష్కరాల ఏర్పాట్లు, భూముల రీసర్వే, అటవీ-రెవెన్యూ సమస్యలు, శ్రీనివాసగుట్ట అభివృద్ధి తదితర అంశాలపై అధికారులకు గడువులతో కూడిన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భద్రాచలం ఆలయ దర్శనంతో ప్రారంభమైన మంత్రి పర్యటన జిల్లా అభివృద్ధి అంశాలపై సుదీర్ఘ సమీక్షలతో ముగిసింది.మంత్రి తొలుత భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంజినీరింగ్, దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో జిల్లా అధికారులతో భూముల రీసర్వే, అటవీ-రెవెన్యూ సమస్యలు, పోడు భూములు, శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై సమగ్ర సమీక్ష చేపట్టారు.భద్రాచలం దేవస్థానం పునరుద్ధరణ పనులు వచ్చే గోదావరి పుష్క రాలకు 15 రోజుల ముందే పూర్తికావాలని మంత్రి స్పష్టమైన గడువు విధించారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుకను చట్టబద్ధంగా అందుబాటులో ఉండే ప్రాంతాల నుంచి సకాలంలో సరఫరా చేస్తామని జిల్లా కలెక్టర్ అంకిత్ హామీ ఇచ్చారు.అనంతరం సారపాకలో జరిగిన సమీక్షలో జిల్లాలో 70 గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే పనులపై మంత్రి ఆరా తీశారు. ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు కొనసాగుతుండగా, ఐదు గ్రామాల్లో పూర్త య్యాయని అధికారులు వివరించారు. పాల్వంచ శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేలా రహదారి నిర్మాణంతో పాటు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.మంత్రి పర్యటనలో ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్,ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈవో దామోదర్ రావు, అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, దేవాదాయ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నదుల అనుసంధానంపై పార్లమెంటులో ప్రస్తావిస్తాం

## టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు



**విజయవాడ,జులై19, ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో నదుల అనుసంధానంపై మొదటి నుంచి సీఎం చంద్రబాబు మాట్లాడుతున్నారని తెలుగుదేశం పార్టీ లోక్‌సభా పక్షనేత లావు శ్రీకృష్ణ దేవరాయలు వ్యాఖ్యానించారు. ఆదివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పార్లమెంట్‌లో నదుల అనుసంధానంపై చర్చ జరగాలని సూచించారు. అన్ని పార్టీలు నదుల అనుసంధానంపై చర్చలో పాల్గొనాలని అన్నారు. గోదావరి, పెన్నా నదులను అనుసంధానించాలని తెలిపారు. ఆక్వా రైతుల ఫీడ్ ధరలు తగ్గించాలని చెప్పారు. పడిపోయిన పొగాకు ధరల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పొగాకు రైతుల సమ స్యలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని తెలిపారు. హార్టికల్చర్ హబ్‌పై పార్లమెంట్‌లో చర్చించాలని చెప్పారు.వాటిపై కొత్తగా చట్టాలు తీసుకురావాలి..సోషల్ మీడియాలో వ్యక్తిగత హననంపై పార్లమెంటులో స్వల్ప కాలిక చర్చ జరగాలని లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. రాజకీయ నేతలు, సెలబ్రిటీలే కాకుండా సామాన్య ప్రజలు కూడా వ్యక్తిగత హననానికి గురవుతున్నారని చెప్పారు. ఈ విషయంపైన కొత్తగా చట్టాలు తీసుకురావాలని సూచించారు. వీటిపైన పార్లమెంట్‌లో చర్చించాలని అన్నారు. మ్యూల్ అకౌంట్స్, ఆన్‌లైన్ మోసాలు, షెల్ కంపెనీలతో ప్రజలు నష్టపోతున్నారని దీనిపై చర్చ జరగాలని చెప్పారు. పోలవ రం, అమ రావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. 2027 మార్చి నాటికి ఫస్ట్‌ఫేజ్ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. దాని తర్వాత సెకండ్ ఫేస్ పూర్తి చేస్తామని తెలిపారు. ఏపీలో 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను రూ.60వేల కోట్లతో గుర్తించామని చెప్పారు. తదుపరి ఎన్నికలకు వెళ్లే ముందే వీటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు.

# అది యువతను రెచ్చగొట్టే సదస్సు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై19:** బీఆర్ఎస్ నిర్వహించింది యువ సంగ్రామ సదస్సు కాదని,యువతను రెచ్చగొట్టే సదస్సు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ఆదివారం ఆయన సిఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆ సభలో రెచ్చగొట్టేలా ఉన్మాదంగా వికృత వ్యాఖ్యలు చేశారని, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎండ్రిన్ తాగి చావాలని, ఎమ్మెల్యేలను కొట్టిచంపాలని మాట్లాడారు. పింక్ సోషల్ మీడియా ఫెయిడ్ ఆర్టిస్టులు వికృతంగా మాట్లాడుతుంటే కేటీఆర్ వాళ్లను వారించకుండా చూస్తు కూర్చున్నాడని అది శ్రీనివాస్‌అక్షేపించారు. కేటీఆర్ మనస్తత్వం ఏమిటో దీన్ని చూసి అర్థం చేసుకోవచ్చని, మళ్లీ అధికారంలోకి రావాలన్న ఆలోచనతో విషసంస్కృతిని, విష బీజాలను నాటే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నిరుద్యోగులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని, తమ ప్రభుత్వం 70వేల ఉద్యోగాలను భర్తీ చేసింది,

పేపర్ లీక్ లు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించి నియామకపత్రాలు అందజేశామని తెలిపారు. అంగన్ వాడీ, పోలీస్ శాఖతో పాటు అనేక ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇచ్చామని, భవిష్యత్తులో మరిన్ని ఇస్తామన్నారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసమే కేటీఆర్ డ్రామాలని, పేపర్ల లీక్ చేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది..నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వకుండా మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌దని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో యువతను రెచ్చగొట్టి అనేకమంది బలిదానాలకు కారణమయ్యారని ఆరోపించారు.

యువ సంగ్రామ సదస్సులో గులాబీ ఫెయిడ్ ఆర్టిస్టులతో సభను నింపారని, సోషల్ మీడియాలో వికృత మాటలను ప్రచారం చేసుకుంటున్నారని ఆయన ఆరోపణలు గుప్పించారు.



## ఇమ్రాన్ సోదరి నోరీన్ నియాజీకి పాక్ సైబర్ క్రైమ్ ఏజెన్సీ సమన్లు

**లాహోర్,జులై 19:** పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సోదరి నోరీన్ నియాజీకి ఆ దేశ జాతీయ సైబర్ క్రైమ్ దర్యాప్తు సంస్థ సమన్లు జారీ చేసింది. ప్రభుత్వ సంస్థలను అపకీర్తిపాలు చేసేలా, తప్పుడు కథనాలను ప్రచారం చేసేలా సామాజిక మాధ్యమాల్లో అసత్య, అభ్యంతరకర, రెచ్చగొట్టే వ్యాఖ్యలను ప్రచారం చేశారనే ఆరోపణలపై ఈ చర్య తీసుకుంది. ఇటీవల నోరీన్ నియాజీ ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అయింది. ఆ ఇంటర్వ్యూలో 2025 మే నెలలో భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన సైనిక ఉద్రిక్తతలు పాకిస్తాన్ సైన్యం ప్రతిష్ఠను పెంచేందుకు ఉద్దేశపూర్వకంగా సృష్టించారని ఆమె ఆరోపించింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన జాతీయ సైబర్ క్రైమ్ దర్యాప్తు సంస్థ సమన్లు జారీ చేస్తూ, సోమవారం ఇస్లామాబాద్‌లోని తమ కార్యాలయానికి హాజరై వాంగ్మూలం ఇవ్వాలని ఆదేశించింది. సంస్థ జారీ చేసిన నోటీసులో, "ప్రభుత్వ సంస్థలను అపకీర్తిపాలు చేయడం, తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేయడం కోసం అసత్య, అభ్యంతరకర, రెచ్చగొట్టే సోషల్ మీడియా కంటెంట్‌ను మీరు ప్రచారం చేసినట్లు గుర్తించాం" అని పేర్కొంది. విచారణకు సహకరించకుండా హాజరు కాకపోతే, మీ తరఫున చెప్పేందుకు లేదా సమర్థించుకునేందుకు ఎలాంటి వివరణ లేదని భావిస్తామని కూడా హెచ్చరించింది. తన ఇంటర్వ్యూలో నోరీన్ నియాజీ, పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం గత ఏడాది నాలుగురోజుల పాటు కొనసాగిన భారత్-పాకిస్తాన్ సైనిక ఘర్షణలో పాకిస్తాన్ సైన్యం ఇచ్చిన ప్రతిస్పందనను తక్కువ చేసి మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు చూపకుండా, పాకిస్తాన్ ఇజ్రాయెల్‌ను గుర్తించే దిశగా అడుగులు వేస్తుండటంతోనే భారత్ ఘర్షణను మరింత తీవ్రతరం చేయలేదని, అలాగే పాకిస్తాన్‌ను అబ్రహాం ఒప్పందాల్లో భాగస్వామిగా చేర్చేందుకు ఈ పరిణామాలను ఉపయోగించారని ఆరోపించారు.



## ఇరాన్‌లో ముదురుతున్న అంతర్గత సంక్షోభం

### అధ్యక్షుడు, విదేశాంగ మంత్రులపై పెరుగుతున్న అసమ్మతి

**టెహ్రాన్,జులై 19:** అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్‌లో అంతర్గత రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. దేశంలో అంతర్గత సంక్షోభం ముదురుతోంది. దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. అమెరికాతో చర్చలు జరిపి ఒప్పందానికి రావడం ద్వారా ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థను బలహీనపర్చే సాఫ్ట్ తఖ్తాపలట్‌కు పాల్పడుతున్నారని ఇరాన్‌లోని కట్టర పంథీయ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల సందర్భంగా మరింత బలంగా వినిపించాయి. అంత్యక్రియలలో పాల్గొన్న కట్టరపంథీయ మద్దతుదారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఖమేనీ పార్థివదేహం వెంట నడుస్తున్న సమయంలో అమెరికాతో రాజీ పడినవారికి మరణమే శిక్ష అంటూ నినాదాలు చేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అంతేకాకుండా విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చిపై కొందరు రాళ్ల విసిరి, ఆయనను దేశద్రోహి అంటూ విమర్శించినట్లు సమాచారం. మరోవైపు ఇరాన్‌కు చెందిన మతగాయకుడు మొహమ్మద్ అలీ బఖ్షీ ఓ కార్యక్రమంలో అధ్యక్షుడిని ఉద్దేశించి తీవ్ర హెచ్చరికలు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. సుప్రీంలీడర్ సూచనలు అమలు కాకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకోవాల్సిన ప్రభుత్వం, దానికి బదులుగా అమెరికాతో రాజీ మార్గాన్ని ఎంచుకుందని వారు ఆరోపిస్తున్నారు. ఈ నిర్ణయాలు కొత్త సుప్రీం లీడర్ అభిప్రాయానికి విరుద్ధంగా తీసుకున్నవేనని అంటున్నారు. పార్లమెంట్‌ను పక్కనపెట్టి కీలక నిర్ణయాలు తీసుకోవడం, సుప్రీం లీడర్ ఆదేశాలను పట్టించుకోకుండా అమెరికాతో చర్చలు జరపడం, మద్దతుదారుల ర్యాలీలను అడ్డుకునే ప్రయత్నం చేయడం వంటి ఆరోపణలు కూడా చేస్తున్నారు. ఇరాన్ పార్లమెంట్ సభ్యుడు మహ్మూద్ నబావియన్ కూడా సోషల్ మీడియా వేదికగా దేశంలో తిరుగుబాటు జరుగుతోందా అంటూ ప్రశ్నిస్తూ పోస్టులు చేయడం రాజకీయ చర్చకు దారితీసింది. ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకునే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన ప్రకటించారు.

# హరీశ్‌రావు రోజుకు 100 అబద్ధాలు ఆడతాడు

## ప్రభుత్వ విప్ విజయ రమణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై19:** హరీష్ రావు రోజుకు 100 అబద్దాలు ఆడుతాడని, రేవంత్ రెడ్డి వల్లనే కరువు వచ్చిందని ఆయన అబద్దాలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ విజయరమణా రావు మండిపడ్డారు. ఆదివారం సిఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత మూడేళ్ల నుంచి పంటలు బాగా పండాయని, రికార్డు స్థాయిలో పంటల దిగుబడులు వస్తున్నాయి. రైతుల్లో సీఎం రేవంత్ రెడ్డి పైన విషం నింపాలని హరీష్ రావు ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. కేటీఆర్‌ను మించి పోవాలని హరీష్ రావు ఉద్దేశపూర్వకంగా రేవంత్ రెడ్డి పైన విమర్శలు చేస్తున్నాడని, కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని. విజయరమణా రావు విమర్శించారు. నీళ్లు నిల్వ ఉంచరాదని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని, దాన్నే తమ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఎల్ నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, వరకు బదులు ఆరు తడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం రైతులకు చెపుతోంది, రైతులకు నష్టం జరగొద్దని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని విజయరమణా రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పైన బురద జల్లే ప్రయత్నాలు హరీష్ రావు మానుకోవాలని ఆయన హితవు పలికారు. కేసీఆర్ హయాంలో పదేళ్లు కరువే రాలేదని పనికి పాలిన కబుర్లు చెపుతున్నాడని,బీఆర్ఎస్ హయాంలో 2014, 2015, 2019 సంవత్సరాల్లో వర్షాలు లేక వ్యవసాయం, తాగునీటి కి తీవ్ర సమస్యలు వచ్చాయని చెప్పారు. వరి వేస్తే ఉరే అన్నది. ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేసింది. రైతులకు ఎరువులు. ఉచితంగా ఇస్తానని కబుర్లు చెప్పి మోసం చేసింది. రైతు బందు ఒక్కటే ఇచ్చి అన్ని రకాల సబ్సిడీలు ఎత్తివేసింది కేసీఆర్ అని ఆయన ఆరోపించారు. చెట్లు, పుట్టలు, సినిమా థియేటర్లు, చివరకు రోడ్లకు కూడా రైతు బంధు ఇచ్చి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసింది, రైతులను సర్వనాశనం చేసిన చరిత్ర కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.2లక్షల రుణమాఫీచేసింది కాంగ్రెస్ ప్రభుత్వం, వరి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇచ్చింది,మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేశామన్నారు.ఎల్‌నినో ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉంది వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం రైతులకు చెబుతోందన్నారు.

# కురులు వేగంగా పెరగాలా?



పుట్టుకుచ్చులా అందంగా, పొడవుగా ఉండే కురులు.. వద్దనుకునే యువతులెవరైనా ఉంటారా.. అస్సలుండరు. అమ్మాయి ఉంటుందా? కానీ ఈ కాలుష్యానికి ఊడటమే కానీ పెరగడం ఎక్కడుంది? ఈ చిన్న చిట్కాలను పాటించండి. వేగంగా పెరుగుతాయి అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దామా?

★ తల ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ దాన్ని శుభ్రం చేయడం తప్పని సరి. కానీ ఆరబెట్టడమే పెద్ద పని. అందుకే చాలామంది డ్రైయ్యర్‌ని వాడుతుంటారు. కానీ దాని వేడి కురుల పెరుగుదలను అడ్డుకుంటుందని తెలుసా? స్టైలింగ్, స్టైలింగ్, స్ట్రెయిట్‌నింగ్ కోసం వాడేవే కాదు.. ఎండలో అతిగా తిరగడం, జడను లాగివేయడం, తువాలుతో తడిపోవాలని కొట్టడం వంటివీ చేటు చేసేవే. వీటికి దూరంగా ఉండండి. ★ కండిషనర్ వెంట్రుకలకు బాగా పడుతుంది. ఇప్పుడైతే చిక్కులు బాగా వస్తాయి. అని తడి తలమీద దువ్వెన ఉపయోగిస్తున్నారా? మేలు చేయడం మాట అటుంచితే కుదుళ్లకు హాని. ఫలితమే కురులు రాలడం. కాబట్టి, తడి వెంట్రుకలు ఆరేవరకూ ఆగండి. తరవాతే దువ్వండి. ★ ఒకప్పుడు సమస్యేదైనా నిపుణులను సంప్రదించేవారు. మరి ఇప్పుడు? అరచేతిలోనే సమాచారం. దాని సలహాతో ఇష్టారీతిన సప్లిమెంట్లను వాడేస్తున్నారు. మీదీ అదే ధోరణా? ఇవి మేలు చేయకపోగా చేటు చేస్తాయి. వాటి ప్రభావం తొలుత పడేది చర్మం, కురులపైనే! నిపుణుల సలహా లేనిదే వాడకపోవడమే మేలు. ★త్వరగా పెరగవు అని చాలామంది కురులను కత్తిరించడానికి వెనకాడతారు. కానీ రెండు నెలలకో సారైనా ట్రిమ్ చేసుకోవాలి. చిట్లడం, చివర్లు పొడిబారడం కూడా కురుల పెరుగుదలకు అవరోధంగా మారతాయి. కాబట్టి, వాటిని తొలగించడం తప్పనిసరి. ★ జిడ్డు, సమయం లేదని బద్ధకించక వారానికి రెండుసార్లు గోరువెచ్చని నూనెతో తలకు మర్దనా చేయండి. మాడుకి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. అలాగే కండిషనర్ వాడకం కూడా తప్పనిసరి. ఇది వాతావరణ పరిస్థితుల నుంచి కురులకు సంరక్షిస్తుంది. ★ దిండు కూడా కేశాల పెరుగుదలపై ప్రభావం చూపుతుందని తెలుసా? సరైన గలేబులను వాడకపోతే అవి కురుల్లోనే సహజ నూనెలను పీల్చేయడమే కాదు, రాపిడికి గురిచేసి వెంట్రుకలు తెగేలానూ చేయగలవు. కాబట్టి, శాటిన్ రకాలనే ఎంచుకోండి.

చిన్నవే కదూ.. అందమైన, ఆరోగ్యకరమైన కురుల కోసం పాటించండి మరి. □

## పత్రిక చదువుతున్నారా.. !

ఈ దేశం ఎటు పోతోందో తెలుసా? మీ ఊర్లో ప్రగతి ఏ మేరకు జరుగుతోందో ఎప్పుడైనా కన్నారా? మీ పల్లెటూర్లో పంటలేవి పండుతున్నాయో తెలుసుకున్నారా? అవన్నీ తెలుసు కోవాలంటే ఒక వార్తా సమాచార పత్రిక పొద్దుటే మీ చేతిలోకొచ్చి చేరాలి. పేపర్ చదవడం వల్ల ఎన్ని లాభాలు న్నాయో తెలుసా? ఉదయాన్నే చల్ల గాలికి వేడివేడి టీ లేదా కాఫీ



తాగుతూ కుర్చీలో కూర్చొని, పేపర్ చదువుతోంటే ఆ ఫీలింగే వేరు కదా! ఒక్కో పేజీ తెరుస్తూ ఆ బ్రాడ్‌షీట్ లే అవుట్, అందులో ఉండే ఫొటోలూ, పదాలూ, హెడ్‌లైన్లూ చూస్తూ ఉంటే ఆ అను భూతి వేరు. తరవాతి పేజీలో ఏ ముంటుందో అనే సస్పెన్స్.. మనలో మరింత ఉత్సా హాన్ని పెంచుతుంది. ఉదయాన్నే మనం పేపర్ చదువుతున్నప్పుడు దాన్నుంచి వచ్చే చప్పుడు పక్షి రెక్కలతో చేసే శబ్దంలానూ అనిపిస్తుం టుంది. ఒక రకంగా చెప్పా లంటే ప్రశాంతంగా కూర్చుని సామచా రాన్నీ, విజ్ఞానాన్నీ తెలుసు కునే ప్రక్రియే ఈ పేపర్ రీడింగ్. ఈ భావనలన్నీ మామూలుగా మొబైల్‌లో న్యూస్‌ను స్క్రోల్ చేసుకుంటూ వెళ్తే రావు కదా! ప్రతి పేజీలో వ్యక్తుల విజయగాథలూ, స్థానికంగా జరిగే కార్యక్రమాల నుంచి జాతీయ, అంతర్జాతీయ వార్తలూ, క్రీడావిజయాలూ.. ఇలా ఎన్నో రకాల అంశాల కలబోతే పత్రిక. పైగా దీనికి నో ఛార్జింగ్.. నో బఫరింగ్.. అన్నమాట కేవలం మనం మనముందున్న సామచారాన్ని హాయిగా, అలా చదువుకుంటూ వెళ్లడమే? ఇదొక రకమైన విలాసం సరి.. ఆలోచించండి.! □

## పని చేయాలనిపించడం లేదా?



ఒక బృందం ప్రాజెక్ట్ మీద పని చేస్తోందంటే దానికి సంబంధించిన ప్రతి విషయం, ప్రతి అప్‌డేట్ ఆ గ్రూప్‌లో ఉన్న అందరికీ తెలిస్తేనే కలిసికట్టుగా ముందుకెళ్లగలం.. అనుకున్న సమయానికి చక్కటి అవుట్‌పుట్‌ని కంపెనీకి సమర్పించవచ్చు. అయితే బాగా పనిచేసే వాళ్లపై ఇతర కొలీగ్స్‌కి ఉండే అసూయ, సహోద్యోగుల మధ్య కమ్యూనికేషన్ లోపం, గ్రూపిజం.. వంటి అంశాలు పని వాతావరణాన్ని దెబ్బతీస్తుం టాయి. లాంటి చోట మీరు పని చేస్తున్నా, చక్కటి నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నా మిమ్మల్ని వేరు చేసి చూడడం, పనికి సంబంధించి మీకు ఎలాంటి అప్‌డేట్ చెప్పక పోవడం..వంటి అంశాలు మీ వ్యక్తిగత పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇది క్రమంగా మీ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కెరీర్ ఉన్నతికి గండి పడ్డటే! కాబట్టి ఇలాంటి వాతావరణంలో పనిచేస్తున్న ప్పుడు మీ వెనక జరిగే గ్రూపిజం, ఆఫీస్ రాజకీయాల గురించి మీ తీరు గురించి ముందుగా పై అధికారులకు తెలియప్పం. బాస్ కూడా జరుగుతున్న విషయాలను నమ్మకపోతే కంపెనీలోని వేరే విభాగానికి మారడం మంచిది. ఎంత చేసినా బూడిదలో పోసిన పన్నీరే!.. వచ్చిన ఉద్యోగం వచ్చింది. ఇక నా పనితనమేంటో చూపిస్తా.. అంటూఎంతో ఉత్సాహంగా తాము కోరుకున్న జాబ్‌లో జాయినవు తుంటారు చాలా మంది. అయితే అక్కడికెళ్లి కొన్నాళ్ల పాటు ఉద్యోగం చేస్తేగానీ తెలియదు ఆ కంపెనీ పని వాతావరణం గురించి! ఈ క్రమంలో ఎంత పని చేసినా సరైన ప్రోత్సాహకాలు లేక పోవడం, కొన్ని కంపెనీల్లోనైతే పనిచేసే వారికంటే చేయని వారికే అధిక ప్రాధాన్య మిస్తూ వారికే పై అధికారుల నుంచి ప్రోత్సాహం లభించడం.. వంటివి కూడా జరుగుతుంటాయి. అయితే ఇలాంటి వాతావరణం ప్రత్యక్షంగా మనం చేసే పనిపైన కూడా ప్రతికూల ప్రభావం చూపు తుంటుంది. నెగిటెవ్ ఫిలింగ్ రాకుండా చూసుకోండి. అలాంటి చోట పని చేయలేమని అర్థం. అందుకే అక్కడే రోజులు గడిపేయడం కాకుండా సత్వరమే వేరే ఉద్యోగంలోకి మారి పోవడం మంచి నిర్ణయం ఎక్కడైనా కష్టపడడమే. చేసే ఉద్యోగమేదైనా సరే.. మనకు అప్పగించిన పనికే పరిమితం కాకుండా.. ఫలానా పనిని నేను చేయగలను అన్న ఆత్మవిశ్వాసంతో, యాక్టివ్‌గా ఆ పనిని స్వీకరించాలి. ఈ క్రమంలో మీలోని సృజనాత్మకతను చాటు కుంటే మరి మంచిది అయితే ఈ చురుకు దనం ఒక్కోసారి మన తలపై భారంగా మారే అవకాశాలూ లేకపోలేదు. ఎలాగూ ఈ అమ్మాయి యాక్టివ్‌గా పనిచేస్తుంది కదా అని కొంతమంది అధికారులు సహో ద్యోగుల పనిని కూడా వారి నెత్తినేస్తుంటారు. అనవసర ఒత్తిడిని కొని తేచ్చుకోరాదు. తద్వారా మీరు చేసే పనిలో నాణ్యత లోపిస్తుంది. కొలీగ్ రానప్పుడు అత్యవసరంగా చేయాల్సి న పనో, ఏవైనా అరుదైన సందర్భాల్లో అదనపు పనిని తీసుకోవడంలో తప్పులేదు. అంతేకానీ.. అదే నిత్యకృత్యం అయితే నిర్మొహమాటంగా చేయలేని చెప్పడంలో బెరుకు చూపవద్దు. ఎంత చెప్పినా వినకుండా మీపై ఒత్తిడి తెస్తే మాత్రం ఆ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పడమే మంచిదని చెబుతున్నారు నిపుణులు. సహోద్యోగులపై చేసే చెడు ప్రచారాలు, పనిచేసే చోట లైంగిక వేధింపులు సెలవు తీసుకున్నా పనిచేయాల్సి రావడం, పై అధికారుల ప్రోత్సా హం కరువవడం.. వంటివి కూడా అటు పని వాతావరణాన్ని, ఇటు ఉద్యోగుల కెరీర్ ఉన్నతిని దెబ్బతీస్తాయి. అందుకే ఇలాంటి విషపూరిత వాతావరణానికి టాటా చెప్పి.. కొంచెం లేటైనా సరే సౌకర్యవంతంగా, మనసుకు కష్టమనిపించిన చోట ప్రశాంతంగా పనిచేయడం కష్టం అందుకే గౌరవమున్నచోట మాత్రమే పనిచేయండి. □

## 'యమాదిత్యుడు'

కాశీ క్షేత్రంలో పన్నెండు మంది ఆదిత్యులు పన్నెండు పేర్లతో పిలవబడుతూ వుంటారు. ఒక్కో ఆదిత్యుడి ప్రతిష్ఠ వెనుక ఒక ఆసక్తికరమైన కథనం ఇక్కడ వినిపిస్తూ ఉంటుంది. అలా 12 మంది ఆదిత్యులలో 'యమాదిత్యుడు' ఒకరుగా కనిపిస్తాడు. ఇక్కడి సూర్య భగవానుడిని సాక్షాత్తు యమధర్మ రాజు ప్రతిష్ఠించడం వలన'యమాదిత్యుడు' అనే పేరు వచ్చిందని అంటారు. పూర్వం యమధర్మరాజు .. సూర్యభగవానుడి భక్తుల జోలికి పోవద్దని తన భటులతో చెప్పాడట. అయితే ఆ మాటలు వినిపంచుకోకుండా సత్రాజిత్తు దగ్గరికి వెళ్లిన యమభటులు .. సూర్యభగవానుడి ఆగ్రహానికి గురవుతారు. దాంతో తమవారి అపరాధాన్ని మన్నించమని కోరుతూ యమధర్మరాజు కాశీ క్షేత్రంలో సూర్యభగవానుడి మూర్తిని ప్రతిష్ఠించి



సూర్యోపాసన చేశాడట. అలా ఆయన ఆ స్వామి అనుగ్రహాన్ని పొందాడని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. కాశీ క్షేత్రంలోని గంగానదిలో స్నానం చేసి .. ఇక్కడి యమాదిత్యుడి దర్శనం చేసుకున్న వారికి, యమ యాతనలు .. యమలోక బాధలు ఉండవని పురాణాలు చెబుతున్నాయి. □

## కాఫీ, టీలకూ పరిమితి ఉంది!



**కాఫీ, టీ మంచిది కాదనే మాట అనేకసార్లు వింటుంటాం కదూ! అయితే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెనర్చ్ (ఐసిఎంఆర్) తాజాగా విడుదల చేసిన ఆరోగ్యసూత్రాలు ఇలా ఉన్నాయి.**

✦ చాయ్ కానీ కాఫీ కానీ అదే మానేయ మనడం లేదు. కాకపోతే భోజన సమయంలో మంచిది కాదు. గంట ముందు లేదా తర్వాత తాగండి. కొందరు ఆహారం తీసుకునేటప్పుడు కాఫీ, టీలు తాగితే త్వరగా అరుగుతుందని, శరీరంలో పేరుకున్ననూనెను కరిగించేస్తుందని అనుకుంటారు అన్ని నిజం కాదు.

✦ అయితే కాఫీలో ఉండే టన్నిన్స్ ఐరన్స్ గ్రహించడగంలో తోడ్పడుతుంది. కనుక ఐరన్ లోపం ఏర్పడకుండా ఉంటుంది. ఎనీమియా రాదు. అయితే కాఫీ, టీల్లో కెఫిన్ ఉంటుంది కనుకస అది మోతాదు మించిన కొద్దీ మానసిక రుగ్మతలతో సహా అనేక అనారోగ్యాలువచ్చే అవకా శం ఉంది. ✦ పరగడుపున కాఫీ తాగడం చాలామందికి అలవాటు ఇది మంచిది కాదు, ఏమైనా తిన్న తర్వాతే తాగాలి. □

## గ్లాసుల కోసం..



వంట చేసిన పాత్రల న్నింటి నీ సింకులో వేసి, డిష్‌వాషర్‌తో తోమి శుభ్రం చేస్తాం. గ్లాసు లు, బాటిళ్ల విషయానికొస్తే వాటిని తోమాల్సి న అవసరం ఉండదు. కేవలం నీళ్లతో శుభ్రం చేస్తే చాలు. అందుకోసం ప్రత్యేకంగా తయారుచేసిన పరికరమే గ్లాస్ రిన్సర్ పరికరం. దీన్ని సింకు పక్కనే అమర్చుకో వచ్చు. గుండ్రంగా, వెడల్పుగా ఉండే ఈ పరికరంపై గ్లాసును ఉంచి ఒత్తితే చాలు. నీళ్లు వేగంగా వచ్చి గ్లాసు లోపలి భాగాల్ని శుభ్రం చేస్తాయి. ఇది కేవలం గ్లాసుల కోసమే కాదు.. బాటిళ్లు, సీసాల మూతలు శుభ్రం చేయడానికీ ఉపయోగపడుతుంది. □

తెర

# 'కామ్రేడ్ కల్యాణ్' నుంచి సాంగ్ రిలీజ్



టైటిల్ గ్లింప్స్, తొలి పాటతో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన 'కామ్రేడ్ కల్యాణ్' చిత్ర బృందం ఇప్పుడు రెండో పాట 'ఇంత ఇష్టమా'ను విడుదల చేసింది. శ్రీవిష్ణు, మహిమా నంబియార్ జంటగా నటిస్తున్న ఈ పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. కోన వెంకట్ సమర్పణలో, వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ లవ్ మెలోడీ హీరో చూపించే నిస్వార్థమైన ప్రేమ, ఆప్యాయతకు హీరోయిన్ మెస్మరైజ్ అయ్యి అతనిపై ప్రేమను పెంచుకునే భావోద్వేగాలను అందంగా చూపించారు. భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యం ఈ లవ్ సాంగ్ మరింత అందాన్ని తీసుకురాగా, రామ్ మిర్యాల, లిప్సిక వోకల్స్‌తో పాటకు ప్రాణం పోశారు. శ్రీవిష్ణు, మహిమా నంబియార్‌ల మధ్య కెమిస్ట్రీ, ఆకట్టుకునే విజువల్స్ ఈ పాటను మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. 1992 నాటి ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతున్న 'కామ్రేడ్ కల్యాణ్' యాక్షన్, భావోద్వేగాలు, ఆకట్టుకునే ప్రేమకథ కలగలిపిన చిత్రంగా రూపొందుతోంది. ఈ రెండో పాటలో లీడ్ పెయిర్ మధ్య చిగురించే ప్రేమను, సరిహద్దులను దాటే అమాయకమైన అనుబంధాన్ని అందంగా చూపించారు. ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కామ్రేడ్ కల్యాణ్' విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు.





# '418' జూలై 31న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్

మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక హారర్ థ్రిల్లర్ '418' విడుదలకు సిద్ధమైంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశలో ఉన్న ఈ చిత్రాన్ని జులై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి కీర్తన్ నడగౌడ కథ, దర్శకత్వం వహించారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న '418', హారర్ త్రిల్లర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆరంభం నుంచి చివరి వరకు ప్రేక్షకులను సీట్ల అంచున కూర్చోబెట్టేలా సరికొత్త హారర్ అనుభూతిని అందించబోతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతుండగా, విడుదలకు మరో రెండు వారాల సమయం ఉండడంతో త్వరలోనే ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయబోతున్నారు. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో, త్వరలోనే ఈ సినిమా నుంచి వరుస అప్డేట్స్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలియజేశారు.

# 'చెన్నై లవ్ స్టోరీ' ట్రైలర్ రిలీజ్



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫొటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా "చెన్నై లవ్ స్టోరీ". ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టార్ ప్రొడ్యూసర్స్ అల్లు అరవింద్, మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్ అతిథులుగా పాల్గొన్నారు. అల్లు అరవింద్ చేతుల మీదుగా సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ రవిశంకర్ బర్త్ డే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆగస్టు 15న 'ఖడ్గం' రీ రిలీజ్



శ్రీకాంత్, రవితేజ, ప్రకాశ్ రాజ్ ముఖ్య పాత్రల్లో కృష్ణవంశీ దర్శకత్వంలో సుంకర మధుమురళి నిర్మాతగా వచ్చిన సూపర్ హిట్ సినిమా ఖడ్గం. ఖడ్గం సినిమా 2002లో విడుదలై భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. లవ్, కామెడీ, దేశం ఎమోషన్, సినిమా ఎమోషన్.. ఇలా అన్ని రకాల ఎమోషన్స్ కలిపి మల్టీ జానర్లో ఈ సినిమాని అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు కృష్ణవంశీ. ఇప్పటికి టీవీల్లో ఇండిపెండెన్స్ డే, రిపబ్లిక్ డేలలో ఈ సినిమాని వేస్తారు. ఇక ఈ సినిమా సాంగ్స్ కూడా ఇప్పుడు విన్నా అద్భుతంగా ఉంటాయి. దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతం అందించాడు, ఇలాంటి మంచి సినిమాని ఇప్పుడు రీ రిలీజ్ చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఖడ్గం మరోసారి థియేటర్స్‌లో విడుదల కానుంది, పాప్ కార్న్ ప్రొడక్షన్స్‌లో దేవరపల్లి రేవంత్ సమర్పణలో విష్ణుమొలకల నక్షత్ర నిర్మాతగా కృష్ణ వడిగేపల్లి, కాకర్లమూడి రామకృష్ణ సహ నిర్మాతగా ఖడ్గం చిత్రం మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

# 'హే చికీతా' ప్రి రిలీజ్ ఈవెంట్




అమరావతి మూవీ మేకర్స్, సుందరకాండ మోషన్ పిక్చర్స్ బ్యానర్ల మీద ఎన్. అశోక ఆర్ఎన్ఎస్, 'గరుడవేగ' అంజి నిర్మించిన చిత్రం 'హే చికీతా'. అభినవ్ మణికంఠ, దివిజ ప్రభాకర్, తన్మయ్ ఖుషి, దేవి ప్రసాద్, ఈటీవీ ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీని ధనరాజ్ లెక్కల తెరకెక్కించారు. ఈ సినిమాని జూలై 24న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఈ మూవీ నుంచి ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్, సాంగ్స్ ఇలా అన్నీ కూడా ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేశాయి. శుక్రవారం నాడు ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చదలవాడ శ్రీనివాసరావు, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, రామ్ లక్ష్మణ్ మాస్టర్స్, కమెడియన్ అలీ, వీఎన్ ఆదిత్య, ప్రసన్న కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో.. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ "నేను యంగ్ ఏజ్‌లో ఉన్నప్పుడు 'లైలా' మూవీని చేశాను. ఆడియో రైట్స్‌తోనే ఎంతో లాభం వచ్చింది. 'హే చికీతా' టీంని చూస్తే నాకు పాత రోజులు గుర్తుకు వచ్చాయి. ఎన్నో జన్మల పుణ్యం చేస్తే గానీ నిర్మాతగానో, ఆర్టిస్టుగానో, టెక్నీషియన్ గానో ఇండస్ట్రీలోకి రాలేం" అన్నారు. కమెడియన్ అలీ మాట్లాడుతూ.. 'బద్రి' సినిమాలోని 'హే చికీతా' పాట ఎంత పెద్ద హిట్ అయిందో ఈ సినిమా కూడా అంతే హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అన్నారు. వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ..'హే చికీతా' ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. చదలవాడ శ్రీనివాసరావు నిర్ణయం వల్ల మా దర్శకుల సంఘం నుంచి సినిమాలు రాబోతోన్నాయి' అన్నారు. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. 'చదలవాడ శ్రీనివాసరావు చేస్తున్న మంచి పనుల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఆయన ఇక్కడకు వచ్చిన ఈ చిత్రయూనిట్‌ను అభినందిస్తుండటం ఆనందంగా ఉంది. 'హే చికీతా' టైటిల్ బాగుంది. థియేటర్లు నిండటం సహజం. కానీ ఈ రోజు ఇక్కడ స్టేజ్ నిండిపోయింది' అన్నారు. రామ్ లక్ష్మణ్ మాస్టర్స్ మాట్లాడుతూ "పల్లెటూరులో చాలా ప్రేమ కథలుంటాయి. 'హే చికీతా' పోస్టర్‌ని చూస్తే మా ఊర్లో ఉన్న రోజులు గుర్తుకు వచ్చాయి' అన్నారు. జి. నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. 'హే చికీతా' మూవీని ఆల్రెడీ చూశాను. ఫస్ట్ హాఫ్ అంతా నవ్వుతారు. సెకండాఫ్ అంతా ఎమోషనల్‌గా ఉంటుంది. క్లైమాక్స్ చూసి కంటతడి పెట్టుకుంటారు" అన్నారు. నిర్మాతఎన్. అశోక ఆర్ఎన్ఎస్ మాట్లాడుతూ. 'హే చికీత' కోసం వచ్చిన గెస్టులందరికీ థాంక్స్. ధన్ రాజ్ చెప్పిన కథ నాకెంతో నచ్చింది. అంజి గారితో చాలా మంచి సినిమా చేశాను" అన్నారు.
నటి తన్మయ్ ఖుషి మాట్లాడుతూ.. 'హే చికీతా'లో నేను పొట్టి అనే పాత్రను పోషించాను. బావను పిచ్చిగా ప్రేమించే ఈ పాత్రను అందరూ ప్రేమిస్తారు. నా కారెక్టర్‌తో ప్రతీ ఒక్కరూ కనెక్ట్ అవుతారు. నాకు మంచి పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. జూలై 24న ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాను" అన్నారు.
చరణ్ అర్జున్ మాట్లాడుతూ..'హే చికీతా' సినిమాలో అద్భుతమైన సాహిత్యం అందించిన లిరిసిస్ట్స్‌కి థాంక్స్. ఈ మూవీ క్రెడిట్ అంతా దర్శకుడిదే. ధన్ రాజ్ అద్భుతమైన కథను రాసుకున్నారు" అన్నారు.

# జపాన్‌లో మెరిసిన మన బంగారం



ఒలింపిక్స్ డబుల్ మెడలిస్ట్ పీవీ సింధు ఖాతాలో ఈ రెండేళ్లలో ఒక్క టైటిల్ లేదు. ఆ మాటకొస్తే 2019 వరల్డ్ ఛాంపియన్‌షిప్ గోల్డ్, 2020 టోక్యో ఒలింపిక్స్ బ్రాంజ్‌మెడల్ తప్పిస్తే ఆ తర్వాత పెద్ద విజయాలు లేవు. 2024లో సొంతగడ్డపై సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిలే చివరిది. దీంతో సింధు ఖేల్ ఖతమ్, ఇక రిటైర్మెంట్ చెప్పడమే ఆలస్యం అన్న సన్నాయి నొక్కులు బలంగానే వినబడ్డాయి. పదే పదే గాయాలు, ఆధునిక ఆటలో వస్తున్న కఠినమైన మార్పులు, అనామక ప్లేయర్ల చేతుల్లోనూ ఓటములు, రెండేళ్లుగా కొనసాగుతున్న టైటిల్ కరువు వంటి కారణాల వల్ల తన అత్యుత్తమ ఫామ్ తిరిగి పొందుతుందా? టైటిళ్లను గెలుచుకునే సత్తా ఆమెకు ఉందా? అన్న సందేహాలకు ఒక్క జపాన్ ఓపెన్ టైటిల్‌తో సింధు చెక్ పెట్టింది.

* ఫైనల్లో యమగుచిపై విజయం
* తొలి భారత్ షట్లర్‌గా రికార్డు
* ఆనమ్మకమే గెలిపించింది-సింధు

**టోక్యో, జులై 19:** భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఆట తిరిగి గాడిలో పడింది. రెండేళ్లుగా టైటిల్‌కు ముఖం వాచిన సింధూ ఎట్టకేలకు ఆ కొరతను తీర్చుకుంది. జపాన్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించిన తొలి సారే టైటిల్ అందుకుని అరుదైన రికార్డు అందుకుంది. మహిళల సింగిల్స్ ఫైనల్లో జపాన్‌కు చెందిన ప్రపంచ నంబర్-3 అకానె యమగుచిపై 21-17, 21-17 తేడాతో వరుస సెట్లలో ఓడించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీ నెగ్గిన తొలి భారత షట్లర్‌గా నిలిచింది. 2019 ప్రపంచ ఛాంపియన్ షిప్ తర్వాత సింధుకు ఇదే అతిపెద్ద టైటిల్.

### కచ్చితమైన స్మాష్‌లతో...

ఆదివారం టోక్యో మెట్రోపాలిటన్ జిమ్నాసియంలో జరిగిన ఫైనల్లో 31 ఏళ్ల పీవీ సింధు అద్భుత ప్రదర్శన కొనసాగించింది. సొంత మైదానం, సొంత అభిమానుల మధ్య ఆడుతున్న యమగుచిపై ఆరంభం నుంచే సింధూ ఆధిక్యం ప్రదర్శించింది. వేగవంతమైన క్రాస్‌కోర్ట్ డ్రాప్‌లు, కచ్చితమైన స్మాష్‌లతో విరుచుకుపడింది. యమగుచి లయను నిరంతరం దెబ్బతీసింది. కీలకసమయంలో ఒత్తిడిని జయిస్తూ సింధు మొదటి గేమ్‌ను 21-17 తేడాతో కైవసం చేసుకుంది. తొలి గేమ్ నెగ్గిన ఊపులో రెండవ గేమ్‌లో సింధు తన దూకుడును మరింత పెంచింది. దీంతో ఒత్తిడికి లోనైన యమగుచి అనవసర తప్పిదాలు చేసింది. టోక్యో ప్రేక్షకుల మద్దతుతో యమగుచి గేమ్ చివరిలో ఉత్సాహంగా పుంజుకున్నప్పటికీ, సింధు చలించకుండా నిలిచింది. తన ఐకానిక్ 2019 ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రదర్శనను ప్రతిబింబించే వ్యూహాత్మక క్రమశిక్షణతో సింధు రెండో గేమ్‌ను 21-17 తేడాతో ముగించి చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో ఒకుహర వాకోవర్ ఇవ్వడం, సెమీస్‌లో యుఫేయ్ మధ్యలోనే నిష్క్రమించడంతో తాను ఫైనల్‌కు తేలికగా రాలేదని ఈ తుదిపోరుతో నిరూపించింది. సింధు తన చివరి టైటిల్‌ను 2024లో సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్‌లో గెలుచుకుంది. రెండేళ్ల టైటిల్ విరామానికి జపాన్ టోర్నీతో ఫుల్‌స్టాప్ పెట్టింది. వచ్చే నెలలో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటడంపై దృష్టి సారించింది.

### కష్టకాలంలోనూ నమ్మకం కోల్పోలేదు-సింధు

టైటిల్ అందుకున్న పీవీ సింధు భావోద్వేగానికి గురైంది. కష్టకాలంలో కూడా తనపై నమ్మకం కోల్పోలేదని.. తాను టైటిల్ సాధించగలన్న ఎపుడూ విశ్వసించానని, ఆ నమ్మకమే తన విజయానికి కారణమైందని వెల్లడించింది. అటాకింగ్ గేమ్ నా బలం. ఇప్పుడు కోర్టులో స్వేచ్ఛగా కదులుతూ దూకుడుగా ఆడగలుగుతున్నాను. అనవసర తప్పిదాలను తగ్గించగలిగితే మ్యాచ్‌పై పూర్తి నియంత్రణ సాధించవచ్చు. అదే ఈ టోర్నీలో నాకు కలిసొచ్చింది అని సింధు వివరించింది.

వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇదే జోరును కొనసాగించి రికార్డు స్థాయిలో ఆరో పతకాన్ని సాధించడమే తన లక్ష్యమని సింధు స్పష్టం చేసింది. జపాన్ ఓపెన్ గెలుపు ఎంతో ప్రత్యేక మైందని, చాలా కాలంగా దీని కోసమే కష్టపడుతున్నానని, గెలిచిన వెంటనే తన కళ్లలో ఆనందభాష్పాలు వచ్చాయని వెల్లడించింది. ఈ ప్రయాణంలో తనకు తోడున్న కోచ్‌లకు, వెన్నంటే ఉన్న తల్లిదండ్రులు, భర్త, అత్తమామలకు సింధు కృతజ్ఞతలు తెలిపింది.

# ఫ్రాన్స్ చిత్తు: మూడో స్థానంలో ఇంగ్లాండ్




**న్యూయార్క్, జులై 19:** ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ చేరడంలో విఫలమైన ఇంగ్లాండ్ మూడోస్థానం పోరులో అదరగొట్టింది. గోల్స్ వర్షం కురిసిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌ను 6-4 తేడాతో ఓడించి మూడో స్థానం పొందింది. ఈ మ్యాచ్‌లో మొత్తం10గోల్స్ నమోదయ్యాయి. ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌లో ఇన్ని గోల్స్ నమోదుకావడం కూడా ఇదే మొదటిసారి. 1966లో విజేతగా నిలిచిన ఇంగ్లాండ్‌కు... ఈసారి బ్రాంజ్ మెడల్ దక్కింది.

ఫుట్‌బాల్ దిగ్గజాలు ఫ్రాన్స్, ఇంగ్లాండ్ మ్యాచ్ ఉత్కంఠ రేపుతోందని ఆశించినా చివరకు ఏకపక్షంగా ముగిసింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఇంగ్లాండ్ ఆధిక్యం ప్రదర్శించింది. తొలి అర్ధభాగంలోనే ఏకంగా నాలుగు గోల్స్ నమోదుచేసింది. మూడో నిమిషంలోనే డెక్లాన్ రైస్ గోల్ కొట్టి ఇంగ్లాండ్ గోల్స్ బోణీ చేశాడు. ఆ తర్వాత 18వ నిమిషంలో ఎజ్రి కొన్సా గోల్ చేసి 2-0 ఆధిక్యం అందించాడు. ఇక 37వ నిమిషంలో, ఇంజ్యూరీ టైమ్ 45+1 నిమిషంలో బుకాయో సకా డబుల్ ధమాకా చేశాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి ఇంగ్లాండ్ 4-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

రెండో అర్ధభాగంలో ఫ్రాన్స్ పుంజుకుంది. స్టార్ ఆటగాడు క్లియాన్ ఎంబాపె 48వ నిమిషం, 66వ నిమిషాల్లో గోల్స్ కొట్టి ఫ్రాన్స్‌ను రేసులోకి తెచ్చాడు. బ్రాడ్లే బార్కోలా 54వ నిమిషంలో చేసిన గోల్‌తో ఇంగ్లాండ్ ఆధిక్యాన్ని 3-4కు ఫ్రాన్స్ తగ్గించింది. కానీ, 87వ నిమిషంలో లభించిన పెనాల్టీకిక్‌ను గోల్‌గా మలిచిన బుకాయో హ్యాట్రిక్‌తో ఇంగ్లాండ్‌కు 5-3 ఆధిక్యం ఇచ్చాడు. ఆట అదనపు సమయంలో ఫ్రాన్స్ ఆటగాడు ఔస్మానె డెంబెలె (90+6వ నిమిషం) గోల్ కొట్టాడు. మరికాసేపటికే జుడె బెల్లింగ్‌హామ్ (90+8వ నిమిషం) గోల్‌తో ఇంగ్లాండ్ 6-4తో విజయాన్ని అందుకుంది.

### గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె

ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబాపె మాత్రం రికార్డులు సృష్టించాడు. వరల్డ్ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా ఘనత సాధించాడు. అతడి ఖాతాలో ప్రస్తుతం 22 గోల్స్ ఉన్నాయి. ఎంబాపె తర్వాత మెస్సీ (21) ఉన్నాడు. ఫైనల్‌లో మెస్సీ రెండు గోల్స్ చేస్తే మళ్లీ ఈ రికార్డు సొంతమవుతుంది. ఈ ప్రపంచ కప్‌లో గోల్డెన్ బూట్ రేసులోనూ ఎంబాపె ముందున్నాడు. ఎంబాపె 10 గోల్స్ చేయడంతోపాటు 4 అసిస్ట్స్ ఇచ్చాడు. మరోవైపు మెస్సీ 8 గోల్స్ చేసి 4 అసిస్ట్స్ ఇచ్చాడు.

## లార్డ్స్‌లో హిట్‌మ్యాన్




# పరుగుల వేటలో భారత్ బోల్తా

## వన్డే సిరీస్ ఇంగ్లాండ్ కైవసం

**లార్డ్స్, జులై 19:** లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేలో టీమిండియా లక్ష్య చేధనలో బోల్తా పడింది. 388 పరుగుల భారీ లక్ష్య చేధనలో విఫలమైన టీమిండియా.. 50 ఓవర్లలో 7 వికెట్లకు 360రన్స్‌కే పరిమితమైంది. దీంతో ఇంగ్లాండ్ 27 పరుగుల తేడాతో గెలుపొంది మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకుంది.

భారీ లక్ష్య చేధనలో ఓపెనర్లు రోహిత్ శర్మ (110 బంతుల్లో 138; 17 ఫోర్లు, 5 ఫోర్లు), శుభ్‌మన్ గిల్(84 బంతుల్లో 77; 10 ఫోర్లు, 1 సిక్స్) ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ఇద్దరూ దంచి కొడుతూ తొలి వికెట్‌కు 25 ఓవర్లలో 147 రన్స్ అందించారు. 84 బంతుల్లో సెంచరీ చేశాడు. లార్డ్స్‌లో వన్డేల్లో సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా రోహిత్ రికార్డు సృష్టించాడు. వన్డే చరిత్రలోనే ఎక్కువ వయసులో (39 యేళ్ల 80 రోజులు) సెంచరీ సాధించిన భారత ఆటగాడిగానూ రోహిత్ నిలిచాడు. ఇంగ్లాండ్ గడ్డపై వన్డేల్లో అత్యధిక సెంచరీలు (8) చేసిన పర్యాటక ప్లేయర్‌గానూ హిట్‌మ్యాన్ రికార్డు నెలకొల్పాడు. ఇక కోహ్లీతో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగులు జోడించాడు. రోహిత్ అవుటైనా కోహ్లీ(60 బంతుల్లో 74; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో భారత్ వేగంగా వికెట్లు కోల్పోయి పరాజయం పొందింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. వన్డేల్లో భారత్‌పై ఇంగ్లాండ్‌కు ఇదే అత్యధిక స్కోరు. లార్డ్స్ మైదానంలోనూ వన్డేల్లో ఇది అత్యధిక స్కోరు. ఓపెనర్ బెన్ డకెట్ (135 బంతుల్లో 141; 18 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో విరుచుకుపడగా.. మరో ఓపెనర్ జాకబ్ బెతెల్ (93 బంతుల్లో 91;11 ఫోర్లు, 2 సిక్స్‌లు) కొద్దిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. తొలి వికెట్‌కు 192రన్స్ జోడించారు. సెంచరీ చేసేలా కనిపించిన బెతెల్‌ను ప్రసిద్ధ్ కృష్ణ అవుట్ చేశాడు. వన్డేల్లో ఇంగ్లాండ్‌కు ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఫస్ట్ డౌన్‌లో వచ్చిన జో రూట్ (48 బంతుల్లో 74నాటౌట్; 9 ఫోర్లు) మరోసారి రాణించాడు. డకెట్, రూట్ 80 బంతుల్లో 101 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. డకెట్‌ను రిటర్న్ క్యాచ్‌తో ప్రిన్స్ యాదవ్ పెవిలియన్ చేరాడు. చివర్లో జోస్ బట్లర్ (13 బంతుల్లో 41నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ఇంగ్లాండ్ చివరి 3 ఓవర్లలో ఏకంగా 62 పరుగులు చేసింది.

# ఈవారం మార్కెట్లకు ఐదు కొత్త ఫండ్స్



**ముంబయి, జులై 19:** మ్యూచువల్ ఫండ్ లలో పెట్టుబడులకు ఈ వారం 5 కొత్త పథకాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. సాధారణంగా న్యూఫండ్ ఆఫర్‌వేళ ప్రతి యూనిట్ ధర రూ.10గా ఉంటుంది. కొత్తగా ఇన్వెస్ట్ చేయాలనుకునేవారు లేదా తమ పోర్ట్ ఫోలియోను డైవర్సిఫై చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా చెప్పవచ్చు. లాంచ్ అవుతున్న మొత్తం 5 కొత్త ఫండ్లలో రెండు ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్ ఉండగా రెండు ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఉన్నాయి. ఒకటి ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ కేటగిరీలో వస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ వంటి ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు కొత్త స్కీమ్స్ వస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ మెటల్ ఈటీఎఫ్, హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ మెటల్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సోమవారం మొదలవుతోంది. ఈటీఎఫ్ చందా ఆఫర్ ఈనెల 24వ తేదీన ముగియనుండగా ఫండ్ ఆఫ్ ఫండ్ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 3వ తేదీ వరకు కొనసాగనుంది.

ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ బీఎస్ఈ ఇన్సూరెన్స్ ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 20నుంచి 28వరకూ కొనసాగుతుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.1000గా ఉంది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక ఫండ్ ఆఫ్ ఫండ్ లాంచ్ అయింది. ఎస్‌బీఐ నిఫ్టీ మిడ్ క్యాప్ 150 మూమెంటమ్ 50 ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ 22వ తేదీన ప్రారంభమయి ఆగస్టు 4వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.5000గా నిర్ణయించారు. యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఆల్ఫాగ్రెప్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 22వ తేదీ మొదలై ఆగస్టు 4వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.500గా నిర్ణయించారు.

## ఇరాన్ వార్, కార్పొరేట్ ఫలితాలపైనే..

# ఈవారం ఇన్వెస్టర్ల ఫోకస్



**ముంబయి, జులై 19:** అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు20 నుంచి కొనసాగే వారంలో ప్రపంచ మార్కెట్లను ఒడిదుడుకులకు దారితీసే అవకాశం ఉండగా, మరోవైపు తొలి త్రైమాసికం ఫలితాలపైనా ఇన్వెస్టర్ల ఫోకస్ పెరుగుతుంది. ఈ వారంలో భారత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఆటో, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, బీపీసీఎల్, నెస్లే ఇండియా, సిప్లా, ఎన్‌టీపీసీ, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రముఖ కంపెనీలు ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయి. డిమాండ్ పరిస్థితులు, లాభదాయకత (మార్జిన్లు), మూలధన వ్యయం, బ్యాంకుల ఆస్తుల నాణ్యత, రుణాల వృద్ధి, ముడిసరుకు వ్యయాలు, కొత్త ఆర్థిక సంవత్సరంలో వ్యాపార అంచనాలపై కంపెనీల యాజమాన్యాల వ్యాఖ్యలను పెట్టుబడిదారులు నిశితంగా పరిశీలించనున్నారు. గల్ఫ్‌వార్ యుద్ధ పరిణామాలు అంతర్జాతీయ చమురు ధరలు, ఈక్విటీ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశముందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ వారంలో భారత్‌తో పాటు అమెరికా, యూరోపియన్ యూనియన్‌కు సంబంధించిన పలు కీలక ఆర్థిక గణాంకాలు విడుదల కానున్నాయి. జూలై నెల తయారీ, సేవల కొనుగోలు నిర్వాహకుల సూచీ గణాంకాలు శుక్రవారం విడుదల కానున్నాయి.

దేశ విదేశీ మారక నిల్వల తాజా వివరాలు కూడా వెలువడనున్నాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. గురువారం ప్రారంభ నిరుద్యోగ భృతి దరఖాస్తుల గణాంకాలు, శుక్రవారం తయారీ మరియు సేవల పిఎంఐ గణాంకాలు విడుదల కానున్నాయి. పెట్టుబడిదారుల దృష్టికంపెనీల త్రైమాసిక ఫలితాలు, అమెరికా-ఇరాన్ యుద్ధ పరిణామాలు, భారత్, అమెరికా, యూరప్ నుంచి వచ్చే కీలక ఆర్థిక గణాంకాల నేపథ్యంలో ఈ వారం స్టాక్ మార్కెట్లలో అధిక హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా.



## తుదిదశలో హెచ్‌డిఎఫ్‌సి ఎండి సిఇఒ నియామకం

**ముంబయి, జులై 19:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎండిసిఇఒ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు డిప్యూటీ ఎండీ కైజాద్ భరుచా వెల్లడించారు. ఈ అంశాన్ని బ్యాంకు గవర్నెన్స్, నామినేషన్ అండ్ రిమ్యునరేషన్ కమిటీతో పాటు డైరెక్టర్ల బోర్డు పరిశీలిస్తోందని, త్వరలోనే ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ప్రస్తుతంబ్యాంక్ ఎండీ, సీఈఓగా ఉన్న శశిధర్ జగదీశన్ పదవీకాలం ఈ ఏడాది అక్టోబర్‌లో ముగియనుంది. ఆయన 2020లో మూడేళ్ల కాలానికి నియమితులై, 2023లో మరో మూడేళ్ల పొడిగింపు పొందారు. తాజా పదవీకాలం అక్టోబర్‌లో ముగియనున్న నేపథ్యంలో, పునర్నియామక ప్రక్రియపై ఆర్బీఐకి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, నియంత్రణ పరమైన ఎలాంటిఇబ్బందులు ఉండబోవని అన్నారు. ప్రస్తుతం 3 సభ్యులతో కూడిన జీఎన్‌ఆర్‌సీకి నాబార్డ్ మాజీచైర్మన్ హర్ష్ కుమార్ భన్వాలా అధ్యక్షత వహిస్తున్నారు. కమిటీలో సందీప్ పరేఖ్, రంగనాథ్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ అభ్యర్థి లేదా అభ్యర్థుల పేర్లను సిఫారసు చేసిన అనంతరం, కొత్త పార్ట్‌టైమ్ చైర్మన్ రాజీవ్ కుమార్ అధ్యక్షతన ఉన్న డైరెక్టర్ల బోర్డు వాటిని పరిశీలించి ఆమోదిస్తుంది.

# టాప్ ఐదు కంపెనీల్లో 1.54 లక్షల కోట్ల పెరుగుదల



**ముంబయి, జులై 19:** దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగడంతో గత వారం దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో ఐదు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 1.54 లక్షల కోట్లు పెరిగింది. ఈ వృద్ధిలో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అగ్రస్థానంలో నిలిచింది. లాభపడిన సంస్థలు గత వారం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ మార్కెట్‌విలువలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేశాయి. టీసీఎస్ మార్కెట్ విలువ 72,072.30కోట్లు పెరిగి 8లక్షల 20 వేల 672.70 కోట్లకు చేరింది. కంపెనీ జూన్ త్రైమాసికంలో నికర లాభం 4.61 శాతం పెరిగి రూ.13,349 కోట్లకు చేరింది.

పశ్చిమాసియా సంక్షోభం ప్రభావం తగ్గడంతో ప్రస్తుత త్రైమాసికంలో డిమాండ్ మెరుగుపడుతుందని కంపెనీ తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.29,062.06 కోట్లు పెరిగి రూ.10,34,441.77 కోట్లకు చేరగా రిలయన్స్ ఇండస్ట్రీస్ విలువ రూ.23,884.93కోట్లు పెరిగి రూ.17,95,091.26కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.21,946.50కోట్లు పెరిగి రూ.6,57,274.28 కోట్లకు చేరితే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విలువ 7వేల 338.34 కోట్లు పెరిగి రూ.9,63,768.78 కోట్లకు చేరింది. నష్టపోయిన సంస్థల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఎల్ఐసీ, లార్సెన్ అండ్ టుబ్రో, హిందుస్థాన్ యూనిలీవర్ ఉన్నాయి. ఎల్అండ్‌టీ మార్కెట్ విలువ రూ. 18,097.72 కోట్లు తగ్గి రూ.5,24,840.68 కోట్లకు పడిపోయింది.

ఎల్ఐసీ విలువ రూ.12080.75 కోట్లు తగ్గి రూ.5,48,124.30కోట్లకు చేరింది. భారతిఎయిర్‌టెల్ మార్కెట్ క్యాప్ రూ.7,706.45 కోట్లు క్షీణించి 11,91,067.77కోట్లకు పరిమితమైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.7,084.61 కోట్లు తగ్గి రూ.12,62,369.81కోట్లకు చేరింది. హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.1,221.79 కోట్లు తగ్గి రూ.5,03,775.86 కోట్లకు నిలిచింది. మార్కెట్ విలువల్లో టాప్10 కంపెనీలుమార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానాన్ని కొనసాగించింది. ఆ తరువాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్‌ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్ఐసీ, లార్సెన్ అండ్ టుబ్రో, హిందుస్థాన్ యూనిలీవర్ స్థానాలు దక్కించుకున్నాయి.

# ధరల పెరుగుదలతో తగ్గిన స్మార్ట్ టివి సేల్స్



**బెంగళూరు, జులై 19:** దేశీయ స్మార్ట్ టీవీ మార్కెట్ వరుసగా రెండో త్రైమాసికంలోనూ మందగమనాన్ని నమోదు చేసింది. తొలి త్రైమాసికంలో స్మార్ట్ టీవీల అమ్మకాల పరిమాణం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 5.7 శాతం తగ్గినట్లు పరిశ్రమ అంచనావేస్తోంది. అంతకుముందు జనవరిమార్చి త్రైమాసికంలో కూడా అమ్మకాలు 3 శాతం తగ్గాయి. ఈ వివరాలను కౌంటర్ పాయింట్ రీసెర్చ్ సంస్థలు, మార్కెట్ ఛానల్ విశ్లేషణలు వెల్లడించాయి. ధరలు గణనీయంగా పెరగడంతో ముఖ్యంగా ఎంట్రీలెవల్ స్మార్ట్ టీవీల కొనుగోళ్లను వినియోగదారులు వాయిదా వేయడం వల్ల ఈ విభాగంలో అమ్మకాలు మరింతగా పడిపోయాయి. ఐడిసి గణాంకాల ప్రకారం, 43 అంగుళాలు లేదా అంతకంటే చిన్న స్మార్ట్ టీవీల అమ్మకాలు 6.8 శాతం తగ్గాయి. మరోవైపు, 43 అంగుళాలకు పైబడిన టీవీల అమ్మకాలు 3.5 శాతం మాత్రమే తగ్గాయి. దీంతో ప్రీమియం టీవీల విభాగం తక్కువ ప్రభావాన్ని ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఐడిసి రీసెర్చ్ అనలిస్ట్ దేవాశిష్ జనా మాట్లాడుతూ, పెరిగిన ధరలు వినియోగదారుల కొనుగోలు సామర్థ్యంపై ప్రభావం చూపుతున్నాయని, ముఖ్యంగా సామాన్య వినియోగదారుల కోసం ఉద్దేశించిన మాస్‌మార్కెట్ విభాగంలో డిమాండ్ బలహీనంగా కొనసాగుతోందని తెలిపారు. పరిశ్రమ అంచనాల ప్రకారం, రెండో త్రైమాసికంలో 32అంగుళాల నుంచి 43అంగుళాల వరకు ఉన్న స్మార్ట్ టీవీల ధరలు దాదాపు 17 శాతం పెరిగాయి. అదే సమయంలో 43 అంగుళాలకు పైబడిన టీవీల ధరలు కేవలం 67 శాతం మాత్రమే పెరిగాయి.

తయారీ వ్యయాలు, ఎలక్ట్రానిక్ భాగాల ధరల పెరుగుదల, రూపాయి బలహీనత వంటి కారణాలతో మూడోత్రైమాసింలో మరో 10 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రిన్సిపల్ అనలిస్ట్ అన్షికా జైన్ మాట్లాడుతూ, చిన్న సైజు టీవీల అమ్మకాలలో ఎక్కువ తగ్గుదల కనిపించడం వెనుక ప్రధాన కారణం ఎంట్రీలెవల్ వినియోగదారులపై ధరల భారం పెరగడమేనని చెప్పారు. ముఖ్యంగా మెమరీ చిప్‌ల ధరలు భారీగా పెరగడంతో తక్కువ ధర టీవీల తయారీ ఖర్చు గణనీయంగా పెరిగిందని, అదే సమయంలో ద్రవ్యోల్బణం కూడా సామాన్య వినియోగదారుల కొనుగోలు సామర్థ్యాన్ని దెబ్బతీసిందని వివరించారు.




## ఫోరెన్సిక్ ఆడిట్లకు మరో18 సంస్థల ఎంపిక

**ముంబయి, జులై 19:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ లిస్టెడ్ కంపెనీల ఆర్థిక నివేదికలపై ఫోరెన్సిక్ ఆడిట్లు నిర్వహించేందుకు మరో 18 ఆడిట్, కన్సల్టింగ్ సంస్థలను తన అధికారిక ప్యానెల్‌లో చేర్చింది. వీటిలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు ఎర్నెస్ట్ యంగ్‌ఎల్‌ఎల్‌పి, కేపీఎంజీ అష్యూరెన్స్ అండ్ కన్సల్టింగ్ సర్వీసెస్, జెడ్ఎక్స్ గ్రాంట్ థార్న్టన్ భారత్, నాంగియా అండ్ కో ఎల్ఎల్‌పిలున్నాయి. ఈ ఎంపిక ప్రక్రియను సెబీ 2025 నవంబర్‌లో విడుదల చేసిన పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు ఆధారంగా నిర్వహించింది. తాజాగా ఎంపికైన సంస్థలను 2025 ఏప్రిల్‌లో ప్రకటించిన ఫోరెన్సిక్ ఆడిటర్ల జాబితాకు అదనంగా చేర్చినట్లు సెబీ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. సెబీ తాజా జాబితాలో చోటు దక్కిన సంస్థలకు మూడు సంవత్సరాల పాటు ఈ ఎంపానెల్‌మెంట్ చెల్లుబాటు అవుతుంది. నాంగియా కో ఎల్ఎల్‌పి ఫోరెన్సిక్ అడ్వైజరీ సీనియర్ పార్ట్‌నర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ, సెబీ ఎంపానెల్‌లో చోటు దక్కడం తమ ఫోరెన్సిక్ సేవల నైపుణ్యానికి నిదర్శనమన్నారు.

ఫోరెన్సిక్ ఆడిట్ ప్యానెల్ ఉద్దేశం లిస్టెడ్ కంపెనీ లలో ఆర్థిక అక్రమాలు లేదా లెక్కల అవకతవకలు ఉన్నాయనే అనుమానాలు తలెత్తినప్పుడు, వాటిపై లోతైన విచారణ నిర్వహించేందుకు సెబీ ఈ ఫోరెన్సిక్ ఆడిటర్ల ప్యానెల్‌ను ఉపయోగిస్తుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.